ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 26.04.2025 | సంపుటి : 11 సంచిక : 277 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370
తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

## బందిపొరాలో ఎన్‌కౌంటర్..

### లష్కరే టాప్ కమాండర్ మృతి

శ్రీనగర్(జనంసాక్షి):జమ్ముూకశ్మీర్‌లో ఉగ్ర మూకలపై భద్రతా దళాలు తుపాకులు గర్జిస్తున్నాయి. తాజాగా లష్కరే టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టాయి. పహల్గాం దాడిలో పాల్గొన్న వారి కోసం జల్లెడపడుతున్న భద్రతా దళాలకు బందీపొరాలో

మిగతా 2లో..



# కమ్ముకున్న యుద్ధమేఘాలు

## సరిహద్దుల్లో మోహరించిన త్రివిధ దళాలు

- నియంత్రణ రేఖ వద్ద ఉద్రిక్తతలు..
- కాల్పులకు తెగబడ్డ పాక్ బలగాలు
- పాక్ జాతీయులకు వెనక్కి పంపించండి
- ముఖ్యమంత్రులకు అమిత్‌షా ఆదేశం
- వాఘా సరిహద్దుకు పాక్ పర్యాటకులు

శ్రీనగర్/న్యూఢిల్లీ,ఏప్రిల్25(జనంసాక్షి):

జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. పాకిస్థాన్ దళాలు.. భారత్ పోస్టులపై కాల్పులకు తెగబడ్డాయి. దీంతో అప్రమత్తం అయిన భద్రతా బలగాలు తీవ్రంగా తిప్పికొట్టాయి. పాక్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ఆర్మీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఇప్పటి వరకు

మిగతా 2లో..

## సంయమనం పాటించండి..

### భారత్, పాక్‌లకు ఐక్యరాజ్యసమితి సూచన

న్యూయార్క్(జనంసాక్షి):జమ్ముూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన భీకర ఉగ్రదాడి ఘటన ను భారత్ సహా ప్రపంచం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఆందోళనకర పరిస్థితిని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ నిశితంగా పరిశీలిస్తున్నారని ఐరాస అధికార ప్రతినిధి స్టీఫెన్ దుజారిక్

మిగతా 2లో..

## పహల్గాం మృతులకు

# కొవ్వొత్తుల నివాళి

### 140 కోట్ల మంది భారతీయులు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలి



'కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుంది. ఇది రాజకీయాల గురించి పార్టీల గురించి చర్చించే సమయం కదు. అన్ని పార్టీల జెండాలను వదిలేసి ప్రతి ఒక్కరూ ఉగ్రవాదంపై పోరాడేందుకు బయటికి రావాలి, ఇందిరాగాంధీని గుర్తుకు తెచ్చుకుని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి, మరోసారి పాకిస్థాన్‌ను ఓడించి పీవోకేను భారత్‌లో కలపాలి" - సీఎం రేవంత్ రెడ్డి

- 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు
- అదే స్ఫూర్తితో పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి
- ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి:సీఎం రేవంత్
- కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపిన నగరవాసులు

హైదరాబాద్(జనంసాక్షి):జమ్ముకశ్మీర్‌లోనిపహల్గాంఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం

మిగతా 2లో..

## మక్కామసీదులో నల్లబ్యాడ్జీలతో

# ముస్లింల ప్రార్థన

హైదరాబాద్(జనంసాక్షి):

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా మక్కా మసీదులో ముస్లింలు నల్ల రిబ్బన్లు ధరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉగ్రదాడిపై నిరసనలకు ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పిలుపుతో పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. ప్రార్థనల అనంతరం పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కొంత దూరం ర్యాలీ నిర్వహించారు. హిందుస్థాన్ జిందా బాద్ అంటూ నినదించారు.

మిగతా 2లో..

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని ఖండించిన హైదరాబాదీ ముస్లింలు..

పాక్ వ్యతిరేక నినాదాతో ర్యాలీ






## దేశాన్ని చీల్చడమే మిలిటెంట్ల లక్ష్యం

### ఉగ్రవాదం తుదముట్టించేందుకు సంఘటిత పోరాటం

### శ్రీనగర్‌లో రాహుల్ పర్యటన.. క్షతగాత్రులకు పరామర్శ

శ్రీనగర్(జనంసాక్షి):పహల్‌గామ్ ఉగ్రదాడి వెనుక వ్యూహం దేశ ప్రజలను చీల్చడం అని, ఉగ్రవాదాన్ని శాశ్వతంగా ఓడించేందుకు భారత్ సంఘటి తంగా నిలవడం తప్పనిసరి అని లోక్‌సభలోని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ శుక్రవారం ఉద్ఘాటించారు. 'అది దుర్భర విషాదం. ఏమి జరుగుతోందో తెలుసుకుని, సాయం చేయడానికి ఇక్కడికి వచ్చాను. జమ్మూ కాశ్మీర్ ప్రజలు అందరూ ఈ భీకర దాడిని ఖండించారు. వారు దేశానికి పూర్తి మద్దతు ప్రకటించారు' అని రాహుల్ శ్రీనగర్‌లో విలేకరులతో చెప్పారు. శుక్రవారం ఉదయం శ్రీనగర్ చేరుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహు ల్ క్షతగా త్రుల గురించి వాకబు చేయడానికి బాదామిబాఘ్ కంటోన్మెంట్‌లో ఆర్మీ 92 బేస్ ఆసుపత్రిని సందర్శించారు. 'క్షతగాత్రుల్లో ఒకరిని పరామర్శించాను. తక్కినవారు వెనుకకు వెళ్లిపోయినందున వారిని కలుసుకోలేకపోయాను. కుటుంబ సభ్యులను కోల్పోయిన

మిగతా 2లో..



# ప్రపంచశాంతికి కృషి చేస్తాం




### భారత్ సమ్మిట్ వేదికగా పలు దేశాల వక్తల ప్రకటన

పహల్గాం ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి

ఐక్యత..సామరస్యం, రాజ్యాంగ విలువలపై దాడేనని వెల్లడి

### దేశ ఐక్యతను సవాల్ చేస్తే ఊరుకోవద్దు

పహల్గాం ఉగ్రదాడిని ఖండించిన కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి సల్మాన్ ఖుర్షీద్

హైదరాబాద్(జనంసాక్షి): పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పై భారత్ సమ్మిట్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది.. హైదరాబాద్ లో శుక్రవారం ప్రారంభమైన సదస్సులో పాల్గొన్న వంద దేశాలకు చెందిన ప్రగతిశీల పార్టీలకు చెందిన ప్రతినిధులు, ప్రముఖులు ఈ మేరకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు."పహల్గామ్‌లో జరిగిన అనాగరిక ఉగ్రవాద దాడి పట్ల మేం తీవ్ర దిగ్భ్రాంతి చెందుతున్నాం. ఉగ్ర దాడిలో 26 మంది అమాయక పౌరులు మరణించారు, అనేక మంది గాయపడ్డారు. భారత ప్రజలకు మేం సంఘీభావాన్ని తెలియజేస్తున్నాం. ఉగ్రవాద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. శాంతియుత పౌరులపై ఇటువంటి క్రూరమైన చర్యలకు సమాజంలో స్థానం లేదు.. ఈ క్రూర దాడులు ఐక్యత, శాంతి, సామరస్యం అనే రాజ్యాంగ విలువలపై చేసిన ప్రత్యక్ష దాడి" అని పేర్కొన్నారు. కాగా దేశ ఐక్యతను పదే పదే ప్రశ్నించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే.. తగిన రీతిలో బుద్ధి చెప్పేందుకు కొన్ని నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ విదేశాంగ శాఖ మంత్రి

మిగతా 2లో..

## మన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటిచెప్పాం

భారత్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించాం

టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదాం

మీడియా సమావేశంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి వెల్లడి





2లో

## జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం నిర్మాణం

### వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్‌ఏపై చర్చించి చర్యలు

### బీఆర్‌ఎస్ రైతులకు క్షమాపణలు చెప్పాలి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్(జనంసాక్షి):



రైతులకు బీఆర్‌ఎస్ క్షమాపణ చెప్పాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టుపై అధ్యయం చేస్తామన్నారు. వచ్చే కేబినెట్‌లో ఎన్‌డీఎస్‌ఏపై చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఎవడి అయ్య జాగీరు అని కట్టారని ప్రశ్నిస్తూ.. కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారు అంటూ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్‌డీఎస్‌ఏ రిపోర్టు రావడంతో బీఆర్‌ఎస్‌పై మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ ఇచ్చిన నివేదికను చూసి బీఆర్‌ఎస్ నేతలు సిగ్గు పడాలంటూ మండిపడ్డారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారని..

మిగతా 2లో..

## శాంతి చర్చలకు ముందుకు రావాలి

### మావోయిస్టు బస్తర్ ఇన్‌చార్జ్ రూపేష్ పేరుతో ప్రకటన

### కర్రెగుట్టలో కొనసాగుతున్న కూంబింగ్ ఆపేయాలని విజ్ఞప్తి

(జనంసాక్షి): తెలంగాణ - ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని కరెగుట్టల వద్ద జరుగుతున్న ఆపరేషన్ కగార్‌పై వెంటనే ఆపేయాలని మావోయిస్టులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మావోయిస్టు బస్తర్ ఇన్‌ఛార్జ్ రూపేష్ పేరుతో ప్రెస్‌నోట్ విడుదల అయ్యింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలకు ముందుకు రావాలని లేఖలో మావోలు వినతి చేశారు. తెలంగాణ సరిహద్దులో కొనసాగుతున్న

మిగతా 2లో..



## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో

# ఎంఐఎం గెలుపు

హైదరాబాద్(జనంసాక్షి):

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం గెలిచింది. ఆ పార్టీ అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ విజయం సాధించారు. ఆయనకు 63 ఓట్లు వచ్చాయి. భాజపా అభ్యర్థి గౌతమ్‌రావుకు 25 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికలో భాజపా, ఎంఐఎం మాత్రమే

మిగతా 2లో..

## డేంజన్ జోన్‌ను పేల్చేయడం తప్ప

# మరో మార్గం లేదు

### ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ పనులపై తేల్చేసిన నిపుణుల కమిటీ

(జనంసాక్షి): ఎస్‌ఎల్‌బీసీ సొరంగం డేంజర్ జోన్‌లో సహాయక చర్యలు, భవిష్యత్ పనులకు డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం (డీబీఎం) తప్ప ఇంకో మార్గం లేదని నిపుణులు అభిప్రాయపడ్డారు. డేంజర్‌జోన్‌లో సహాయక చర్యలకు అనుసరించాల్సిన విధానానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తొలి సమావేశం గురువారం జరిగింది. హైదరాబాద్ జల సౌధలో జరిగిన కమిటీ సమావేశంలో సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. చివరి 50 మీటర్ల

మిగతా 2లో..

## సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై

# హైకోర్టులో విచారణ

- జూన్ 12కు వాయిదా
- ముఖ్యమంత్రికి స్వల్ప ఊరట
- వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

2లో



## వక్ఫ్ సవరణ చట్టం సరైందే..

### సుప్రీంకోర్టులో కేంద్రం కౌంటర్ అఫిడవిట్

న్యూఢిల్లీ (జనంసాక్షి): వక్ఫ్ (సవరణ) చట్టం-2025 చట్టబద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై కేంద్రం సుప్రీం కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసింది. వక్ఫ్ చట్టం సరైందేనని సమర్థించుకుంది. ఈ చట్టం చెల్లుబాటును సవాల్

మిగతా 2లో..

## ఇస్రో మాజీ శాస్త్రవేత్త

# కస్తూరిరంగన్ కన్నుమూత



బెంగళూరు(జనంసాక్షి):ప్రముఖ శాస్త్రవేత్త, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ కస్తూరి రంగన్(84) కన్నుమూశారు. బెంగళూరులోని ఆయన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన పూర్తి పేరు కృష్ణస్వామి కస్తూరి రంగన్. కేరళలోని ఎర్నాకులంలో ఆయన జన్మించారు. ముంబై యూనివర్సిటీలో ఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసిన రంగన్.. అహ్మదాబాద్ ఫిజికల్ రీసెర్చ్ లాబోరేటరీ నుంచి 1971లో డాక్టరేట్ అందుకున్నారు. 1990 నుంచి 1994 వరకూ ఆయన యూఆర్‌ఎసి డైరెక్టర్‌గా

మిగతా 2లో..



## మిలిటెంట్ సంస్థలను పెంచి పోషించింది నిజమే..

కానీ అవన్నీ అమెరికా కోసమే చేశాం

పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు

ఇస్లామాబాద్(జనంసాక్షి):

తమ గడ్డపై ఉగ్రవాదులే లేరంటూ ప్రగల్భాలు పలికిన పాకిస్థాన్‌కు గట్టి షాక్ తగిలింది. ఉగ్ర సంస్థలకు నిధులు, ఉగ్రవాదులకు శిక్షణ

మిగతా 9లో..



## సింధు జలాలు ఆపేస్తే మీ ఊపిరి ఆపేస్తాం

### మోడీ లక్ష్యంగా హాఫీజ్ హెచ్చరిక

లాహోర్(జనంసాక్షి):పాకిస్థాన్ బేస్డ్ ఉగ్రవాద సంస్థ లష్కర్-ఇ-తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ ముహమ్మద్ సయీద్ కారు కూతలు కూశాడు. పీఎం మోదీ టార్గెట్ గా

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
శనివారం 26.04.2025

## పహల్గాం మృతులకు కొవ్వొత్తుల నివాళి

మృతులకు సంతాపం తెలిపారు.మొత్తం 140 కోట్ల మంది ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. భారత్‌లోకి చొచ్చుకొచ్చి.. పాక్ ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్య అని అన్నారు. "ఉగ్రవాదంపై పోరులో 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు. ఈ విషయంలో మోదీకి మద్దతు తెలుపుతున్నా. బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది. 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు. ఆనాడు ఇందిరాగాంధీని దుర్గామాతతో వాజ్‌పేయీ పోల్చారు. మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి. పీవోకేను భారత్‌లో కలపాలి. ఇందిరాగాంధీని గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి. అభివృద్ధి పథంలో నడుస్తున్న భారత్‌పై ఉగ్రదాడి జరిగింది. పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి. అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి. ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి" అని అన్నారు.ఆ కుటుంబాలకు అండగా నిలబడతాం : ఇలాంటి ఘటనలు పునరావృతం కావద్దంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రానికి సూచించారు. 140 కోట్ల మంది భారతీయులు పహల్గాం దాడిని ఖండించాలని ఏఐసీసీ పిలుపునిచ్చిందని, దేశ రక్షణ కోసం భారతీయులంతా ఏకమై రాజకీయాలు, పార్టీ సిద్ధాంతాలను పక్కనపెట్టి ఉగ్రవాదంపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ఏర్పాటు చేసి అందరిని ఆహ్వానించినట్లు తెలిపారు. చనిపోయిన కుటుంబాలకు సానుభూతి తెలపడమే కాకుండా, వారికి మనమంతా అండగా ఉండాలని రేవంత్ రెడ్డి సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున చనిపోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆ కుటుంబాలకు అండగా నిలబడతామని ఆయన ప్రకటించారు.

## మక్కామసీదులో నల్లబ్యాడ్జీతో ముస్లింల ప్రార్థన

మరోవైపు శాస్త్రిపురంలోని మసీదు వద్ద నమాజ్‌కు ముందు అసదుద్దీన్ ఒవైసీ నల్ల రిబ్బన్లు పంపిణీ చేశారు. ఆయన తన చేతికి నల్లరిబ్బను ధరించి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముస్లింల ప్రత్యేక ప్రార్థనల నేపథ్యంలో చార్మినార్, మక్కా మసీదు పరిసర ప్రాంతాల్లో పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు.

## జేబులు నింపుకునేందుకే కాళేశ్వరం నిర్మాణం

ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చూసి బీఆర్‌ఎస్ సిగ్గుపడాలన్నారు. 'మీరే డిజైన్ చేశారు.. మీరే కట్టారు.. మీరుండగానే కూలిపోయింది' అని తెలిపారు. మేడిగడ్డ సుందిళ్ళ నిరుపయోగంగా ఉన్న రికార్డు స్థాయిలో పంటలు పండాయని తెలిపారు. అబద్ధాలు తప్పులపై బతకాలని బీఆర్‌ఎస్ అనుకుంటోందని.. అది కుదరదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన వాళు ్ళ.. చేయించిన వాళ్ళు రైతులకు ద్రోహం చేశారని ఆరోపించారు. ఎన్‌డీఎస్‌ఏను రేవంత్ రెడ్డినో.. నేనో వేసింది కాదు. దేశంలో బెస్ట్ ఎక్స్‌పర్ట్స్ ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నారు. మీరు అధికారంలో ఉన్నప్పుడే ఎన్‌డీఎస్‌ఏ వచ్చిందని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నాము అని చెప్పి లక్ష కోట్ల ప్రాజెక్ట్ కట్టారు..కాళేశ్వరం రైతుల కోసం కాదు జేబులు నింపుకునేందుకు కట్టారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు.

## శాంతి చర్చలకు ముందుకు రావాలి

సైనిక ఆపరేషన్‌ను వెంటనే ఆపాలని మావోయిస్టులు కోరారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో మావోయిస్టుల కోసం ఆపరేషన్ కొనసాగుతోంది. గతంలో కూడా రెండు రెండు, మూడు సార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాశారు. శాంతి చర్చలకు అవకాశం ఇవ్వాలని ఆపరేషన్స్‌ను వెంటనే నిలిపివేయాలని లేఖ రాసిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు తెలంగాణ – ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన కర్రెగుట్టల్లో జరుగుతున్న ఆపరేషన్‌ను వెంటనే నిలిపివేయాలని, శాంతి చర్చలకు ముందుకు రావాలని వినతి చేస్తూ మావోయిస్టు పార్టీ ఓ లేఖను విడుదల చేసింది. మావోయిస్టు బస్తర్ ఇన్‌చార్జ్ రూపేష్ పేరుతోనే ఈ ప్రకటన విడుదలైంది. అయితే ఈ లేఖపై పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేదు. ఇటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా శాంతి చర్చలపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతం తెలంగాణ సరిహద్దులో ఆపరేషన్ కొనసాగుతోంది. కర్రెగుట్టల చుట్టూ వేలాది మంది భద్రతా బలగాలు చుట్టుముట్టడంతో వందల మంది మావోయిస్టుల చనిపోయే అవకాశం ఉందని పౌరహక్కు సంఘాలు ఆందోళనకు చేస్తున్నాయి. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పౌరహక్కు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## దేశాన్ని చీల్చడమే మిలిటెంట్ల లక్ష్యం

ప్రతి ఒక్కరికీ నా సానుభూతి. దేశం సంఘటితంగా నిలుస్తున్నదని ప్రతి ఒక్కరికీ తెలియాలని అనుకుంటు–న్నా' అని రాహుల్ చెప్పారు. గురువారం ఢిల్లీలో జరిగిన అఖిల పక్ష సమావేశం గురించి రాహుల్ ప్రస్తావిస్తూ, మొత్తం ప్రతిపక్షాలు ఉగ్ర దాడిని ఖండించాయని, ప్రభుత్వానికి దన్నుగా ఉన్నాయని తెలిపారు. రాహుల్ జెకె లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హాను, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లాను కూడా కలుసుకున్నారు. పహల్‌గామ్‌లో పరిణామాల గురించి ఆయనకు వారిద్దరు వివరించారు. 'మా పార్టీ వారికి మద్దతు ఇవ్వబోతున్నదని వారిద్దరికీ హామీ ఇచ్చాను' అని రాహుల్ తెలియజేశారు. రాహుల్ అంతకుముందు వర్తకుల ప్రతినిధివర్గాన్ని, విద్యార్థుల నాయకులను, పర్యాటక రంగానికి సంబంధించినవారిని కలుసుకున్నారు.

## .డేంజన్ జోన్‌ను పేల్చేయడం తప్ప మరో మార్గం లేదు

డేంజర్ జోన్‌లో సహాయక చర్యలు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించారు. ఆ ప్రాంతంలో ఉన్న రాతి పొరలు, ఇతరత్రాల దృష్ట్యా మళ్లీ కుప్పకూలే ప్రమాదం ఉందన్న అభిప్రాయం వ్యక్తమైంది. దీంతో సహాయక చర్యలు సహా భవిష్యత్ పనుల కోసం ఇన్‌లెట్ ప్రాంతం నుంచి సంప్రదాయ డ్రిల్ అండ్ బ్లాస్ట్ విధానం తప్ప ఇంకో మార్గం లేదని నిపుణులందరూ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## వక్ఫ్ సవరణ చట్టం సరైందే..

చేస్తూ దాఖలైన పిటిషన్లను కొట్టివేయాలని కోరింది. ఈ చట్టంలో చేసిన పలు సవరణలు మత స్వేచ్ఛకు సంబంధించిన ప్రాథమిక హక్కుల్ని హరిస్తాయనే తప్పుడు ప్రాతిపదికపై పిటిషన్లు ఉన్నాయని ఆరోపించింది. ఆర్టికల్ 32 ప్రకారం ఒక చట్టాన్ని సుప్రీంకోర్టు సమీక్షించవచ్చని తెలిపింది. కాకపోతే, పార్లమెంటరీ ప్యానెల్ ద్వారా సమగ్రమైన, లోతైన, విశ్లేషణాత్మక అధ్యయనం అనంతరమే వక్ఫ్ చట్టానికి సవరణలు చేసిందని తెలిపింది.గతంలో ఉన్న నిబంధనలతో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తుల దుర్వినియోగం జరిగిందని ఈ సందర్భంగా సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఈ మేరకు 1332 పేజీలతో దాఖలు చేసిన ప్రాథమిక కౌంటర్ అఫిడవిట్‌లో ఈ చట్ట సవరణల్ని సమర్థించుకుంది. 2013 తర్వాత ఆశ్చర్యకరంగా వక్ఫ్ భూమి భారీగా పెరిగిందని పేర్కొంటూ మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ షెర్షా సి షేక్ మొహిద్దీన్ అఫిడవిట్ దాఖలు చేశారు.వక్ఫ్ చట్టం రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ 72 పిటిషన్లు దాఖలు కాగా.. వీటిపై ఏప్రిల్ 17న సుప్రీంకోర్టు విచారణ జరిపింది.

# కమ్ముకున్న యుద్ధమేఘాలు



ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొన్నాయి. తాజా కాల్పుల నేపథ్యంలో ఆర్మీ చీఫ్ ఎల్‌ఓసీ దగ్గరకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఆర్మీ చీఫ్ కాశ్మీర్ పర్యటనలో ఉండగా పాక్ ఈ దుస్సాహసానికి ఒడిగట్టింది. పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్‌పై భారత్ చాలా కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే సింధు జలాలను నిలిపివేసింది. అలాగే పాక్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా పాక్ బోర్డర్‌ను నిలిపివేయడం వంటి కఠిన నిర్ణయాలు తీసుకుంది. భారత్ తీసుకుంటున్న పరిణామాలతో పాక్ భయాందోళనకు గురవుతోంది. దీంతో భారత్‌పై కవ్వింపు చర్యలకు పాల్పడుతోంది. అందుకు తగ్గట్టు–గా భారత్ కూడా తిప్పికొట్టేందుకు సిద్ధపడుతంది. మంగళవారం పహల్గామ్ ఉగ్ర దాడిలో దాదాపు 26 మంది చనిపోగా.. పదుల కొద్దీ గాయాలు పాలయ్యారు. ఇక మృతదేహాలను ఆయా ప్రాంతాలకు అధికారులు తరలించారు. ఈ దాడిలో 5–6 ఉగ్రవాదులు పాల్గొన్నట్టుగా తెలుస్తోంది. ఈ ముష్కరులకు స్థానికులు కూడా సపోర్ట్ చేసినట్లు– వార్తలు వినిపిస్తున్నాయి.

### పాక్ జాతీయులను గుర్తించి వెనక్కి పంపించండి: అమిత్‌షా



ఆయా రాష్ట్రాల్లో ఉన్న పాక్ జాతీయులను గుర్తించి వారిని వెనక్కి పంపించే ఏర్పాట్లు చేయాలని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా అన్ని రాష్ట్రాలను కోరారు. ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రుల తో ఆయన శుక్రవారం మాట్లాడారు. తొలుత స్థానికంగా ఉంటున్న పాకిస్థానీయులను గుర్తించి ఆ సమాచారం కేంద్రానికి పంపించాలని కోరారు. అప్పుడే వారి వీసాల రద్దుకు అవకాశం ఉంటుందన్నారు. గతంలో భారత్ సార్క్ వీసా పొడిగింపు పథకం కింద చాలా మంది పాక్ జాతీయులకు భారత్‌లో పర్యటించే అవకాశాలను కల్పించారు. ఈ ప్రోగ్రామ్ కింద భారత్‌లో ఉన్న ఎవరైనా సరే 48 గంటల్లో దేశాన్ని వీడాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. పహల్గాంలో ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో ఇరు దేశాలు పోటా పోటీగా కీలక నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అలాంటి వేళ దేశంలోని వివిధ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థాన్ జాతీయులను వెంటనే వెనక్కి పంపాలని కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. దాంతో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. శుక్రవారం దేశంలోని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఆయన స్వయంగా ఫోన్ చేసి.. వారికి ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మీ మీ రాష్ట్రాల్లో నివసిస్తున్న పాకిస్థానీయులను గుర్తించి.. వారిని వెంటనే పాకిస్థాన్ పంపాలని సూచించారు. మరోవైపు పహల్గాం ఉగ్రదాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ తగిన ఆధారాలను సేకరించింది. అందుకు సంబంధించిన ఆధారాలను ఇప్పటికే వివిధ దేశాలకు చెందిన విదేశీ కార్యదర్శులకు భారత విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ అందజేశారు. మరోవైపు భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు 48 గంటల లోపు దేశం విడిచివెళ్లాలంటూ ఆదేశించింది. దీంతో ఇప్పటికే భారత్‌లో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తున్న పాకిస్థానీయులు.. స్వదేశం వెళ్లేందుకు అటారీ సరిహద్దు వద్ద క్యూ కట్టారు. అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న పాకిస్థానీయులను సైతం భారత్‌ను పంపేందుకు కేంద్రం కసరత్తు చేస్తోంది. అందులోభాగంగా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా.. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఫోన్ చేసి.. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని వివరించారు. జమ్మూ కాశ్మీర్‌లో అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో ఉగ్రదాడి కారణంగా 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో ఈ ఘటనపై కేంద్రం సీరియస్ అయింది. అందులోభాగంగా పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఆ క్రమంలో భారత్‌లో పర్యటిస్తున్న పాకిస్థానీయులకు జారీ చేసిన వీసా గడువు ఏప్రిల్ 27వ తేదీతో ముగిస్తుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఈ లోపు వారంతా దేశం వీడి వెళ్లవలసి ఉంటు–ందని పేర్కొంది. దీంతో భారత్‌లో పర్యటిస్తున్న అనేక మంది పాకిస్థాన్ జాతీయులు పంజాబ్‌లోని అటారీ వాఘా సరిహద్దు ద్వారా తమ దేశానికి తిరిగి ప్రయాణమయ్యారు. తమ బంధువులను కలుసుకునేందుకు తాము 45 రోజుల వీసా గడువుపై భారత్‌కు వచ్చామని వారు పేర్కొన్నారు. అంతేకాదు.. ఈ ఉగ్రదాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. కేంద్రం ఆదేశాల నేపథ్యంలో అటారీ–వాఘా సరిహద్దును అధికారులు మూసివేసిన విషయం విదితమే. అలాగే న్యూఢిల్లీలోని పాకిస్థాన్ రాయబారి కార్యాలయంలోని దౌత్యవేత్తతోపాటు– మిగిలిన అధికారులు దేశం వీడి వెళ్లాలని ఆదేశించింది. అందుకోసం వారికి వారం రోజుల గడువు విధించింది. ఏప్రిల్ 22వ తేదీ పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది మరణించారు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ విషయంలో భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్థాన్‌కు సింధు జలాలను నిలిపివేసింది. అలాగే అటారీ సరిహద్దును మూసి వేసింది. ఈ ఘటన జరిగిన వెంటనే ప్రధాని మోదీ అధ్యక్షతన భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశమైంది. దాదాపు 3 గంటల పాటు– జరిగిన ఈ భేటీలో కీలక నిర్ణయాలు తీసుకొంది.

పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలి: డిజిపి తెలంగాణలో వీసాలతో ఉన్న పాక్ పౌరులు వెంటనే దేశం విడిచి వెళ్లాలని, లేకుంటే చటంటప్రకారం చర్యలు తప్పవని డిజిపి హెచ్చరించారు. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. పాకిస్తాన్‌ను అన్ని రకాలుగా దెబ్బ కొట్టడానికి సిద్ధమైంది. ఇందులో భాగంగా పాకిస్తానీల వీసాలను రద్దు చేసింది. 48 గంటల్లో పాకిస్తానీలు దేశం వదలి వెళ్లిపోవాలని ఆదేశించింది. ఇక, తెలంగాణ పోలీసులు శాఖ కూడా వీసాల రద్దు నేపథ్యంలో రాష్ట్రంలో ఉంటున్న పాకిస్తానీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ జితేందర్ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటనలో ..తెలంగాణలో ఉన్న పాకిస్తానీలు వెంటనే తమ దేశానికి వెళ్లిపోవాలి. పాకిస్తానీల వీసాలు 27 తర్వాత పనిచేయవు. మెడికల్ వీసాల మీద ఉన్నవారికి ఏప్రిల్ 29 వరకు మాత్రమే గడువు ఉంది. లాంగ్ టర్మ్ వీసాలు కలిగిన వారికి ఈ నిబంధన వర్తించదు. పాకిస్తానీలు తమ దేశానికి అటారి బార్డర్ నుంచి వెళ్లొచ్చు. ఈనెల 30 వరకు అటారి బార్డర్ తెరుచుకుని ఉంటుంది. కేంద్ర ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పాకిస్తానీలు తమ దేశానికి వెళ్లిపోవాల్సిందే. ఒకవేళ అక్రమంగా తెలంగాణలో ఉంటే న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## సంయమనం పాటించండి..

పేర్కొన్నారు. ఉగ్రదాడిని యూఎన్ తీవ్రంగా ఖండిస్తోందన్న ఆయన.. ప్రస్తుతం ఇరుదేశాలు సంయమనం పాటించాలని సూచించారు. గురువారం విలేకరుల సమావేశంలో స్టీఫెన్ మాట్లాడుతూ.. 'జమ్మూకశ్మీర్‌లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఐరాస తీవ్రంగా ఖండిస్తోంది. పౌరులపై దాడి ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. గుటెర్రస్ ఈ ఆందోళనకర పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తున్నారు. భారత్–పాక్ దేశాలు సంయమనం పాటించాలని కోరుతున్నాం. ఇరుదేశాల మధ్య ఏదైనా సమస్య ఉంటే శాంతియుత చర్చలతో వాటిని పరిష్కరించుకుంటారని ఆశిస్తున్నాం' అని పేర్కొన్నారు. ఇక, ఉగ్రదాడికి స్పందనగా సింధూ నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేసిన సంగతి తెలిసిందే. దీనిపై విలేకరులు ప్రశ్నించగా.. ఈ ఉద్రిక్తతల వేళ నిబంధనలపై ఇరుదేశాలు సంయమనం పాటించి, పరిస్థితులు మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకుంటాయని ఆశిస్తున్నా మన్నారు..

## బందిపొరాలో ఎన్‌కౌంటర్..

అల్తాఫ్ ఆచూకీ తెలిసింది. శుక్రవారం ఉదయం ఆర్మీ–పోలీసు దళాలు జాయింట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈక్రమంలో ఉగ్రవాదులను గుర్తించడంతో ఎన్‌కౌంటర్ మొదలైంది. తొలుత ఓ ఉగ్రవాది గాయపడ్డాడు. ఆ తర్వాత భద్రతా దళాల్లోని అధికారి బాడీగార్డులకు తూటాలు తాకాయి. ఈక్రమంలో అల్తాఫ్‌ను మట్టుబెట్టాయి. ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది కశ్మీర్‌లో అడుగుపెట్టిన వేళ ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకోవడం గమనార్హం.పహల్గాంలో ఉగ్రదాడి వెనక లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ పాత్ర నేరుగా ఉన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. కశ్మీర్‌లో చురుగ్గా పనిచేస్తున్న మాడ్యూల్‌ను అతడే స్వయంగా నియంత్రిస్తున్నట్లు గుర్తించారు. దీనిలో అత్యధిక మంది విదేశీ ఉగ్రవాదులు, కొందరు మాత్రమే స్థానికులు ఉండేటట్లు చూసుకొన్నారు. వీరికి అండగా క్షేత్రస్థాయిలో సమాచార సేకరణ, లాజిస్టిక్స్, దాక్కొనేందుకు ప్రదేశాలు ఏర్పాటుచేసేందుకు కొందరు స్థానికులు పనిచేసేవారు.ఈ ఉగ్రబృందం కొన్నేళ్ల నుంచి ఇక్కడ చాలా దాడుల్లో పాల్గొంది. గత రెండేళ్లలో జరిగిన సోనమార్గ్, బూటపత్రి, గందర్బాల్ జరిగిన హైప్రొఫైల్ దాడుల్లో కూడా ఇవి పాల్గొన్నాయి. గతేడాది అక్టోబర్‌లో బూటపత్రిలో ఇద్దరు ఆర్మీ సిబ్బందిని హత్య చేసింది. అదే నెలలో సోనమార్గ్ సొరంగంలో పనిచేస్తున్న ఆరుగురు కార్మికులను కాల్చిచంపింది. ఈ ఉగ్ర బృందంలో కీలక సభ్యుడైన జునైద్ అహ్మద్ భట్ డిసెంబర్‌లో భద్రతా దళాలు దాచిగామ్ వద్ద ఎన్‌కౌంటర్ చేశాయి. మిగిలిన ఉగ్రవాదులు పారిపోయారు. ఆ తర్వాత ఈ బృందం చాలాకాలం అడవుల్లో ఎవరి కంటా పడకుండా గడిపింది. ఈ బృందం నేరుగా హాఫీజ్ సయీద్, అతడి డిప్యూటీ సైఫుల్లా నుంచే ఆర్డర్లు తీసుకొనేది. ఇంటెలిజెన్స్ బృందాల అంచనాల ప్రకారం వీరికి భావజాలంతోపాటు ఇతర ఏర్పాట్లు వ్యూహాత్మకంగా సలహాలు, సూచనలు పాక్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీ, మిలిటరీ నుంచి వచ్చేవని తెలిపారు. ఈ ఉగ్ర మూక పహల్గాంలో మూడు ప్రదేశాల్లో అత్యధికమందిని చంపారు. తొలుత ఒకచోట ఐదుగురిని కాల్చగా.. మైదాన ప్రాంతంలో ఇద్దరిని.. పారిపోయేందుకు యత్నించిన వారిలో చాలామందిని కంచె వద్ద హత్య చేశారు. ఈ ఉగ్రమూకలో హాషీమ్ మూసా, అలిభాయ్ పాక్ జాతీయులు.

## సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు.రాజకీయ ప్రసంగాలకు పరువు నష్టం ఉండదని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు పలు సుప్రీంకోర్టు తీర్పులను రేవంత్‌రెడ్డి పిటిషన్‌లో ప్రస్తావించారు. దీనిపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది.గతేడాది కొత్తగూడెం సభలో జరిగిన బహిరంగ సభలో నిరాధార ఆరోపణలు చేశారని రేవంత్ రెడ్డిపై భాజపా క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసింది. భాజపా అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆయన ఆరోపించారని అందులో పేర్కొంది. దీంతో భాజపా పరువుకు నష్టం కలిగిందని పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే దీనిపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. రేవంత్‌రెడ్డి ప్రసంగించిన ఆడియో, వీడియో సాక్ష్యాలను పిటిషనర్ కోర్టుకు సమర్పించారు. కాసం వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని ప్రజాప్రతినిధుల కోర్టు నమోదు చేసింది. ఈక్రమంలో ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

**రేవంత్‌రెడ్డికి హైకోర్టులో స్వల్ప ఊరట**

నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి రేవంత్‌రెడ్డికి మినహాయింపు ఇస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. అయితే, ప్రజాప్రతినిధుల కోర్టు విచారిస్తున్న కేసుపై మాత్రం స్టేకు నిరాకరించింది.

## ఇస్రో మాజీ శాస్త్రవేత్త కస్తూరిరంగన్ కన్నుమూత

పని చేశారు. 1994 నుంచి 2003 వరకూ తొమ్మిదేళ్ల పాటు– భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) ఛైర్మన్‌గా సేవలు అందించారు. జెఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–2009 వరకూ ఆయన రాజ్యసభ సభ్యుడిగా ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. దీంతో పాటు– మోదీ సర్కార్ తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా రంగన్ పని చేశారు. ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ మీద దేశద్రోహం ఆరోపణలు వచ్చినప్పుడు ఇస్రో ఛైర్మన్‌గా ఉంది కస్తూరి రంగనే. 1969లో ఆయన లక్ష్మిని వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు సంతానం. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచినట్లు– కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరిరంగన్ 1990–1994 వరకు యూఆర్‌ఎస్‌సీ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్లపాటు– (1994–2003) ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–09 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు.

# ప్రపంచశాంతికి కృషి చేస్తాం

సల్మాన్ ఖుర్షీద్ సూచించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ జస్టిస్, సమానత్వం, ప్రగతిశీల సహకారంపై 100కి పైగా దేశాల ప్రాతినిధ్యంతో ప్రొగ్రెసివ్ అలెయెన్స్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగే భారత్ సమ్మిట్ 2025 సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'ఈటీవీ భారత్'తో ప్రత్యేకంగా మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి, తదనంతర పరిణామాలపై స్పందించారు. ఈ ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ మధ్య పెరిగిన ఉద్రిక్తతలపై మాట్లాడుతూ "ఇది తప్పుల గురించి మాట్లాడాల్సిన సమయం కాదు. జాతీయ ఐక్యతను ప్రదర్శించే సమయం. ఇది మన దేశంపై జరిగిన దాడి. మన సోదరభావం, సామరస్యత, సంస్కృతికి సవాల్. దేశ ప్రజలందరితో పాటు రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని నిశ్చయించుకున్నాయి. ఈ సమయంలో కేంద్రం నుంచి నిర్దిష్టమైన, దృఢమైన చర్యలు ఉంటాయని ఆశిస్తున్నాం" అని అన్నారు.పాక్‌తో సింధూ నదీ జలాల ఒప్పందాన్ని నిలిపివేయడంపై స్పందించిన ఖుర్షీద్.. పాక్‌ని దెబ్బకొట్టేలా ఇది కేవలం ఒక అడుగు మాత్రమే అని అన్నారు. కానీ, మనకు జరిగిన నష్టానికి ఇది ఓ నిర్ణయాత్మకమైన ప్రతిస్పందన అవుతుందని ఎవరూ విశ్వసించడంలేదని పేర్కొన్నారు. తర్వాత ఏం జరుగుతుందో వేచి చూడాల్సి ఉందని తెలిపారు. దేశ ప్రయోజనాల కోసం కేంద్రం ఎలాంటి చర్యలు తీసుకున్నా కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయి మద్దతు ఇస్తుందని తాము ఇప్పటికే చెప్పామన్నారు.బిహార్‌లోని మధుబనిలో నిన్న జరిగిన సభలో ప్రధాని నరేంద్ర మోదీ అకస్మాత్తుగా ఇంగ్లీష్‌లో ప్రసంగించడం అసెంబ్లీ ఎన్నికల వేళ రాజకీయ వ్యూహంలో భాగమా? అని వస్తోన్న ప్రశ్నలకు స్పందిస్తూ.. "ఇది ఎన్నికల ర్యాలీలు లేదా ఎన్నికల సమయం అని మేం అనుకోవడంలేదు. దేశ ఐక్యతపై దాడి జరిగింది. జాతీయ ఐక్యతను బలోపేతం చేయడం మనందరి బాధ్యత. రాహుల్ గాంధీ ఈరోజు ఇక్కడికి రావడానికి బదులుగా కశ్మీర్ వెళ్లడానికి కారణం కూడా ఇదే. గాయాలను నయం చేసేలా యావత్ దేశానికి సందేశం పంపడం కోసమే ఆయన అక్కడికి వెళ్లారు" అని ఖుర్షీద్ చెప్పారు.

## మన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం

**హైదరాబాద్(జనంసాక్షి):**

భారత్ సమ్మిట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ దిశా నిర్దేశం చేస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ హెచ్‌ఐసిసి నోవాటెల్లో జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రపంచంలో కోల్డ్ వార్ జరుగుతున్న సమయంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయిన సమయంలో కొన్ని దేశాలతో కలిసి ఆనాటి ప్రధాని పండిట్ లాల్ నెహ్రూ అలీన విధానాన్ని తీసుకొని ప్రపంచానికి దిశా నిర్దేశం చూపారని అన్నారు. సుదీర్ఘకాలం తర్వాత ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆర్థిక రాజకీయ సామాజిక అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అహింస సత్యం సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో మరోసారి ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నదని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాల ఆధారంగా భారత్ సమ్మిట్ జరుగుతున్నదని, ఈ సమ్మిట్ లో శాంతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునేవారు( గ్లోబల్ జస్టిస్) ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగిన వారు 8 ప్యానెల్స్ గా చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. 100 దేశాల నుంచి హాజరైన ప్రతినిధులు లింగ న్యాయం, ఫెమినిస్ట్ ఫ్యూచర్, ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్, కౌంటరింగ్ డిస్ ఇన్ఫర్మేషన్, యూత్ అండ్ పాలిటిక్స్ ఆఫ్ టుమారో, షేపింగ్ న్యూ మల్టీ ల్యాటరీజం వంటి అంశాలపై లోతుగా చర్చలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులో నిర్వహించే భారత్ సమ్మిట్ కార్యక్రమం చారిత్రాత్మకమైన సమ్మిట్ గా నిలిచిపోతుందని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామన్నారు.సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏ విధంగా ముందుకు తీసుకుపోతున్నామో ప్రపంచ ప్రతినిధులకు వివరించామని వెల్లడించారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రీజినల్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్స్, ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, నాలెడ్జ్ ఐటీ సెంటర్, ఇందిరా గిరి జల వికాసం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల గురించి భారత్ సమ్మిట్ హాజరైన ప్రతినిధులకు వివరించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అమలు చేస్తున్న సంక్షేమం పట్ల ప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేశారని వెల్లడించారు. దేశానికే మోడల్ గా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా ప్రతినిధులను కోరినట్లు చెప్పారు. అదేవిధంగా లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీసుకున్న గ్లోబల్ జస్టిస్ నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఈ సమ్మిట్ కు హాజరైన ప్రతినిధులు స్వాగతించి, అభినందించారని వెల్లడించారు.జమ్మూ కాశ్మీర్ పెహల్గామ్ లో ఉగ్రవాదులు జరిపిన కాల్పులకు నిరసనగా, బాధితులకు సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించాలని ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాదులో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొంటామని భారత్ సమ్మిట్ కు హాజరైన ప్రతినిధులు తెలిపారని ఈ సందర్భంగా చెప్పారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదామని పిలుపునిచ్చారు. శాంతి, అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ కోసం కాంగ్రెస్ తో కలిసి రావాలని కోరారు.

## సింధు జలాలు ఆపేస్తే మీ ఊపిరి ఆపేస్తాం

పిచ్చి ప్రేలాపనలు చేశాడు. సింధు జలాలను ఆపేస్తే, మీ ఊపిరాపేస్తామంటూ ఉన్మాదపు ప్రేలాపనలు పేలాడు. ఇటీవల జరిగిన పహల్గాం ఉగ్రదాడి వెనుక కూడా 26/11 ముంబయి దాడుల మాస్టర్ మైండ్.. హాఫీజ్ సయీద్ హస్తం ఉన్నట్టు– గుర్తించిన సంగతి తెలిసిందే. హాఫీజ్ ముహమ్మద్ సయీద్ పాకిస్తానీ తీవ్రవాది. లష్కర్–ఇ–తోయిబా వ్యవస్థాపకుడు. ఈ ఉగ్ర సంస్థ ప్రధానంగా పాకిస్తాన్ నుండి పనిచేస్తోంది.ఈ విభాగానికి తొలినాళ్లలో షేక్ సాజిద్ గుల్ సుప్రీం కమాండర్‌గా, చీఫ్ ఆపరేషనల్ కమాండర్‌గా బాసిత్ అహ్మద్ దార్ వ్యవహరించారు. ఆ తర్వాత నుంచి లష్కరే చీఫ్ హాఫీజ్ సయ్యద్ కనుసన్నల్లోనే నడుస్తోంది. డిప్యూటీ హెడ్‌గా సైఫుల్లా వ్యవహరిస్తున్నారు. ఈ ఇరూ పాక్ నుంచే ఎల్‌ఈటీ కార్యకలాపాలను నడిపిస్తున్నారనే అభియోగాలు ఉన్నాయి. పాక్ సైన్యం, ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ టీఆర్‌ఎఫ్ గ్రూపులకు సైద్ధాంతికపరమైన మద్దతు మాత్రమే కాదు.. అన్నిరకాలుగా మద్దతు ఇస్తున్నాయని భారత గూఢచార సంస్థలు నిగ్గుతేల్చాయి.

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ఎంఐఎం గెలుపు

పోటీ చేశాయి. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 22 ఏళ్ల తర్వాత ఎన్నిక జరిగింది. భాజపా అనూహ్యంగా అభ్యర్థిని బరిలో దింపడంతో ఈ ఎన్నిక చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 23న ఎన్నిక జరిగింది. ఇక్కడ మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధిక ఓట్లు ఎంఐఎంకు ఉండగా.. తర్వాత స్థానంలో భాజపా ఉంది. ఎంఐఎంకు 49 ఓట్లుండగా ఇతర పార్టీల మద్దతు లభించింది. మొత్తం ఓటర్లలో 81 మంది కార్పొరేటర్లు కాగా, 31 మంది ఎక్స్ అఫీషియో సభ్యులు. ఎక్స్ అఫీషియో సభ్యుల్లో 9 మంది ఎంపీలు, 15 మంది ఎమ్మెల్యేలు, ఏడుగురు ఎమ్మెల్సీలు ఉన్నారు. ఎంఐఎం, భారాసలకు ఎక్స్ అఫీషియో సభ్యుల ఓట్లు 9 చొప్పున ఉండగా.. కాంగ్రెస్‌కు ఏడు, భాజపాకు ఆరు ఉన్నాయి.

# రెవెన్యూమంత్రి పేరిట వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు అరెస్ట్

- అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు
- మంత్రి పొంగులేటి హెచ్చరిక

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్సనల్ అసిస్టెంట్ (పిఎ)ల మని చెప్పి అమాయకులను మోసగిస్తున్న ఇద్దరు వ్యక్తులను నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి (34), మచ్చ సురేష్ (30) హైదరాబాద్ నాగోల్‌లో నివాసముంటున్నారు. వీరు మంత్రి పిఎలమంటూ రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫోన్లు చేసి వసూళ్లకు పాల్పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రి దృష్టికి వచ్చిన వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ జరిపిన పోలీసులు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఇక నుండి తన పిఎలమంటూ ఎవరైనా ఫోన్ చేస్తే, ఎలాంటి చిన్న అనుమానం కలిగినా సచివాలయంలోని తన కార్యాలయం 040-23451072 / 040-23451073 నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రజలకు సూచించారు. ఎవరైనా ఈ విధంగా అధికారాన్ని దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సుప్రీంలో బోరుగడ్డకు చుక్కెదురు

- బెయిల్‌పై హైకోర్టులోనే తేల్చకోవాలని సూచన

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** వైసీపీ నేత బోరుగడ్డ అనిల్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బోరుగడ్డకు మధ్యంతర బెయిల్ ఇచ్చేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. తనపై ఉన్న అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలని కోరుతూ బోరుగడ్డ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ జరిపింది. దీనిపై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీం కోర్టు తేల్చిచెప్పింది. నకిలీ పత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందుకు ఈ కేసును హైకోర్టే తేల్చుతుందని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో పాటు మంత్రి నారా లోకేష్, జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌పై అసభ్య పదజాలంతో దూషించిన కేసులో బోరుగడ్డను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇటీ-వల హైకోర్టు కొన్ని వ్యాఖ్యలు కూడా చేసింది. బోరుగడ్డను కొంతకాలం జైలులోనే ఉంచాలని, ఎలా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తారు అని ప్రశ్నించింది ధర్మాసనం. నకిలీ పత్రాలు సమర్పించి బెయిల్‌పై బయటకు వచ్చారంటూ బోరుగడ్డ బెయిల్ రద్దు చేయాలంటూ ఇటీవల పోలీసులు పిటిషన్ వేశారు. ఈ నేపథ్యంలో తనపై నమోదైన అన్ని కేసుల్లో బెయిల్ ఇవ్వాలంటూ బోరుగడ్డ అనిల్ సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. జస్టిస్ బి వి నాగరత్న నేతృత్వంలోని ధర్మాసనం ముందు విచారణ జరిగింది. అయితే అంశాన్ని హైకోర్టులోనే తేల్చుకోవాలని, నకిలీపత్రాలు సమర్పించి గతంలో బెయిల్ పొందినందున ఈ కేసును హైకోర్టులోనే తేల్చుకోవడం మంచిదని సుప్రీం కోర్టు ధర్మాసనం అభిప్రాయపడుతూ బోరుగడ్డకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. కాగా.. చర్చి స్థల వివాదంలో సీఐను బెదిరించారంటూ బోరుగడ్డపై కేసు నమోదు అయిన నేపథ్యంలో ఇటీవల అతడిని అనంతపురం కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టు వద్ద బోరుగడ్డ సంచలన వ్యాఖ్యలు చేశారు. బెయిల్ కోసం తాను ఎలాంటి నకిలీ సర్టిఫికెట్లు- పెట్టలేదని, ఒరిజినల్ సర్టిఫికెట్‌నే ఇచ్చినట్లు- తెలిపారు. డాక్టర్ తనకు ఒరిజినల్ సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. దీనిపై కోర్టులోనే నిజాలను తేల్చుకుంటానని చెప్పుకొచ్చారు. అవసరమైతే గూగుల్ టేక్ అవుట్ కూడా బయటకు తీసుకువస్తానని బోరుగడ్డ చెప్పడం సంచలనంగా మారింది.

# అన్నదాతల్లో అకాల వర్షాల భయం



**సిద్దిపేట, ఏప్రిల్25 (జనంసాక్షి) :** జిల్లావ్యాప్తంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ పలుచోట్ల కేంద్రాలను ప్రారంభించారు. కాగా ఇప్పుడిప్పుడే కోతలు మొదలై ధాన్యం నిల్వలు కల్లాలకు చేరుకుంటున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలిరానున్న నేపథ్యంలో సంబంధిత యంత్రాంగం ప్రత్యామ్నాయ చర్యలు సైతం చేపడుతోంది. ధాన్యాన్ని పకడ్బందీగా కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని భావిస్తున్నారు. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలు కేం ద్రాల్లో ఇప్పటి వరకు గోనెసంచులు పూర్తిస్థాయిలో చేరుకోలేదు. దీంతో పాటు ధాన్యం కొనుగోళ్ల ప్రారంభం కాగానే ఈ కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలో భద్రపర్చేందు కోసం తగిన సౌకర్యాలు కూడా అందుబాటులో లేకపోవడం ఇబ్బందులకు కారణం కానుందంటున్నారు. జిల్లాలో ప్రస్తుతం వేర్ హౌజింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని గోదాములు మొన్నటి ఖరీఫ్ పంటలతో నిండిపోయి ఉన్నాయి. అయితే ప్రస్తుతం కొనుగోలు చేసే ధాన్యాన్ని నిల్వచేయడం కష్టతరం కాబోతుందంటున్నారు. ప్రస్తుతం గోదాముల కొరత, గోనెసంచుల కొరత వరిధాన్యం కొనుగోలు ప్రక్రియను ఇబ్బందులకు గురిచేసే అవకాశం ఉందంటున్నారు. పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం కొనుగోళ్లకు సంబంధించిన ఏర్పాట్లను చేపట్టారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వ్యవసాయశాఖతో పాటు మార్కెటింగ్‌శాఖ, రెవెన్యూ, పోలీసుశాఖలు సమిష్టిగా ధాన్యం కొనుగోళ్ల వ్యవహారాన్ని పరిశీలించ నున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టింది. కాగా ధాన్యం కొనుగోలు వ్యవహారంతో గోనెసంచులు, గోదాముల కొరత కొనుగోలు ప్రక్రియపై ప్రభావం చూపే ప్రభావం ఉండదంటున్నారు. ఈ క్రమంలో అకాల వర్షాలు కురుస్తుండడం రైతాంగాన్ని బెంబెలేత్తిస్తోంది. ఒక రోజు ఎండ తీవ్రత పెరగడం, మరో రోజు వర్షం కురియడం, వాతావరణం చల్లబడడం లాంటి పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ధాన్యాన్ని ఆరబెట్టే విషయంలో ఆందోళనకు లోనవుతు న్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఏ నిమిషం ఏం జరుగుతుందోనంటూ భయపడుతున్నారు.. త్వరగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అవసరమైన కేంద్రాల్లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశామని మంత్రి పొన్నం తెలిపారు.. రైతులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. చివరి గింజ కొనే వరకు రైతులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

# ప్రజావాణిలో 291 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన దివ్య



**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 291 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 123, విద్యుత్ శాఖకు సంబంధించి 17, రెవెన్యూ శాఖకు సంబంధించి 38, ఇందిరమ్మ ఇండ్ల కోసం 61 దరఖాస్తులు వచ్చాయి. ప్రవాసి ప్రజావాణికి 01, ఇతర శాఖలకు సంబంధించి 51 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న మహిళలు, గిరిజన శాఖ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం ప్రజా భవన్ కు రాగా, వారి సమస్యలపై దివ్య దేవరాజన్ ప్రత్యేక దృష్టిని సారించారు. సీఎం ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో వాదనలు

**మాజీ ఐజి ప్రభాకర్ రావుబెయిల్ పిటషన్‌పై విచారణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** తెలంగాణలో తీవ్ర చర్చనీయాంశమైన ఫోన్ ట్యాపింగ్ కేసులో మాజీ ఐజీ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. ఆయన తరపున ప్రముఖ న్యాయవాది సి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభాకర్‌రావు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ముందస్తు బెయిల్ ఇస్తే వెంటనే హైదరాబాద్ వస్తారని కోర్టుకు వివరించారు. ఆయన 30 ఏళ్లకు పైగా వివిధ హోదాల్లో పని చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆయన క్యాన్సర్‌తో బాధపడుతున్నారని వివరించారు. ఇదే కేసులో నిందితుడిగా ఉన్న శ్రవణ్‌రావు ముందస్తు బెయిల్ పొందారని, అందువల్ల ప్రభాకర్‌రావుకు కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బెయిల్ ఇస్తే దర్యాప్తునకు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నారని, రాజకీయ కక్ష సాధింపు చర్యగా ఫోన్ ట్యాపింగ్ కేసు పెట్టారని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సాక్ష్యాలను ధ్వంసం చేశారన్నది నిజం కాదని వాదించారు. పోలీసుల తరపున సిద్ధార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. 65 ఏళ్ల వయసుందన్న సాకుతో ప్రభాకర్‌రావు దర్యాప్తు నుంచి తప్పించుకోలేరన్నారు. ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు- పూర్తి ఆధారాలు ఉన్నాయని, హార్డ్‌డిస్కులను ధ్వంసం చేసి నీళ్లలో పడేసినట్లు దర్యాప్తులో తేలిందని లూథ్రా న్యాయస్థానానికి వివరించారు. ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయొద్దని కోరారు. ఇరువైపు వాదనలు విన్న న్యాయస్థానం.. తదుపరి విచారణను ఈనెల 29కి వాయిదా వేసింది.

# సిద్దిపేటకు తెలంగాణకు పేగుబంధం

- ఆనాడు కెసిఆర్ ఇక్కడి నుంచే కదిలారు
- యువత ర్యాలీని ప్రారంభించిన హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** తెలంగాణ ఉద్యమానికి సిద్దిపేటకు పేగు బంధం ఉందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. నేడు విద్యార్థులు, యువత చేపట్టిన పాదయాత్ర రేపు బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయ యాత్రగా కాబోతున్నదని చెప్పారు. సిద్దిపేట నియోజకవర్గం కేంద్రం రంగదాంపల్లి అమర వీరుల స్థూపం నుంచి వరంగల్ సభ వద్దకు వెయ్యి మంది విద్యార్థి, యువత చేపట్టిన పాదయాత్రను హరీశ్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..నాడు సిద్దిపేట నుంచే కేసీఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్లు కదిలించారని గుర్తుచేశారు. చాలా పార్టీలు పుడుతుంటాయి, పోతుంటాయి.. కానీ బీఆర్ఎస్ మాత్రం లక్ష్యాన్ని ముద్దాడిందని తెలిపారు. కేసీఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందన్నారు. 14 ఏండ్ల ఉద్యమం, పదేండ్ల ప్రభుత్వం, ఇప్పుడు ఏడాదిన్నర ప్రతిపక్షం.. ఏ పాత్ర అయినా బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ పక్షమేనని స్పష్టం చేశారు. లంకలో రావణుడి అరాచకాలను అరికట్టడానికి ఆనాడు రామదండు కదిలింది. నేడు మన రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదిలిందని చెప్పారు. 'కాశ్మీర్‌లోని పెహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారికి 2 నిమిషాలు శ్రద్ధాంజలి ఘటిద్దాం. ఈరోజు మన సిద్దిపేట నుంచి పాదయాత్రలో బయలుదేరిన విద్యార్థి యువ మిత్రులకు, ఉద్యమకారులకు, బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అందరికీ శిరస్సు వంచి నమస్కారం తెలియజేస్తున్నా. 44 డిగ్రీల ఎండను కూడా లెక్క చేయకుండా 1500 మంది ఈనెల 27న వరంగల్‌లో జరగబోయే పార్టీ రజతోత్సవం కోసం స్వచ్ఛందంగా తరలివచ్చిన మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు' అని తెలిపారు.

## సెలవులతో యాదగిరిగుట్టలో
# పెరిగిన రద్దీ



**యాదగిరిగుట్ట, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** యాదగిరిగుట్ట పుణ్య క్షేత్రంలో భక్తుల రద్దీ బాగా పెరిగింది. సెలవుల కారణంగా భక్తులు స్వామివారి దర్శనానికి వచ్చారు. దీంతో ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. వేసవి సెలవుల దృష్ట్యా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి దర్శనానికి భక్తులు క్యూలైన్లలో బారులుతీరారు. ప్రసాద విక్రయశాల, సత్యనారాయణ స్వామి వ్రత మండపం, కొండకింద విష్ణు పుష్కరిణి, కారు పార్కింగ్, బస్టాండ్ ప్రాంతాల్లో భక్తుల సందడి నెలకొంది. మరోవైపు జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ముందస్తుగా దేవస్థానం తమ భద్రతా బలగాలను అప్రమత్తం చేసినట్లు ఆలయ ఈవో భాస్కరరావు తెలిపారు.

# ఉగ్రవాదుల దాడి హేయయమైన చర్య

- బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**నిర్మల్ రూరల్,ఏప్రిల్ 25(జనం సాక్షి) :** కాశ్మీర్ లో ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన హిందూ యాత్రికుల ఆత్మకు శాంతి చేకూరాలని శుక్రవారం పట్టణంలోని మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ చౌక్ నుండి కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ప్రారంభించారు. నిర్మల్ లోని అంబేద్కర్ విగ్రహం నుండి ప్రారంభమైన ర్యాలీ నారాయణరెడ్డి మార్కెట్, పాత బస్టాండ్, వివేకానంద చౌక్ మీదుగా కొనసాగింది.

## శుభం ద్వివేది కుటుంబానికి యోగి పరామర్శ

- కుటుంబ సభ్యుల రోదనలతో కన్నీరు చిందించిన యోగి

**కాన్పూర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. కుటుంబసభ్యులతో కలిసి సరదాగా విహార యాత్రకు వచ్చిన వారికి విషాదమే మిగిలింది. ఉగ్రదాడిలో చనిపోయిన వారిలో కాన్పూర్‌కు చెందిన శుభం ద్వివేది ఒకరు. భార్యతో కలిసి శుభం వివాహరయాత్రకు పహల్గామ్‌కు వచ్చి ఉగ్రతూటాలకు బలయ్యారు. శుభంకు రెండు నెలల క్రితమే వివాహం జరిగింది. విహహం జరిగి, ఎంతో మంచి భవిష్యత్ ఉన్న శుభం.. ముష్కరుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోవడం ప్రతిఒక్కరినీ కలిచి వేసింది. అలాగే యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా తీవ్ర భావోద్వేనికి గురయ్యారు. కన్నీరు పెట్టు-న్నారు. యోగి ఆదిత్యనాథ్‌కు సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఉగ్రమూకల దాడిలో అమరుడైన శుభం ద్వివేది కుటుంబాన్ని పరామర్శించేందుకు యూపీ సీఎం యోగి వెళ్లారు. సీఎంను చూడగానే శుభం భార్య ఐష్ణయ కన్నీరుమున్నీరుగా విలపించారు. శుభం తండ్రిని ముఖ్యమంత్రి ఓదార్చారు. తప్పుకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. శుభం తల్లిదండ్రులకు ఆయన ఒక్కడే సంతానమని, రెండు నెలల క్రితమే వివాహం జరిగినట్లు చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అలాగే శుభం కుటుంబ సభ్యులకు సీఎం యోగి సానుభూతిని తెలియజేశారు.కాగా.. శుభం ఇంటికి సీఎం యోగా వెళ్లగానే అక్కడ ఒక ఉద్వేగభరితమైన వాతావరణం నెలకొంది. సీఎంను చూడగానే శుభం కుటుంబసభ్యులు కంటతడి పెట్టుకున్నారు. ఈ సందర్భంగా శుభం భార్య చెప్పిన మాటల తో ముఖ్యమంత్రి యోగి కూడా చలించిపోయారు. 'ఉగ్ర మూకల దాడిలో నా భర్త మరణించాడు.. సార్ మేము ప్రతీ కారం తీర్చుకోవాలని అనుకుంటున్నాం' అంటూ కన్నీరు పెట్టుకుంటూ ఐష్ణయ చెప్పిన మాటలతో యూపీ సీఎం కూడా తనను తాను నియంత్రించుకోలేకపోయారు. అన్ని విధాలుగా ఆదుకుంటా మని.. తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

# కాంగ్రెస్‌ను, మోడీని ప్రశ్నిస్తూనే ఉంటాం

- హామీలపై కాంగ్రెస్‌ను నిలదీస్తాం
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**నిజామాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** వరంగల్ రజతోత్సవ సభో కాంగ్రెస్, బిజెపిల హామీలను వారి మోసాలను నిలదీస్తామని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రెండు పార్టీలు ఇచ్చిన హామీలపై కాంగ్రెస్‌ను,మోడీని ప్రశ్నిస్తూనే ఉంటామని ప్రశాంతరెడ్డి అన్నారు. కెసిఆర్ పాలన, మోడీ పాలనపై ప్రజల్లో చర్చ జరగాలన్నదే తమ లక్ష్యమని వేముల అన్నారు. వ్యవసాయానికి కెసిఆర్ ప్రభుత్వం 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్తును అందించిందని, ఇప్పుడు కాంగ్రెస్ ఎందుకు అందించలేక పోతున్నదని ఆయన అన్నారు. కేంద్రంలోని బిజెపి గ్యాస్ రాయితీ తగ్గించి.. ఎరువులు, యూరియా ధరలు పెంచిందన్నారు. భాజపా సోషల్ మీడియా తప్పుడు ప్రచారాన్ని సమష్టిగా తిప్పికొట్టాలన్నారు. బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రమూ బాగుపడ్డ దాఖలాలు లేవన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో భ్రమపెట్టడం అలవాటు చేసుకున్నారని అన్నారు. రైతురాజ్యం రావాలని, దీనికోసం అందరూ కలిసిరావాలని కెసిఆర్ ఇచ్చిన పిలుపుతో ఇప్పుడు మళ్లీ చర్చ మొదలయ్యిందని అన్నారు. కాంగ్రెస్ పాలనతో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని అన్నారు. తెలంగాణలో రైతులకు ఇప్పుడు కష్టం వచ్చి పడిందని అన్నారు. గతంలో కెసిఆర్ తీసుకున్న నిర్ణయాల కారణంగా నీటి తీరువా లేదు. విద్యుత్తు చార్జీలు లేవు. ధాన్యం కూడా ప్రభుత్వమే కొన్నది. ఆనాడు రైతులు కెసిఆర్‌ను ఎంతగా ఆదరించారో చూస్తే తెలిసిందన్నారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, కాంగ్రెస్‌పై పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎగ్గొట్టేందుకు యత్నిస్తున్న తీరును నిలదీయాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల్లో ఆశలు రేకెత్తించేలా అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వందరోజుల్లో హామీలు అమలుచేస్తామని చెప్పిన కాంగ్రెస్..ఏడాదిన్నర దాటుతున్నా వాటి విషయంలో ఎక్కడ వేసిన అక్కడే గొంగళి అక్కడే అన్న చందంగా మారిందన్నారు.ఎన్నిసార్లు అబద్దాలు చెప్పుకుంటూ రైతులను ఆగం చేస్తారని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్క హామీని సరిగ్గా అమలుచేసిన దాఖలాలు లేవన్నారు. గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు కేసీఆర్ సైనికుల్లా పనిచేయాలని వేముల సూచించారు. పసుపుబోర్డు, మద్దతు ధర ఇప్పిస్తానని మోసం చేసిన అర్వింద్‌కు బుద్ధి చెప్పాలన్నారు. అబద్దాలు చెబుతున్న కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం చెప్పకపోతే ఇంకా ఆగం చేస్తారని అన్నారు. వరంగల్ సభతో ప్రజలకు వాస్తవాలు తెలియచేస్తామని అన్నారు.

# న్యూయార్క్‌టైమ్స్ పైత్యం


- పహల్గాం వార్త ప్రజెంటేషన్‌లో తప్పిదం
- తీవ్రంగా తప్పపట్టిన అమెరికన్ ప్రభుత్వం


The New York Times
At Least 24 Tourists Gunned ... Militants in Kashmir
TERRORISTS
Prime Minister Narendra Modi of India called the ... worst against civilians in the region for years, a "t... vowed to bring the perpetrators to justice.

**వాషింగ్టన్, ఏప్రిల్25 (జనంసాక్షి) :** పహల్గాం ఉగ్రదాడిపై అమెరికా పత్రిక న్యూయార్క్ టైమ్స్ కవరేజీని అక్కడి ప్రభుత్వం తీవ్రంగా తప్పుపట్టింది. 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ- మెజార్టీ' ఎక్స్ హ్యాండిల్‌లో ఈ మేరకు పోస్టు చేసింది. వాస్తవానికి ఆ పత్రిక ప్రచురించిన పహల్గాం ఘటన వార్తలో.. దాడి చేసిన వారిని 'టెర్రరిస్టు'లుగా కాకుండా తప్పుదోవ పట్టించేలా 'మిలిటెంట్లు'గా చిత్రీకరిస్తూ శీర్షికను పెట్టింది. అంతేకాదు వార్తలో కూడా మిలిటెంట్లు-, గన్‌మెన్‌లు అని రాసుకొచ్చింది. అలాగే ఇది ఓ సాధారణ కాల్పుల ఘటనలా రాసింది. ఈ వార్త క్లిప్పింగ్‌ను ఎర్రటి అక్షరాలతో సరిచేసిన 'హౌస్ ఫారెన్ అఫైర్స్ కమిటీ- మెజార్టీ' ఎక్స్‌లో పోస్టు చేసింది. హేయ్ న్యూయార్క్ టైమ్స్. నీకోసం ఈ తప్పు మేము సరిచేశాము. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఇది 'ఉగ్రదాడి'. ఏది ఏమైనప్పటికీ భారత్ లేదా ఇజ్రాయెల్‌లో ఉగ్రవాదం విషయానికి వచ్చేసరికి న్యూయార్క్ టైమ్స్ నిజాలను మాయం చేస్తుందని ఘాటుగా వ్యాఖ్యానించింది. ఇదిలావుంటేభారత్‌పై అమెరికా విదేశాంగశాఖను ప్రశ్నించి.. ఏదైనా వ్యాఖ్యలు చేయిద్దామని ప్రయత్నించిన పాక్ జర్నలిస్టుకు భంగపాటు ఎదురైంది. దీనికితోడు పహల్గాం దాడి విషయంలో వాషింగ్టన్ న్యూఢిల్లీకి ఎంత అండగా ఉందో చెప్పే ఘటన మరొకటి చోటు-చేసుకొంది. భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తత నెలకొనడంపై అమెరికా విదేశాంగ ప్రతినిధి టామ్మీ బ్రూస్‌ను ఓ పాక్ జర్నలిస్టు అడిగాడు. దీనికి ఆమె స్పందిస్తూ.. నేను దానిపై ఎటువంటి వ్యాఖ్యలు చేయను. మనం ఇంకో సబ్జెక్టు మాట్లాడుకుందాం. ఇప్పటికే అధ్యక్షుడు ట్రంప్, మంత్రి మార్కో రూబియో మాట్లాడారు. అందుకే ఆ విషయంపై నేను మాట్లాడను. చనిపోయిన వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తాను. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ఆకాంక్షిస్తాను. ఈ హీనమైన దాడికి పాల్పడిన వారికి శిక్ష పడాలని కోరుకుంటాను అని పేర్కొన్నారు. ఇక ఈ దాడి వెనక పాక్ హస్తం ఉందని భావిస్తున్నారా.. ఉద్రిక్తతలను తగ్గించడానికి ప్రయత్నిస్తారా అన్న ప్రశ్నలకు కూడా ఆమె స్పందించారు. పరిస్థితులు వేగంగా మారుతున్నట్లు మనం చూస్తున్నాం. వాటిని చాలా జాగ్రత్తగా గమనిస్తున్నాం. జమ్మూకశ్మీర్‌పై ఎటువంటి పొజిషన్ తీసుకోలేదని వ్యాఖ్యానించారు. ఈ దాడిపై తన సోషల్ మీడియా ట్రూత్‌లో ట్రంప్ తొలిరోజే పోస్టు చేశారు. కశ్మీర్ ఘటన నన్ను తీవ్రంగా కలచివేసింది. తీవ్రవాదానికి వ్యతిరేకంగా భారత్‌కు అమెరికా మద్దతుగా నిలుస్తుంది. మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నా. గాయపడినవారు త్వరగా కోలుకోవాలి. ప్రధాని మోదీ, భారత ప్రజలకు మా సంపూర్ణ మద్దతు ఉంటుందని ట్రంప్ పేర్కొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26 ఏప్రిల్ 2025
తెలంగాణ

# తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామ రక్ష



తెలంగాణ కోసం ఒక రాజకీయ పార్టీ ఉండాలని ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ ఎందుకు అన్నారో పదహారు నెలలుగా రాష్ట్రంలో జరుగుతున్న పరిస్థితులను చూస్తే అర్థమౌతుంది. తెలంగాణ గురించి కేసీఆర్ అధ్యయనం చేసినట్లు ఏ నాయకుడు చేయలేదు. అందుకే ఆయన ఉద్యమ సమయంలోనూ, ఆ తర్వాత అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణ ధనిక రాష్ట్రమని కుండబద్దలు కొట్టారు. దగా పడిన ధనిక రాష్ట్రానికి కారణం ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెస్, టీడీపీలే. ఈ రెండు పార్టీలకు నాయకత్వం వహించింది సీమాంధ్ర నాయకులే. తెలంగాణ ప్రాంతం నుంచి జాతీయస్థాయి లో ఎదిగిన నాయకులు కూడా రాష్ట్ర ఏర్పాటు గురించి బహిరంగంగా మాట్లాడే పరిస్థితి ఉండేది కాదు. ఎందుకంటే వాళ్లకు పదవులు ముఖ్యం. ఈ మాట అన్నది సీమాంధ్ర నాయకులే. ఉద్యమ సమయంలోనే వాళ్లు ఇక్కడి కాంగ్రెస్ నేతలు ఉద్దేశించి పదవులు లేకుండా వారు ఒక్క క్షణం కూడా ఉండలేరని ఘాటుగా వ్యాఖ్యానించిన విషయం మనం చూశాం.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులపై రైఫిల్ ఎక్కుపెట్టిన వ్యక్తే సీఎంగా ఉన్నారు. అందుకే ఆయనను చూసి ఆయన మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు రెచ్చిపోతున్నారు. బూతులు మాట్లాడటంలో ఆయనతో పోటీ పడుతున్నారు. ఆ పార్టీ అగ్రనేత రాజ్యాంగాన్ని చేత పట్టుకుని ప్రజాస్వామ్యం, హక్కుల గురించి మాట్లాడుతుంటారు. కానీ ఇక్కడ మాత్రం ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సామాన్యుల నుంచి మొదలు ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారులపై కేసులు పెడుతున్నారు. అడవులు, సరస్సులు, నదులు, వన్యప్రాణులతో కూడిన సహజ వాతావావరణాన్ని రక్షించుకోవాలి. ప్రాణకోటిపై దయతో ఉండాలన్నఆదేశిక సూత్రాల ఆదర్శాలను తుంగలో తొక్కుతున్నారు. బీఆర్ఎస్ ప సంక్షేమ రాష్ట్రంగా వెలుగొందిన తెలంగాణను నెట్టారు.

తెలంగాణ ఉద్యమ సమయంలో ఈ ప్రాంతం వారికి పాలించు కోవడం సాధ్యం కాదు. రాష్ట్రం ఏర్పడినా మనుగడ సాగించలేదు అన్న వాదనలను కేసీఆర్ ప్రభుత్వం మొదటి ఐదేళ్లలోనే తిప్పికొట్టింది. తెలంగాణ ఎంత బాగా పరిపాలించు కోలదో.. ఈ దేశంలో అత్యుత్తమ పరిపాలకులుగా తెలంగాణ వాళ్లు ఉండగలరని కేసీఆర్ నిరూపించారు. తెలంగాణ నేతలకు ఒక గౌరవాన్ని తీసుకొచ్చారు. ఇదే సమయంలో మోడీ కంటే నేనే సీనియర్, హైదరాబాద్ ను ప్రపంచంలో పటంలో పెట్టింది నేనే అన్న చంద్రబాబు 2014-2019 వరకు ఏపీ సీఎంగా ఉన్నప్పటికీ ఏం చేశారో చూశాం. ఆయన ఏపీని అభివృద్ధి చేయడం కంటే తెలంగాణను విఫల రాష్ట్రంగా చేయడానికి కుట్రలు చేశారు. కానీ ఉద్యమ సమయంలోనే భవిష్యత్తు తెలంగాణ రాష్ట్రం ఎలా ఉండాలో వివిధ రంగాల నిపుణులతో సమగ్ర ప్రణాళికలు రూపొందించుకుని వాటిని ప్రాధాన్య అంశాల వారీగా మొదటి ఐదేళ్లు అమలుచేశారు. అందుకే అద్భుత ఫలితాలు వచ్చాయి. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, ప్రైవేట్ రంగంలోనూ ఉద్యోగాలు సృష్టించారు.

తెలంగాణ ప్రభుత్వ విధానాలను కేంద్ర ప్రభుత్వ సంస్థలు నీతి ఆయోగ్‌తో ఎకనామిక్స్ టైమ్స్ లాంటి పత్రికలు ప్రశంసించాయి. కేంద్రం ప్రభుత్వం స్థానిక సంస్థలకు ఇచ్చే అవార్డుల్లో 30 శాతం తెలంగాణకే వచ్చాయి. తెలంగాణ తలసరి ఆదాయం పెరిగింది. వ్యవసాయం రంగం సంక్షోభం నుంచి బైటపడి రైతుల చేతిలో నాలుగు పైసలు కనిపించాయి. ఫలితంగా కొవిడ్ సమయంలో ఒక్క 2020లో తప్ప తెలంగాణలో జీఎస్టీ వసూళ్లు ఎన్నడూ ఎన్నడూ పోలేదు. రేవంత్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. తాజాగా ఆర్బీఐ విడుదల చేసిన ద్రవ్యోల్బణం తక్కువగా నమోదైన (2 శాతానికికంటే తక్కువ) రాష్ట్రాలలో తెలంగాణ, ఢిల్లీ ఉన్నాయి. ఇది భవిష్యత్తు హెచ్చరికలను సూచిస్తున్నది. వస్తువుకు డిమాండ్ ఉంటేనే రేటు పెరుగుతుంది. ప్రజల కొనుగోలు క్షీణించడం ద్వారా రానున్న రోజుల్లో రాష్ట్ర ఆదాయం మరింత తగ్గే సూచనలు కనిపిస్తున్నాయి. అదే జరిగితే తెలంగాణ సొంతంగా సమకూర్చుకునే ఆదాయం గణనీయంగా తగ్గిపోనున్నది. అదే జరిగితే పక్క రాష్ట్రం వాళ్లు నవ్వే పరిస్థితి వస్తుంది. అందుకే ఎన్నికలకు ముందు మార్పు కోరుకున్న ప్రజలు పదహారు నెలల కాలంలోనే పెదవి విరుస్తున్నారు. తెలంగాణ వారికి పాలించుకోవడం రాదన్న ఉద్యమకాలం నాటి సీమాంధ్ర నేతల మాటలు నిజం చేస్తున్నారు. అందుకే తెలంగాణకు స్వీయ రాజకీయ అస్తిత్వమే శ్రీరామ రక్షఅన్న జయశంకర్ సార్ మాటలు మళ్లీ వినిపించడానికి కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనే కారణం.

**ఆసరి రాజు,**
ఇండిపెండెంట్ జర్నలిస్ట్



తమ తమ పార్టీల అనుబంధాలను , భావ జాలాలను వదిలేసి మహాత్మా జ్యోతి రావు పూలే, పెరియార్ చూపిన మార్గంలో ముందుకు సాగే వారే బీసీ ఉద్యమాలకు న్యాయం చేస్తారు. పెరియార్ రామస్వామి నాయకత్వంలో సాగిన స్వతంత్ర ఉద్యమాల వల్లనే భారత రాజ్యాంగం లో బీసీ. రిజర్వేషన్లను మొదటి రాజ్యాంగం సవరణ ద్వారా చేర్చారు. బీజేపీ ఆరెసెసెస్ మండల్ కమిషన్ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పని చేస్తూ అమలు జరిపే కృషి ప్రారంభించిన నాటి ప్రధాని వి పి సింగ్ ప్రభుత్వాన్ని పడగొట్టారు. ఇలాంటి చారిత్రక విశ్లేషణలు వాస్తవాలు చదవకుండా బీసీలు మాట్లాడుతుంటే వేదన కలుగుతున్నది.

# మీరు బీసీల వైపా ? మీమీ పార్టీల వైపా?

. బీసీల కోసం కాకుండా వారున్న భావజాలం కోసం , వారున్న పార్టీల కోసం పని చేసేవారు, పని చేయకుండానే వీరభక్తులుగా మాట్లాడేవారు కనీసం గూగుల్ లో సర్చ్ చేయకుండా, ఏ గ్రంథాలు విశ్లేషణ వ్యాసాలు చదవకుండానే అన్నీ తెలిసినట్లు ప్రతి ఒక్కరిపై గౌరవం లేకుండా మాటలు విసిరి కించ పరచడం వల్ల "దొడ్డవారు ఎల్లరు తొలగి పోవుదురు".. బీసీలు ఎంతో అధ్యయనం చేయాలి. బాగా నేర్చుకునే తత్వం అలవర్చుకోవాలి. బీసీ లు ముఖ్యమా? తమ అభిమాన పార్టీ ముఖ్యమా? అనే ప్రశ్నకు బీసీలే ముఖ్యం అనుకునే వారు మాత్రమే బీసీ ఉద్యమకారులుగా ఉద్యమం ముందుకు సాగుతుంది. పార్టీయే ముఖ్యం, బీసీ మరియు పార్టీ రెండూ ముఖ్యమే అనే వారు బీసీల పేరిట ఆ పార్టీలో పైకి రావాలనుకునే డిపెండెంట్ / ఆశ్రిత నాయకులు, మేధావులు. బీసీల మేలు కోరే వారు వారి పార్టీలో బీసీల కోసం కొట్లాడాలి. 42 శాతం రిజర్వేషన్లు చట్ట సభల్లో విద్య ఉద్యోగ పారిశ్రామిక, కాంట్రాక్టు, డీలర్ షిప్ తదితర సమస్త రంగాల్లో ప్రవేశ పెట్టాలని వారి పార్టీని సంస్థ ను ప్రశ్నించాలి. బీజేపీ, ఆరెసెస్ బీసీలకు ఏం చేయాలో మోహన్ భగవత్ గారికి సూచించాలి. చర్చించాలి. నిలదీయాలి. వంద ఏళ్లలో ఆరెస్సెస్ సర్ సంఘ్ చాలక్ గా ఎస్సీలు బీసీలు ఎందుకు లేరు? అని ప్రశ్నించాలి! ఎదగలేదు అని అంటే మీరు వారిని ఆకర్షించే ఎదిగించే కృషి చేయలేదన్న మాట! ఇప్పటికైనా ఆ కృషి చేస్తారా అని నిలదీయాలి. అందరు ఒకటే అన్నపుడు ఆరెసెస్ కులాంతర వివాహాలను ఆర్య సమాజ్ చేస్తున్నట్లుగా ఎందుకు చేయడం లేదు? అని ప్రశ్నించాలి.

దేవుడు సర్వాంతర్యామి అయినపుడు ప్రత్యేకంగా విగ్రహారాధన ను ఎందుకు ప్రచారం చేస్తున్నారు అని నిలదీయాలి. ప్రాంతీయ భాషల్లో పూజలు పెళ్లిల్లు, గుళ్లల్లో బీసీ, ఎస్సీల నియామకాల కోసం ఎందుకు పథకాలు రూపొందించడం లేదు? దేవుల్ల పేరిట గల ఆస్తులు కూడ బెట్టిన సంపద బీసీ ఎస్సీ ఎస్టీల అభివృద్ధి సంక్షేమం విద్య వైద్యం కోసం ఉపయోగించాలని ఎందుకు చెప్పడం లేదు? పైగా ఆ ఆస్తులు పూజారి కులాలకు అనుభవించే హక్కుగా మార్చాలని అని ఎందుకు ప్రచారం చేస్తున్నారు అని ప్రశ్నించాలి. అలాగే బీజేపీ 16 లక్షల కోట్లు మర్వాడీ గుజరాతీ దొంగలకు ఇతర దొంగలకు ఎందుకు మాఫీ చేసారు? వారి ఆస్తులను జప్తు చేసి వారిని జైల్లో ఎందుకు పెట్ట లేదు. 60 ఏళ్లలో అన్ని ప్రభుత్వాలు చేసిన అప్పులన్నీ రెట్టింపు అప్పులు గత పదేళ్లలో చేసి బీసీ ఎస్సీలకు చేసిందేమిటి? ఈ అప్పు తీరడానికి ముప్పయి ఏళ్లు వడ్డీతో కట్టాలి మన పిల్లలు. ఇలా అనేకం ఉన్నాయి. పార్టీల తరపున మాట్లాడే వాల్లు బీసీల సాధికారికతకు చేసే మేలేమీ లేక పోగా ఈ ఉద్యమాన్ని తమ పార్టీలో ఎదగడానికి అమ్ముకుంటారు. తాకట్టు పెడతారు. ఇలా ఆయా పార్టీలలో ప్రశ్నించకుండా కొనసాగే ఆశ్రిత నాయకులు అభిమానులు సారాంశంలో బీసీలకు బీసీ ఉద్యమాలకు తీరని నష్టం చేస్తారని సామాజిక తత్వ వేత్త శతాధిక గ్రంథకర్త, మహా మహోపాధ్యాయ, తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమిషన్ చైర్మన్ బిఎస్ రాములు ఒక ప్రకటనలో హెచ్చరించారు. చైర్మన్‌గా మీరేం చేశారని ప్రశ్నించే వారిని తాము అనువాదం చేసిన బీసీ కమిషన్ నివేదకలు అధ్యయనం చేయాలని, భారత రాజ్యాంగం బీసీ నోట్ బుక్ అనే గ్రంథం అధ్యయనం చేయాలని కోరారు.

**బిఎస్ రాములు, 8331966987**

# సికాసలో లేచిన బొగ్గు రవ్వలు




1969ల్లో ఉద్భవించిన నక్సల్బరీ ఉద్యమం ఊపిరిగా తెలుగు నాట శ్రీకాకుళం లో అడుగుపెట్టి తెలంగాణ నేలన విస్తరించిన రాడికల్ ఉద్యమం లో చురుకైన పాత్ర పోషించిన గురిజాల రవీందర్ వ్రాసిన బొగ్గురవ్వలు పుస్తకంలో తన జీవన ప్రస్థానాన్ని, తనతో పాటు తన సహచరుల పోరాటాన్ని అక్షరీకరించిన తీరు నేటి తరానికి కావాల్సిన వైద్యం పుష్కలంగా ఉంది. సమస్యలనుండి పారిపోయే నేటి తరం వాట్సాప్ ల్లో ఫార్వార్డ్ చేయబడుతున్నదే చరిత్రగా అదే నిజమనే భ్రాంతిలో కొట్టుమిట్టాడుతున్న తరం చదవాల్సిన పుస్తకం ఇది. నమ్ముకున్న సిద్ధాంతం కోసం, విలువల కోసం బ్రతికిన బ్రతుకులోని ఆనందం కన్నా మించినది మరొకటి ఉండదని మొగిలమ్మ లింగయ్యల పుత్రుడు రవీందర్ ఋజువు చేసారు. బతుకు దెరువు కోసం ఊరు విడిచి కార్మిక ఆవాసాల మధ్య ఓ హొటల్ నడుపుకుంటూ హొటల్ నిర్వహణ కోసం కావాల్సిన పాలకై పశువులను పెంచుతూ వనరులను సమకూర్చుకోవడం నాటి తరంలోని శ్రమైక జీవన సౌందర్యాన్ని ప్రతిబింబిస్తుంది.

తన చుట్టూ ఉన్న మనుషుల జీవితాలని గమనిస్తూ చదువుతూ లోతుపాతుల పై విశ్లేషిస్తూ లోటుపాట్లను సరిదిద్ద అవసరమైన సిద్ధాంతాన్ని ఆచరిస్తూ ప్రజల్లోకి తీసుకెళ్ళ గలిగిన రవీందర్ పయనం గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఊరు వదిలి వచ్చినా ఆప్యాయతను వదలలేని హుస్సేన్ మామ తిరిగి వెతుక్కుంటూ హొటల్ కి రావడం పాటలతో ఉత్తేజితులను చేయడం, దొరల చేతుల్లో నడుస్తున్న సింగరేణి యూనియన్ లకు ప్రత్యామ్నాయంగా సికాస ను ఏర్పాటు చేయడంలో రవీందర్ పాత్ర మాత్రమే కాక నాటి కార్యకర్తల కఠోర శ్రమ ను త్యాగాన్ని గుర్తు చేసారు. ఈ నేలన జరిగిన సాయుధపోరాట స్ఫూర్తి ని నిలబెట్టిన ఆర్ వై ఎల్ పోరాటాలను సమస్యలను ఉటంకిస్తూ చర్చించిన అంశాలు సోదాహరణంగా ఉన్నాయి. సింగరేణి బొగ్గు గనుల్లో అలసిన శరీరాల వల్ల చెదిరిన దాంపత్య జీవితాలను జైలు జీవితాల్లోని బీడీలు డబ్బులు హొమోసెక్సువల్ ఘటనలు, బలం ఉన్న వాడి చేతుల్లో బానిసలుగా ఆ జైలు గోడల మధ్య.. బాహ్య ప్రపంచానికి తెలియచేసారు.

తన ఆత్మకథ అని అనటం కన్నా తాను నడిచిన మార్గం లోని ఒడిదుడుకులను తెలియ చేస్తూ అనుభవించిన పోలీసు చిత్రహింసల ను నిర్బంధాలను పాఠకులకు పరిచయం చేయ డం ద్వారా ఎన్ని నిర్బంధాలైనా ఉద్యమాలను ఆపలేవని చెప్ప గలిగారు. తన బాట ముళ్ళ బాట అని తెలిసినా ఆ బాటలోనే నడవటానికి నిర్ణయించు కున్న మేన మరదలు సరళ పదిహేడేళ్ళకే పరిణతి చెందిన నిర్ణయం తీసుకోవడం వెనుక సిద్ధాంత స్ఫూర్తి ఉంది. షెల్టర్ ఇవ్వడానికి తోబుట్టువులు తండ్రి జంకినా సానుభూతిపరుల ఇంట అజ్ఞాత జీవితం గడిపి తాను నడిచే బాటలోని ఔన్నత్యాన్ని గుర్తు చేసారు.

చదివే క్రమంలో బతుకుల బాగుకోసం సామాజికార్థిక అసమాన తలు మూలమని గ్రహించి లీగల్‌గా సేవలందిస్తూ పార్టీకి అవసరమైనప్పుడు అండర్ గ్రౌండ్‌కి వెళ్ళి అత్యవసర సమయంలో మురుగు నీరు సైతం మంచి నీరుగా సేవించాల్సిన పరిస్థితులను విశదీకరించారు. అజ్ఞాత జీవితంలోకి భార్యాభర్తలను ఒకేసారి పార్టీ అనుమతించ నిరాకరించడంతో కలిసే జీవించాలనుకునే మౌలిక సూత్రానికనుగుణంగా కోర్టులో లొంగిపోయానని రవీందర్ తేటతెల్లం చేసారు.

ఉద్యమకారులకు పిల్లలు వుంటే ఉద్యమంలో చురుకుగా పాల్గొనేందుకు అడ్డని భావించి పిల్లలు పుట్టకుండా సరళ ఆపరేషన్ చేసుకున్నా ఆపాటికే గర్భం దాల్చడం అబార్షన్ కోసం వివిధ డాక్టర్లను సంప్రదించడం జరిగినది జరిగినట్లు ఎక్కడా అతిశయోక్తి లేకుండా రచించారు. పుట్టిన పిల్లను తాత దగ్గర వదిలి ఉద్యమంలో పాల్గొంటూ బిడ్డ తమకు దూరం అవుతుందనే బాధను వెలిబుచ్చారు సగటు తల్లితండ్రుల్లా.

పోలీసు చిత్ర హింసలకు వెన్ను నొప్పి నివారణకు ఆయుపంక్చర్ వైద్యాన్ని ఆశ్రయించి డాక్టర్ మిత్ర చేసిన వైద్య సహాయాన్ని ఉటం కించారు. వివిధ ప్రముఖ ఉద్యమకారులను ఉద్యమ నేపథ్యంలో కలిసిన, చర్చించిన మరియు ఏర్పాటు చేసిన సందర్భాలను తేదీలవారీగా ఇన్నాళ్ళ తర్వాత సైతం వ్రాయగలగడంలో తన డైరీ లు ఉపయోగ పడ్డాయని భావించవచ్చు లేదా జ్ఞాపక శక్తికి సెల్యూట్ చేయవచ్చు. పార్టీలు వేరైనా తాను జైలులో ఉన్నప్పుడు ఎంఎల్ఏ బోడ జనార్దన్ వచ్చి వెళ్ళాడని తెలియ చేయడంలో మానవీయ కోణం ఉంది.

తోటి కామ్రేడ్ గంగారం ఎన్కౌంటర్ అయినప్పుడు తాను అనుభవించిన బాధను అధిగమించటానికి చాలా సమయం తీసుకున్నారని తన వేదన ద్వారా గ్రహించవచ్చు. కొత్త దంపతుల నివాసానికి గుడిసెల మధ్య పందులు తిరుగాడుతుంటే సరళ వేరే ప్రాంతం చూడమన్నప్పుడు రెండు కవితలు చెబుతూ ఆ నివాసాల మధ్య ఉంటే సదరు ప్రజానీకం తమతో కలిసిపోతేనే సిద్ధాంత భూమిక త్వరగా నెరవేరుతుందని చెప్పటంలో తన సామాజిక బాధ్యత ను పరిణతిని అంచనా వేయవచ్చు . అజ్ఞాత జీవితం నుండి బైటికి వచ్చి ముప్పై ఏళ్ల పాటు విద్యాసంస్థలను నడిపి తాను ఆశించినట్లు నేడు నడపలేకపోతున్నందున తప్పుకోవడం అతని వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.

చివరగా కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స కు ముందే బీజం పడి అబార్షన్ ను తప్పించుకుని పుట్టిన బిడ్డే వ్యాఖ్యాత గా ఈ బొగ్గురవ్వలు ఆవిష్కరణ జరగడం గమనార్హం!

**ప్రతులకు అమెజాన్ ను సంప్రదించవచ్చు లేదా రచయిత చరవాణి 91 98495 88825 ని సంప్రదించండి.**

**గిరి ప్రసాద్ చెలమల్లు**
**9493388201**
**201 క్లాసిక్ అవెన్యూ మియాపూర్**
**హైదరాబాద్ 500049**

# ఫాసిస్ట్ శక్తులకు వ్యతిరేకంగా ప్రతిఘటించుదాం!

1936లో, లాహోర్‌లోని జాట్ పాట్ తోడక్ మండలి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌ను ఆహ్వానించింది, కానీ ఆయన కుల వ్యవస్థ, హిందూత్వంపై తీవ్ర ఆలోచనల కారణంగా ఆహ్వానం రద్దయింది. అంబేద్కర్ తన ప్రసంగాన్ని కుల నిర్మూలనగా ప్రచురించారు. కుల వ్యవస్థను నిర్మూలించకుండా ప్రజాస్వామ్యం సాధ్యం కాదని, బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారీ విధానంతో పోరాడాలని ఆయన నొక్కిచెప్పారు. భూమి, పరిశ్రమల జాతీయీకరణకు పిలుపునిచ్చారు. భగత్ సింగ్ బ్రిటిష్ సామ్రాజ్యవాదం, భారత పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు.

నేడు, బ్రాహ్మణవాదంపై ఆధారపడిన ఆర్ఎస్ఎస్, మనువాద హిందూత్వ రూపంలో, అదానీ-అంబానీలతో కలిసి శ్రామిక ప్రజలను అణచివేస్తోంది. అంబేద్కర్, ఫూలే, పెరియార్, భగత్ సింగ్ లాంటి వారి కుల రహిత, లౌకిక సమాజ ఆలోచనలపై దాడి చేస్తూ, భాజపా ద్వారా రాజ్యాధికారాన్ని చేపడుతోంది. పరిపాలన, న్యాయవ్యవస్థ, రాజకీయ, ఆర్థిక, విద్యా రంగాలు ఫాసిస్ట్ శక్తుల పట్టులో ఉన్నాయి. సిసిఏ ఆర్టికల్ 370 రద్దు, బాబ్రీ మసీదు స్థానంలో రామాలయం, వక్ఫ్ బోర్డుపై దాడులు హిందూ రాష్ట్ర లక్ష్యాన్ని సాధించాయి. ముస్లిం వ్యతిరేక ధ్రువీకరణ, ప్రధానమంత్రి రామాలయ కార్యక్రమంలో పాల్గొనడం ఈ ఎజెండాను బలపరిచింది. రాజ్యాంగ లౌకికతను బలహీనపరుస్తూ, ఆర్ఎస్ఎస్-భాజపా 'మిషన్ హిందూ రాష్ట్ర'ను వేగవంతం చేస్తోంది. మనుస్మృతి దళితులు, మహిళలకు హోదా ఇవ్వదు. దేశ సంపద, ఉన్నత పదవులు అగ్ర కులాల చేతుల్లో ఉన్నాయి. 103వ సవరణ ద్వారా ఉన్నత కులాలకు 10% రిజర్వేషన్లు రాజ్యాంగ స్వభావాన్ని దెబ్బతీశాయి. విమర్శకులపై సిసిఏ, దేశద్రోహ ఆరోపణలు విధిస్తున్నారు. దభోల్కర్, పన్సారే, కల్బుర్గి, లంకేష్‌లను సంఘీ శక్తులు హత్య చేశాయి. నాగ్‌పూర్‌లో ముస్లిం వ్యతిరేక హింస ఆర్ఎస్ఎస్ దాడులకు నిదర్శనం. స్వేచ్ఛా భావ వ్యక్తీకరణ, నిరసన హక్కులు అణచివేయబడుతున్నాయి. రాజ్యాంగ ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రిజర్వేషన్లను కాపాడేందుకు ఐక్యంగా పోరాడాలని కుల నిర్మూలన ఉద్యమం , విప్లవ సాంస్కృతిక వేదిక పిలుపునిస్తున్నాయి. ఏప్రిల్ 14 నుండి డిసెంబర్ 6 వరకు సాంస్కృతిక ప్రతిఘటనకు విజ్ఞప్తి చేస్తున్నాయి. ఇంక్విలాబ్ జిందాబాద్! కార్పొరేట్-మనువాద శక్తులను ఓడించండి. కుల రహిత, లౌకిక సమాజం కోసం పోరాడండి!

**తుహిన్, ఎంకె దాసన్, బందు మేష్రామ్, అసిమ్ గిరి**
సంప్రదించండి: **9425560952, న్యూఢిల్లీ**

# "గ్రంథాలయాల జ్ఞాన సంరక్షణ మేధో సంపత్తి హక్కుల సమతుల్య పాత్ర"

గ్రంథాలయాల నిశ్శబ్ద గదులలో, జ్ఞానం సంరక్షించబడి, పంచబడే చోట, సమాచారానికి ప్రాప్యత మరియు సృజనాత్మక రచనల రక్షణ మధ్య సంక్లిష్ట సంఘర్షణ జరుగుతుంది. మేధో సంపత్తి హక్కులు(ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్)(ఐపీఆర్‌ల) ఈ ఉద్విగ్నతకు కేంద్రంగా ఉంటాయి, గ్రంథాలయాలు సమాచార సంరక్షకులుగా ఎలా పనిచేస్తాయో అవి ఏలా రూపొందాయో తెలుసుకుందాం. జ్ఞానాన్ని ప్రజాస్వామ్యీకరించడానికి అంకితమైన రంగంగా, గ్రంథాలయ శాస్త్రం సృష్టికర్తల హక్కులను, ప్రజల అవసరాలను సమతుల్యం చేయడానికి (ఐపీఆర్) ల చట్టపరమైన, నైతిక, వ్యవహారిక కోణాలను అన్వేషణ చేయాలి. ఈ వ్యాసం గ్రంథాలయ శాస్త్రంలో (ఐపీఆర్)ల కీలక పాత్రను అన్వేషిస్తుంది, సృజనాత్మకత మరియు సామాన్య శ్రేయస్సును గౌరవించే సమానమైన నమూనా (ఫ్రేమ్‌వర్క్)ల కోసం గ్రంథాలయాలు పాటుపడాలని సూచిస్తుంది.

మేధో సంపత్తి హక్కులు భిన్న రూపాలు కలిగి ఉంటాయి. అవి కాపీరైట్లు, పేటెంట్లు, ట్రేడ్‌మార్క్‌లు, వాణిజ్య రహస్యాలు మొదలైనవి ఇందులో చేరి ఉంటాయి. సృష్టికర్తలకు వారి రచనలపై తాత్కాలిక రక్షణ ణ ఇవ్వడం ద్వారా సృజనాత్మకతను ప్రోత్సహిస్తాయి. గ్రంథాలయాల్లో, కాపీరైట్ అత్యంత ముఖ్యమైనది. పుస్తకాలు, జర్నల్స్, సంగీతం, డిజిటల్ మీడియా ఉపయోగాన్ని నియంత్రిస్తుంది. కాపీరైట్ చట్టం రచయితలకు వారి రచనలను పునరుత్పత్తి చేయడం, పంపిణీ చేయడం, స్వీకరించడంలో ప్రత్యేక హక్కులను ఇస్తుంది. కానీ విద్య లేదా పరిశోధన కోసం పరిమిత ఉపయోగాన్ని అనుమతించే ఫెయిర్ యూస్ వంటి నిబంధనలను కూడా కలిగి ఉంటుంది. గ్రంథాలయాలు పుస్తకాల అప్పు లేదా డిజిటల్ డేటాబేస్‌ల ద్వారా సమాచారాన్ని అందించడానికి ఈ మినహాయింపులపై ఆధారపడతాయి. అయితే, (ఐపీఆర్)ల అనువర్తనం సంక్లిష్టమైనది, ముఖ్యంగా వేగవంతమైన సాంకేతిక మార్పుల యుగంలో సంరక్షణ అంత తేలికైన పనికాదు.

డిజిటల్ విప్లవం సాంప్రదాయ గ్రంథాలయ పద్ధతులను తలక్రిందులు చేసింది, (ఐపిఆర్)ల నిర్వహణలో కొత్త సవాళ్లను తెచ్చిపెట్టింది. ఇ-బుక్స్, ఆన్‌లైన్ జర్నల్స్, స్ట్రీమింగ్ మీడియా తరచూ గ్రంథాలయాలు వనరులను ఎలా పంచుకోవాలో పరిమితం చేసే లైసెన్సింగ్ ఒప్పందాలతో వస్తాయి. ఫస్ట్-సేల్



సిద్ధాంతం కింద గ్రంథాలయాలు స్వేచ్ఛగా అప్పు ఇవ్వగల భౌతిక పుస్తకాలకు భిన్నంగా, డిజిటల్ మెటీరియల్స్ తరచూ ఉపయోగ నిబంధనలను నిర్దేశించే కాంట్రాక్ట్‌ల ద్వారా నిర్వహించబడతాయి, కొన్నిసార్లు ఫెయిర్ యూస్ రక్షణలను భర్తీ చేస్తాయి. ఈ మార్పు గ్రంథాలయాలు కొనుగోలు చేసిన డిజిటల్ కంటెంట్‌ను నిజంగా "సొంతం" చేసుకుంటాయా లేక కేవలం కొంత కాలం మేరకు మాత్రమే రక్షణ బాధ్యతను సంరక్షిస్తాయా అనే చర్చను రేకెత్తించింది. గ్రంథాలయ శాస్త్రానికి, ఇది ఒక ప్రాథమిక ప్రశ్నను లేవనెత్తుతుంది: కార్పొరేట్ ఆసక్తులు నిశ్చయాత్మకంగా నియంత్రణలో ఉన్నప్పుడు గ్రంథాలయాలు సార్వత్రిక లభ్యతను అందించే లక్ష్యాన్ని ఎలా నెరవేర్చగలవు? అనేది ప్రశ్నార్థకం.

సమాచార నిపుణులుగా, గ్రంథాలయాధికారులు ఈ సంక్లిష్టతలను అన్వేషణ చేయడంలో కీలక పాత్ర పోషిస్తారు. సేకరణ అభివృద్ధి, గ్రంథాలయాల మధ్య సమాచారం ఇచ్చి పుచ్చుకోవడం (అప్పులు), డిజిటైజేషన్ ప్రాజెక్టుల గురించి సమాచార నిర్ణయాలు తీసుకోవడానికి వారు (ఐపీఆర్)లను అర్థం చేసుకోవాలి. ఉదాహరణకు, గూగుల్ బుక్స్ లేదా ఇంటర్నెట్ ఆర్కైవ్ ఓపెన్ లైబ్రరీ వంటి చొరవలు మాస్ డిజిటైజేషన్‌పై చట్టపరమైన పరిశీలనను ఎదుర్కొన్నాయి, కాపీరైట్ ఉల్లంఘన రిస్క్‌లను హైలైట్ చేస్తాయి. గ్రంథాలయాధికారులు (ఐపీఆర్)లను గౌరవించమని పాఠకులకు విద్యాబోధన చేస్తూనే, సమాచారానికి రక్షణ హక్కుల కోసం ప్రయత్నించాలి. ఈ ద్వంద్వ బాధ్యత గ్రంథాలయ శాస్త్రాన్ని సృష్టికర్తలు, ప్రచురణకర్తలు, ప్రజల మధ్య మధ్యవర్తిగా నిలవాల్సి ఉంటుంది. అనుకూలత అలాగే సంరక్షణల సమతుల్యత కాపాడాల్సిన బాధ్యత ఉంటుంది.

గ్రంథాలయ శాస్త్రంలో (ఐపీఆర్)ల నైతిక కోణాన్ని విస్మరించలేము. కాపీరైట్ కింద లేని రచనలు స్వేచ్ఛగా ఉపయోగించబడే పబ్లిక్ డొమైన్‌కు గ్రంథాలయాలు ఎప్పటినుంచో మద్దతిచ్చాయి. అయితే, కాపీరైట్ టర్మ్ ఎక్స్‌టెన్షన్ యాక్ట్" వంటి చట్టాలు... "మిక్కీ మౌస్" వంటి రచనల రక్షణను పొడిగించాయి. అలాగే"పబ్లిక్ డొమైన్‌లో"కి రచనల ప్రవాహాన్ని నెమ్మదిగా అడ్డుకట్ట వేస్తున్నాయి. ఈ ధోరణి గ్రంథాలయాలు ఖర్చు లేదా నిబంధనలు లేకుండా అందించగల వనరులకు మాత్రమే పరిమితం చేస్తుంది. ఈ సేవలు అందని సమాజాలను అసమానంగా ప్రభావితం చేస్తుంది. జ్ఞానం సామాన్య సంపదగా ఉండేలా (ఐపీఆర్)ల అతివ్యాప్తిని నిరోధించే విధానాల కోసం గ్రంథాలయ శాస్త్రం గట్టిగా పూనుకోవాలి.

ప్రపంచవ్యాప్త అసమానతలు ఈ విషయాలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాలలో, కఠినమైన ఐపీఆర్‌లు అమలు జరుగుతున్నాయు. విద్యా వనరులకు లభ్యతను మాత్రం పరిమితం చేస్తుంది. గ్రంథాలయాలు తమ సమాజాలకు సేవ చేయడాన్ని ఈ ఐపీఆర్ నిభందనలు అడ్డుకుంటున్నాయి కూడా." బెర్న్ కన్వెన్షన్" వంటి అంతర్జాతీయ ఒప్పందాలు కాపీరైట్ రక్షణలను ప్రామాణీకరిస్తాయి, కానీ అవి తరచూ ధనిక దేశాల ప్రాధాన్యతలను ప్రతిబింబిస్తాయి." ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ లైబ్రరీ అసోసియేషన్స్ " వంటి సంస్థల ద్వారా, గ్రంథాలయ శాస్త్రం పట్ల అవగాహనా లోపం ఉన్న వారు లేదా విద్యా సంస్థల కోసం మినహాయింపుల వంటి విభిన్న రకాల ప్రజలు అవసరాలను ఆమోదించే మార్గాలను (ఐపీఆర్) చట్టాల పరిధి (ఫ్రేమ్‌వర్క్)ల కోసం ప్రయత్నించాలి. చివరగా, గ్రంథాలయ శాస్త్రంలో మేధో సంపత్తి హక్కుల భవిష్యత్తు సహకారం అలాగే ఆవిష్కరణపై ఆధారపడి ఉంటుంది. సృజనాత్మకతను ప్రోత్సహించే, లభ్యతను అడ్డుకోని ఐపీఆర్ వ్యవస్థలను రూపొందించడానికి గ్రంథాలయాలు విధాన రూపకర్తలు, సృష్టికర్తలు, సాంకేతిక ప్రొవైడర్లతో కలిసి పనిచేయాలి. ఓపెన్ యాక్సెస్ పబ్లిషింగ్, క్రియేటివ్ కామన్ లైసెన్స్‌ల వంటివి ఉద్భవిస్తున్న మోడల్స్ ఆశాజనక మార్గాలను అందిస్తాయి. విషయ(కంటెంట్) సృష్టికర్తలు తమ రచనలను పంచుకోవడానికి, కొంత నియంత్రణా హక్కులను నిలుపుకోవడానికి అనుమతిస్తాయి. జ్ఞానం రక్షించబడి, స్వేచ్ఛగా పంచబడే సంస్కృతిని పెంపొందించడానికి గ్రంథాలయ శాస్త్రం ఈ ప్రత్యామ్నాయాలను అన్వేషణ చేయాలి.

సమాచారం ఒక "కరెన్సీ" అలాగే "హక్కు" రెండూ అయిన సంక్లిష్ట యుగంలో, గ్రంథాలయ శాస్త్రం ఒక విపత్కర కూడలి (క్రాస్ రోడ్స్) లో నిలుస్తుంది. మేధో సంపత్తి హక్కులు కేవలం చట్టపరమైన సాధనాలు మాత్రమే కావు. అవి ఎవరు నేర్చుకోగలరు?,ఎవరు సృష్టించగలరు?,ఎవరు ఆవిష్కరించగలరు? అనే నియమాలు రూపొందించి వాటిని రక్షించే ఫ్రేమ్‌వర్క్‌లు అవసరం అవుతుంది.వాటి సమతుల్యతల (ఐపీఆర్) ల విధానాలు సంరక్షణా మార్గాల ద్వారా, గ్రంథాలయాలు జ్ఞాన సంరక్షకులుగా తమ లక్ష్యాన్ని ఉన్నతంగా ఉంచగలుగుతాయి, ఆలోచనల అన్వేషణ అందరికీ లభ్యం అయ్యేలా బహిరంగంగా ఉండేలా చేస్తాయి..



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

## అడవే తల్లికోడి

**అడవితల్లీ**
**ఇప్పుడు తల్లికోడి నీవేనమ్మా**
**పచ్చనాకు రెక్కలిప్పి**
**పిల్లల్ని కాపాడుకునే బాధ్యత నీదేనమ్మా**
**కార్పొరేట్ డేగ**
**నీ కాళ్ళకింది మట్టి మణుల మీద కన్నేసింది**
**పార్లమెంటు**
**అధికార తట్టలతో ఎత్తి**
**అంబానీ ఆదానీ**
**పొట్ట గుంపొట్టలు నింపాలని చూస్తుంది**
**నీ పిల్లలే కదమ్మా**
**నేలకు నెత్తురద్ది కాపాడుతుంది**
**నీ కాళ్ళ కింది మట్టి చెట్టును**
**చిప్కో అని హత్తుకొని బహుగుణలయ్యింది**
**అందుకే తల్లీ**
**వాడు నీ బిడ్డల్ని వేటాడుతుంది**
**రెక్కలు కత్తిరించి నేలకు విసిరికొడుతుంది**
**ఇంద్రావతేకాదు**
**గోదారి నిండా ప్రవహించేది**
**నీ బిడ్డల రక్తమేనమ్మా**
**అబూజ్మాడ్ లోనే కాదు**
**ఇవ్వాల కర్రిగుట్టల నిండా**
**ఖాకీ తుపాకీ చూపుల డ్రోన్లు**
**పాపం! బిడ్డలు**
**ఏం తిన్నారో! ఎప్పుడు తిన్నారో**
**పిడచగట్టిన నాలుక దగ్గరా ఖాకీ తుపాకీ కాపు కాస్తుందమ్మా**
**చెట్టూ పుట్టా గుట్టా**
**వాగూ వంకా వనమూ**
**శత్రువు కంటపడకుండా**
**కాయో పండో దాచి కడుపునింపమ్మా**
**దాచుకున్న చెలిమె చెంబులను**
**నీ బిడ్డల నోటికందించమ్మా**
**కంగారు పడకు తల్లీ**
**వాడి కగార్ ఆపరేషన్ హత్యాకాండ వికటించక తప్పదు**
**వాడి డెడ్లైన్ డెడ్ బాడీలూ కుళ్ళిపోక తప్పదు**
**బిడ్డలు రాలిన చోటల్లా**
**పురుడోసుకుంటున్న తల్లికోళ్లు**

**- నాగేశ్వర్**

# 90 శాతం భూ సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం

- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి



**న్యాల్‌కల్ ఝరాసంగం, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** భూ భారతి ద్వారా రైతులకు భూ హద్దుల నిర్ణయం పక్కాగా ఉంటుందని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. శుక్రవారం సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో గల కోహీర్, ఝరాసంఘం, న్యాలకల్ మండలలలో భూభారతి చట్టం అవగాహన సదస్సులలో అదనపు కలెక్టర్ మాధురితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన ఏర్పర్చుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ చట్టంలోని అంశాలపై గ్రామాలలో విస్తృతంగా చర్చిస్తూ, తోటి రైతులకు అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. భూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యంగా ప్రభుత్వం రూపొందించిన భూ భారతి (ఆర్ ఓ ఆర్) చట్టం - 2025 జనవరిలో గెజిట్ రూపంలో వచ్చిందని, సమగ్ర అంశాలను పొందుపరుస్తూ ప్రభుత్వం ఏప్రిల్ 14న ఈ చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ వివరించారు. భూ సమస్యలు కలిగిన రైతులు ఏడాది కాలం లోపు భూభారతి పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. భూ భారతి చట్టం ప్రకారం భూ సంబంధిత సమస్యలను నిర్దిష్ట గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. సమస్య పరిష్కారం కాకుంటే కలెక్టర్ కు లేదా సీసీఎల్ఏ కు అప్పీల్ చేసుకోవచ్చని, ఈ చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ కూడా అందుబాటులో ఉంటుందని సూచించారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల గురించి ఆలోచన చేస్తూ రైతు ప్రయోజనాలను కాపాడుతుందన్నారు. భూ భారతి చట్టం తో రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుందని ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఝరాసంగం మండలం, లో ఏర్పాటు చేసిన భూ భారతి కార్యక్రమం లో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ భూ భారతి చట్టం లో ఉన్న విధానాలను ప్రజలకు నివృతి చేయాలని తెలిపారు. జిల్లా అదనపు కలెక్టర్ మాధురి మాట్లాడుతూ ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఈ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. భూ సమస్యలపై రైతులు మీ-సేవాలో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఈ సదస్సులలో ఆర్డీవో రాంరెడ్డి , తాహసిల్దార్ భూపాల్, ఎంపీడీవో రాజశేఖర్, డిప్యూటీ ఎమ్మార్వో రాజిరెడ్డి , ఏవో అభినాష్ వర్మ , నాయకులు శ్రీనివాస్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, తిరుపతి రెడ్డి , కిరణ్ కుమార్ గౌడ్, సిద్ధి లింగయ్య స్వామి, స్వామిదాస్, అధికారులు రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా కాంగ్రెస్ కొవ్వొత్తుల ర్యాలీ



**చేర్యాల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** జమ్మూకశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ చేర్యాల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం చేర్యాల గాంధీ సెంటర్ నుండి నేతాజీ విగ్రహం వరకు కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా చేర్యాల మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పుర్మ ఆగంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన అమరులకు ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో వంగ జయ, దాసరి కళావతి, ఆడెపు చంద్రయ్య, కొమ్ము నర్సింగ రావు, అందె నాని, కాంగ్రెస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

# ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి

- సిఐటియుడిమాండ్



**గద్వాల్ రూరల్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి- సిఐటియుడిమాండ్. కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి వివిధ మున్సిపాలిటీలలో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఎన్.ఎం.ఆర్ ఫిక్స్ ఢ్ పే తదితర పద్ధతులలో పని చేస్తున్న మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు అనుబంధం) జిల్లా అధ్యక్షుడు గట్టన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ఆఫీసు బేరర్ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా మున్సిపాలిటీలలో పనిచేస్తున్న తమను గత ప్రభుత్వం పర్మినెంట్ చేయకుండా వెట్టి చాకిరీ చేయించుకుందని కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అయినా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేసి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యల పరిష్కారం కోసం మే 20న జరిగే సమ్మెలో మున్సిపల్ కార్మికులు పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఏ వెంకటస్వామి వివి నరసింహ మాట్లాడుతూ మున్సిపల్ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు అమలులోకి వస్తే ప్రభుత్వాలకు ఎంత ఇష్టమైతే అంత వేతనం ఇచ్చే హక్కు ఉంటుందని అన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకొస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మున్సిపల్ కార్మికులు అధిక సంఖ్యలో హాజరై సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గద్వాల పట్టణ మున్సిపల్ అధ్యక్ష కార్యదర్శులు,అల్లంపూర్ అధ్యక్షుడు లక్ష్మన్న,సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భద్రతే ప్రథమ కర్తవ్యం

- పరిగి తాండూర్‌లో విస్తృతంగా తనిఖీలు
- అనుమానితులపై నిరంతరం నిఘ
- వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 25 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లాలోని తాండూర్, పరిగి పట్టణాలలో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు బీడీకి విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు ఎస్పి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం అని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఆ ప్రకటనలో తెలియజేశారు. వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, ఆదేశాల మేరకు, జిల్లా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని, జిల్లా బిడి టీమ్ డాగ్ స్క్వాడ్ బృందాలు తాండూర్ మరియు పరిగి పట్టణాలలో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ తనిఖీల సందర్భంగా, ప్రజలు అధికంగా ఉండే రద్దీ ప్రాంతాలు, తాండూర్ పరిగి బస్ స్టాండ్‌లు, అలాగే తాండూర్ రైల్వే స్టేషన్ పరిసరాలలో ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగింది. అవాంఛనీయ వస్తువులు, అనుమానాస్పద పదార్థాలు మరియు నార్కోటిక్స్ (మాదకద్రవ్యాలు) వంటి వాటిని గుర్తించేందుకు ఈ తనిఖీలను ముమ్మరంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ "జిల్లా ప్రజల భద్రతే మా ప్రథమ కర్తవ్యం. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించేందుకు పోలీసు శాఖ నిరంతరం అప్రమత్తంగా ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగానే, అనుమానాస్పద వస్తువులు మరియు నార్కోటిక్స్ రవాణాను అరికట్టేందుకు ఈ ప్రత్యేక తనిఖీలను చేపట్టడం జరిగిందని తెలియజేశారు. ప్రజలు కూడా తమ పరిసరాలలో ఏవైనా అనుమానాస్పద వస్తువులు లేదా వ్యక్తులు కనిపిస్తే తక్షణమే స్థానిక పోలీసులకు లేదా డయల్ 100కు సమాచారం అందించాలని కోరారు. ప్రజల సహకారంతోనే నేరరహిత సమాజాన్ని నిర్మించగలం" అని ఆయన తెలిపారు. ఈ తనిఖీలలో బీడీ టీమ్ బాంబ్ స్క్వాడ్ సిబ్బంది అత్యాధునిక పరికరాలతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ స్పష్టం చేశారు.

# ఉగ్రవాద దాడిని వ్యతిరేకించండి



**హయత్‌నగర్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** జమ్మూ కాశ్మీర్ లో శాంతి నెలకొల్పాలని సిపిఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఎల్బీనగర్ చౌరస్తాలో ప్లే కార్డ్స్ తో నిరసన మంథని యాదయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ సర్కిల్ సిపిఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్ము కాశ్మీర్ లోని పర్యాటక ప్రాంతమైన పహల్ గామ్ ఉగ్రవాద ముష్కరులు విచాక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మందిని అమాయక పౌరులను అతి ఘోరంగా కాల్పులు జరిపి చంపివేయడం అతి దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారిలో హైదరాబాద్ ఇంటెలిజెన్స్ బ్యూరో లో పనిచేస్తున్న మనీష్ రంజన్ ఉన్నారు. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ జోహార్లు అర్పించారు. గాయపడిన 20 మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని, ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. మతం పేరుతో జరుగుతున్న ఇలాంటి ఘటన పై కేంద్ర ప్రభుత్వం అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి దుండలను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్లో శాంతి నెలకొల్పి, ఇలాంటి ఉగ్రవాద ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించాలని వారు కోరారు. హింస వద్దు శాంతి ముద్దు, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన యువకుల అందరికీ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సర్కిల్ కమిటీ సభ్యులు పోటెపాకు రామస్వామి, భూష రాజు కాశయ్య, పందుల లక్ష్మయ్య, సుమన్, ఊరే రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## అకాల వర్షంతో తడిసిన ధాన్యం

- టార్పాలిన్లు అందజేయని నిర్వాహకులు



**కొల్చారం, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** కొల్చారం మండల వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కాపాడుకునేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం ఆరబోసినా తేమశాతం రావడం లేదనే సాకుతో నిర్వహకులు కాంటాలు ఆలస్యంగా పెడుతున్నారు. ఈ క్రమంలో అకాల వర్షంతో కాంటాలు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో పలువురు రైతులు కిరాయికి తీసుకొచ్చి ధాన్యం తడవకుండా కప్పుకున్న పరిస్థితి. గన్ని బ్యాగులు నింపిన రైతుల బస్తాలు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. చేసేది ఏమి లేక అకాల వర్షం నుంచి పంటను కాపాడుకునేందుకు కిరాయి టార్పాలిన్లు తీసుకొచ్చి ధాన్యం రాశులపై కప్పుకున్నారు. ఈ క్రమంలో మూడు రోజుల క్రితం వరికోసి తేమశాతం రాకపోవడంతో కల్లాలు, రోడ్లపై ధాన్యం ఆరబోశారు. దీంతో అకాల వర్షం పడటంతో ధాన్యం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాల్లో కూడా ధాన్యం బస్తాలు తడిసినట్లు నిర్వాహకులు చెబుతున్నారు.

## అగ్రహారంతండాలో తాగునీటి సమస్య తీర్చాలి



**చారకొండ, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** చారకొండ మండల పరిధిలోని అగ్రహారం తండాలో గత కొన్ని రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో శుక్రవారం ఖాళీ బిందెలతో తండాలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా గిరిజన మహిళలు మాట్లాడుతూ గత వారం రోజులుగా తండాలో మిషన్ భగీరథ నీరు లేక పోవడంతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ బోర్లు చెడిపోయిన మరమ్మత్తులకు నోచుకోవడం లేదన్నారు. తాగునీటి సరఫరాలో చేయడంలో అధికారులు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నో సార్లు పంచాయతీ కార్యదర్శికి, మిషన్ భగీరథ అధికారులకు చెప్పిన ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. వేసవి కాలం కావడంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు.

## ఘనంగా ప్రారంభమైన చీర్యాల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు



**కీసర, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** చీర్యాల లక్ష్మీ నృసింహస్వామి 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు అయిన శుక్రవారం ద్వాదశి రోజు ఉదయం నవ కళాశాభిషేకం, విశ్వక్సేన పూజ అగ్ని ప్రతిష్టతో శ్రీ సుదర్శన నారసింహ హోమం వేద పండితుల మంత్రోచ్ఛరణతో ఆలయ ఫౌండర్ మరియు చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ చేతులమీదుగా బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శుక్రవారం పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి వారిని దర్శించుకున్న వారిలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మఖన్ సింగ్ రాజ్ ఠాకూర్ సతీమణి మనాలి ఠాకూర్, ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ ఉన్నారు. వీరికి ఆలయ ఫౌండర్ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణ వేదపండితులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి శేష వస్త్రాలు, తీర్థప్రసాదాలతో ఘనంగా ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు స్వయం ఉపాధి అభినందనీయం

- ఎమ్మెల్యే చేతుల మీదుగా కుట్టు మిషన్ల పంపిణీ



**కూకట్‌పల్లి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** పేద ప్రజలకు అండగా ఉంటూ పేద కుటుంబాల మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమం చేపట్టడంతో పాటు శిక్షణ పొందిన మహిళలకు కుట్టుమిషన్‌లను అందించడం అభినందనీయమని కూకట్పల్లి ఎం ఎల్ ఏ మాధవరం కృష్ణారావు అన్నారు. శుక్రవారం ఉదయం కెపిహెచ్బి కాలనీ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో ఆలయ చైర్మెన్ చెరుకు కుమారస్వామి ఆధ్వర్యంలో సెల్ వెల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు సుబ్బారావు సహకారంతో నిర్వహించిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి మహిళలు కుట్టు శిక్షణ కార్యక్రమంలో కుట్టిన పలు వస్త్రాలను, నూతన డిజైన్ డ్రెస్ లను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు, మిషన్లను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుమారస్వామి, సుబ్బారావు అందిస్తున్న సేవలను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, మిషన్ల పంపిణీ కార్యక్రమానికి తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు ఆరువేల మందికి కుట్టు మిషన్ శిక్షణ ఇస్తున్నామని, నేర్చుకున్న వారికి ఉచితంగా మిషన్లను కూడా అందిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలోని మహిళలందరికి ఉపయోగపడేలా సుమారు నాలుగువేల గజాల స్థలాన్ని కూడా ఎంపిక చేసి కేటాయింపుకు కలెక్టర్ కు లేక రాయడం జరిగిందన్నారు. స్థలం కేటాయింపు జరిగితే మహిళకు మంచి భవనం నిర్మించి అందులోనే మహిళా బ్యాంక్ కూడా ఏర్పాటు చేసి పలు ఉపాధి శిక్షణ కార్యక్రమాలను అందించి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రణాళికలను సిద్ధం చేయడం జరిగిందన్నారు. దురదృష్ట వశాత్తు బీ ఆర్ ఎస్ ప్రభుత్వం రాలేదని, ఇప్పుడున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో తప్పకుండా స్థలాన్ని కేటాయించి మహిళలకు భవనం నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు బొడ్ల గోపాల కృష్ణ, కృష్ణమూర్తి, స్థానిక నాయకుడు కచిన్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కాంగ్రెస్ దార్శనీకతకు నిదర్శనం భారత్ సమ్మిట్

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** కాంగ్రెస్ దార్శనీకతకు నిదర్శనం భారత్ సమ్మిట్ నిదర్శన మని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అలీనోద్యమానికి పునాది వేసిన చారిత్రాత్మక బాండుంగ్ సమావేశం 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన భారత్ సమ్మిట్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన భారత్ సమ్మిట్ ద్వారా ఆర్థిక, సామాజిక, రాజకీయ సమాచార న్యాయానికి మార్గంగా నిలుస్తుందని అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ దార్శనీకతకు నిదర్శనం పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు ఉన్నారు.

# రాజీవ్ యువ వికాసంతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

● జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకంలో ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా, త్వరితగతిన నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం ఐ.డి.ఓ.సి. కాన్ఫరెన్స్ హాల్‌లో రాజీవ్ యువ వికాసం పథకంపై ప్రత్యేక డిసిసి బ్యాంకుల సమావేశం,ఇందిరమ్మ ఇండ్లు,ఎల్.ఆర్.ఎస్ పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభంచడం జరిగందని తెలిపారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,000 కోట్ల నిధులు కేటాయించిందని తెలిపారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీల నుండి 25,500 దరఖాస్తులు అందాయని, వాటిలో 8000 దరఖాస్తులను సెక్టర్ల వారీగా పారదర్శకంగా స్క్రూటినీ చేయాలన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా అధికారులు ఆధార్, ఆదాయం ,కుల ధృవీకరణ పత్రాలతో పాటు అర్హత ప్రమాణాలను క్షుణ్ణంగా పాటించాలని సూచించారు. దరఖాస్తులను డౌన్ లోడ్ చేసి,కార్పొరేషన్ వారీగా,బ్యాంకులు శాఖల వారీగా వర్గీకరించి సోమవారంలోగా సంబంధిత బ్యాంకు మేనేజర్లకు సమర్పించాలని ఎంపిడిఒలు,



మున్సిపల్ కమిషనర్లకు కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకు మేనేజర్లకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వారంలోగా అర్హత నివేదికను అందజేయాలని ఆదేశించినారు. జిల్లా స్థాయిలో దరఖాస్తుల పరిశీలన 28 మే వరకు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేశామని,ఈ కమిటీలు ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హత ఉన్నవారిని మాత్రమే ఎంపిక చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో పనిచేస్తూ, నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల పనుల లక్ష్యాలను పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పురోగతిపై మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్,ప్రతి మండలంలో గ్రౌండింగ్, బేస్‌మెంట్,మార్క్ అవుట్, రీ వెరిఫికేషన్, పూర్తి వివరాలు అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు.మంజూరైన ఇండ్లలో 10 శాతం ఇండ్లకు బేస్‌మెంట్ పనులు ఒక వారం లోపే పూర్తయ్యేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలం మొదలయ్యేలోగా మంజూరు ప్రక్రియ పూర్తి చేసి,నిర్మాణ పనులు వేగంగా ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ కమిటీల ద్వారా అర్హుల జాబితా తీసుకుని,అర్హతను పరిశీలించి, నిర్మాణానికి అర్హులైన లబ్ధిదారులను గుర్తించి,ఇండ్ల నిర్మాణాన్ని పంచాయతీ కార్యదర్శితో సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.నిర్మాణ దశలను బట్టి దశలవారీగా లబ్దిదారులకు ప్రతి సోమవారం నాడు వారి ఖాతాలోనే నేరుగా డబ్బులను జమ చేయడం జరుగుతుందని అన్నారు.ఏప్రిల్ 30 లోపు ఫీల్డ్ వెరిఫికేషన్‌ను పూర్తిచేసి,అర్హులైన వారినే తుది జాబితాలో ఎంపిక చేయాలని ఆదేశించారు.నిరుపేద అర్హులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అధికారులను ఆదేశించారు.ఎల్.ఆర్.ఎస్ కొరకు వచ్చిన పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగ రావు,ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ రమేష్ బాబు,ఇంచార్జ్ ఎల్డీయం శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, వివిధ శాఖల బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన రాష్ట్ర చీఫ్ రీజనింగ్ అధికారి



**నంగునూరు, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని ముండ్రాయి, పాలమాకుల ఐకేపీ సెంటర్లను రాష్ట్ర చీఫ్ రైజనింగ్ అధికారి, ఐఏఎస్ అధికారి ఫణీందర్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు సెంటర్లను డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జయదేవ్ ఆర్యా, అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్, డీఎస్వో తనూజా, డీ ఎం ప్రవీణ్ తదితరులతో కలిసి కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఏమైనా ఇబ్బందులు తలెత్తుతున్నాయా అనే విషయాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు ప్రక్రియ ఎలా జరుగుతుంది, ధాన్యం దిగుమతి చేసుకోవడంలో మిల్లర్ల ద్వారా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఐకేపీ అధికారులను, సెంటర్ నిర్వాహకులను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఫణిందర్ రెడ్డి రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఈ యాసంగి సీజన్ లో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయని చెప్పారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సమస్యలను తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు ప్రక్రియ సాఫీగా సాగుతోందని, రైతులకు సంబంధించిన కొన్ని సమస్యలు తమ దృష్టికి వచ్చాయని తెలిపారు. వాటిని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్తామని అన్నారు. వాటి పరిష్కార దిశగా చర్యలు చేపడుతామని చెప్పారు. కార్యక్రమంలో ఏపిఎం మహిపాల్, సీసీ లింగం పలువురు పాల్గొన్నారు.

# రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**వీపనగండ్ల, ఏప్రిల్ 26 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల పరిధిలోని పుల్గర్చర్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపిఎం బుచ్చన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఆసంగి కాలంలో రైతులు ఎంతో కష్టపడి పండించిన పంటను దళారులకు అమ్మి మోసపోవద్దని సలహా ఇచ్చారు. ప్రభుత్వమే వరి ధాన్యాన్ని మొత్తం కొంటుందని అన్నారు. మహిళా సమాఖ్య మండలి ఆధ్వర్యంలో వరి ధాన్యాన్ని రైతుల నుండి కొనుగోలు చేస్తారని అన్నారు. మహిళా సమైక్య మండల సభ్యులు రైతులకు ఎలాంటి ఇబ్బంది కలిగించదని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా మండల సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ, గ్రామ సంఘం కార్యదర్శి బాలమ్మ, గ్రామ రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారి సాత్వికకు బాసటగా నిలిచిన హరీష్ రావు

**సిద్దిపేట బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** భద్రంగా ఉండండి. భవిష్యత్ లో ఎదగాలి అనే కార్యక్రమం లో సిద్దిపేట పట్టణానికి చెందిన నాగరాజు విజయ దంపతుల కూతరు సాత్విక స్ప్రింగ్ డైల్స్ స్కూల్ 7వ తరగతి విద్యార్థిని సంవత్సరం క్రితం తన తండ్రిని కోల్పోయింది.. అమ్మ నాన్న ల గురించి కార్యక్రమంలో వివరించే సమయం చిన్నారి సాత్విక స్టేజి మీదకు వచ్చి నాకు నాన్న లేదు.. నేను అమ్మను ఎప్పుడు ఇబ్బంది పెడుతున్న ఏడుస్తు... దుఃఖం వెళ్ళబుచ్చింది.. దానితో అక్కడే ఉన్న హరీష్ రావు తండ్రిని కోల్పోయి.తల్లిని ఇబ్బంది పెడుతున్న అనే తన ఆవేదనతో చెప్పడం హరీష్ రావు మనసును కదిలిచించింది.. ఒక్కసారే కన్నీటి పర్యంతం అయ్యారు. చిన్నారిని దగ్గరికి పిలిచి ఆత్మీయంగా ముచ్చటించారు.తన బాగోగులు తెలుసుకున్నారు. మీటింగ్ జరిగే సమయం లోనే హరీష్ రావు మిత్రుని సహాయం తో హైదరాబాద్ కు చెందిన వ్యాపార వేత్త తిరుమల్ రెడ్డి చిన్నారి కుటుంబానికి అండగ ఉంటానని, నా వంతు గా 2లక్షలు సహాయం చేస్తా అని హరీష్ రావు గారితో ఫోన్ లో చెప్పారు.ఈ సందర్భంగా 25 వ తేదీన నా క్యాంపు కార్యాలయం లో టిఫిన్ కి రావాలని చిన్నారిని, తల్లిని హరీష్ రావు గారు ఫోన్ లో మాట్లాడి కోరారు.. ఇచ్చిన మాట ప్రకారం శుక్రవారం ఉదయం క్యాంప్ కార్యాలయం లో వారితో కలసి టిఫిన్ చేశారు.. వారి పరిస్థితి అడిగి తెల్సుకున్నారు...మంచిగా చదవాలి. భవిష్యత్



లో ఎదగాలి అని... మంచి ఉద్యోగం సంపాదించి మి అమ్మను మంచిగా చూసుకోవాలి చెప్పారు.. 2లక్షల చెక్ ను తల్లి కి చిన్నారికి అందజేశారు.

మళ్ళీ అమ్మను ఇబ్బంది పెడుతున్నావా..ఇబ్బంది పెట్టొద్దు.. అమ్మ ప్రేమ చాలా గొప్పది అని హరీష్ రావు చిన్నారితో ఆత్మీయంగా చెప్పారు.. ఈ ప్రపంచం లో అమ్మ ప్రేమ ఎంతో గొప్పది అని.నువ్ మంచిగా చదువు కొని.మంచి ఉద్యోగం వచ్చిన సందర్భం అమ్మకు ఎంతో ఆనందంగా ఉంటుందని.. అమ్మకు నువ్ ఇచ్చే గొప్ప బహుమానం అదేనన్నారు.భవిష్యత్ లో చదువుకు అయన ఇంక ఇబ్బంది లు ఉన్న నేను అండగా ఉంటానని భరోసానిచ్చారు.

# దళారులకు ధాన్యం విక్రయించవద్దు



**మెదక్ జిల్లా బ్యూరో, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కన్స్యూమర్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల తెలిపారు. మెదక్ జిల్లా పర్యటనలో భాగంగా మెదక్ మండలంలో అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి కోమటూరు, రాజ్ పల్లి, బాలనగర్ కొనుగోలు కేంద్రాలను శుక్రవారం పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్డిఓ,సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్షించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోళ్లు వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఆదేశాల అనుసరిస్తూ సివిల్ సప్లై యంత్రాంగం మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు.కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో వేయింగ్ మిషన్స్, ప్యాడి క్లీనర్స్, మార్చురైజర్ రైజర్స్, టార్పోలిన్స్ అందుబాటులో ఉన్నాయన్నారు.కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని, లారీల సంఖ్య పెంచాలని, ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్లో ట్యాబ్ ఎంట్రీ చేయాలని, రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వెంట వెంటనే పడేలా చూడాలనిసివిల్ సప్లై అధికారులు ఆదేశించారు. ఆటోమేటిక్ ప్యాడి క్లీనర్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నచిన్న లోటుపాట్లను సవరించుకొని కొనుగోలులో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్డిఏ పిడి శ్రీనివాసరావు, డి ఎం సివిల్ సప్లై సురేష్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ. మేనేజర్ జగదీష్, డిసిఒ కరుణాకర్, సంబంధిత వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గృహలక్ష్మీ లబ్ధిదారులకు కలెక్టర్ చెక్కుల పంపిణీ




**న్యాల్‌కల్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో "ఇందిరమ్మ గృహ లక్ష్మి" లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. శుక్రవారం గ్రామంలో బీబీఎస్ ఫంక్షన్ హాల్లో జరిగిన "భూ భారతి చట్టం" కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి, సెటివిన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి హాజరై రైతులకు "భూ భారతి చట్టం" గూర్చి అవగాహన కల్పించారు. అనంతరం న్యాల్‌కల్‌కు చెందిన "ఇందిరమ్మ గృహ లక్మి" లబ్ధి దారులు జయప్ప, లక్ష్మీ, జయమ్మ, సోనమ్మలకు రూ:1లక్ష చొప్పున చెక్కులను పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి లబ్ధి దారులకు సూచించారు. న్యాల్ కల్ గ్రామానికి అదనంగా మరో 50 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని స్థానిక సహకార సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# క్రీడాకారులకు ఎమ్మెల్యే శ్రీహరి ప్రోత్సాహం

**మక్తల్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** మక్తల్ పట్టణం క్రీడాకారులకు పెట్టింది పేరని ఎమ్మెల్యే డాక్టర్ వాకిటి శ్రీహరి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన మక్తల్ సూపర్ ప్రీమియర్ లీగ్ (ఎంఎస్‌పీఎల్) టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఒకప్పుడు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ వంటి క్రీడలతో కళకళలాడిన ఈ మైదానాన్ని పూర్వ వైభవానికి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. క్రీడల వల్ల కలిగే అనేక ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించిన ఎమ్మెల్యే, స్టేడియం నిర్మాణంలో కుంచించుకుపోయిన క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. క్రీడాకారులు గెలుపు ఓటములను క్రీడా స్ఫూర్తితో స్వీకరించాలని ఆయన ఆకాంక్షించారు. పూర్తిస్థాయి క్రీడా మైదానంతో పాటు క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ కోర్టులు, ఇండోర్ స్టేడియం వంటి మౌలిక సదుపాయాలను కల్పించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.ఎంఎస్‌పీఎల్ టోర్నమెంట్ నిర్వాహకులు కోళ్ళ



వెంకటేష్ తదితరులను ఎమ్మెల్యే అభినందించారు. బహుమతుల ప్రదానోత్సవానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిని ఆహ్వానించి, స్టేడియం నిధుల కోసం తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జి.లక్ష్మారెడ్డి, నిర్వాహకులు కోళ్ల వెంకటేష్, సీఐ రామ్ లాల్, ఎస్ఐ వై.భాగ్యలక్ష్మి రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి బ్యాటింగ్ చేసి క్రీడాకారుల్లో ఉత్సాహం నింపారు.

# నకిలీ క్రిమి సంహారక మందులు అమ్మితే చర్యలు

● వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ కేవీఎన్ రెడ్డి



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ రైతులకు నకిలీ క్రిమిసంహారక మందులు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ కేవీఎన్ రెడ్డి హెచ్చరించారు. వరి పంటకు క్రిమి సంహారకమందు వినియోగించి నష్టపోయిన నాగర్ కర్నూల్ మండలం చందుబట్ల, నర్సాయిపల్లి గ్రామాలలో శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మారెడ్డి అనే రైతుల వరి పంటలను కెవిన్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారులు, పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కమిషన్ డైరెక్టర్ కెవిన్ రెడ్డి మాట్లాడుతూ రైతులను మోసం చేసి నష్టం చేకూర్చే ఏజెన్సీల చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. సీడ్స్ అండ్ ఫిలైజర్స్ దుకాణదారులు ఎంతటి వారైనా వారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. రైతులకు నకిలీ విత్తనాలు క్రిమిసంహారక మందులు విక్రయించే ఏజెన్సీల పై ప్రభుత్వపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చందుపట్ల నర్సాయిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేయడంతో కేవీయన్ రెడ్డి రైతుల పొలాలను పరిశీలించారు. వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ చంద్రశేఖర్, ఏడి పూర్ణ చందర్ లతో పూర్తిస్థాయి నివేదిక తప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని కేవియన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో భూత్పూర్ ములుగు లాటి ప్రాంతాలలో నకిలీ మందులు విత్తనాలపై సీరియస్ గా ఉన్నామని రైతులకు నష్టం చేసే ఏ చర్యలకు కూడా ఉపేక్షించేది లేదన్నారు. చందుపట్ల నర్సాయిపల్లి రైతులకు కూడా న్యాయం చేస్తామని కె.వి.రెడ్డి అన్నారు. రైతుల పొలాలలో క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని పూర్తిస్థాయి నివేదికను తెప్పించుకొని తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కేబీఎన్ రెడ్డితో పాటు వ్యవసాయ శాఖ అధికారులు పాలెం ప్రాంతీయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్తలు ఉన్నారు.

# ఉత్సాహంగా సాగుతున్న పాదయాత్ర

**నంగునూరు, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** బీఆర్ఎస్ వజ్రోత్సవ సభలో పాల్గొనేందుకు విద్యార్థులు, యువకులతో పాదయాత్ర ప్రారంభమైంది.సిద్దిపేటలో రంగధాంపల్లి అమరవీరుల స్తూపం వద్ద మాజీ మంత్రి హరీశ్ రావు శుక్రవారం ఉదయం ఆరు గంటలకి జండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. సిద్దిపేట నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన1,500 మంది విద్యార్థి యువకులు ఈ పాదయాత్రలో ఉత్సాహంగా సాగుతున్నారు. శుక్రవారం పాదయాత్ర రంగధాంపల్లి, మిట్టపల్లి, సురభి మెడికల్ కళాశాల చౌరస్తా, అమ్మ కుంట, ముండ్రాయి, రాజగోపాలపేట, పాలమాకులకు ఉదయం 10 గంటలకు చేరుకుంది. పాలమాకులలోని రేణుక ఎల్లమ్మ గుడి వద్ద పాదయాత్రలో పాల్గొన్న విద్యార్థులు యువకులు మధ్యాహ్న భోజనం చేసి విశ్రాంతి తీసుకున్నారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పాలమాకులలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం వద్ద విద్యార్థులు, యువకులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. సందర్భంగా హరీశ్ రావు వారితో మాట్లాడుతూ విద్యార్థుల పాదయాత్ర భవిష్యత్ గులాబీ జెండా విజయ యాత్ర అవుతుందని పేర్కొన్నారు. పాదయాత్రలో క్రమశిక్షణతో వెళ్లాలని, రోడ్డు మీద వెళ్లే వాహనాలను చూస్తూ వారిని సూచించారు. పాదయాత్రకు అన్నివిధాలా ఏర్పాట్లు



చేశామని, పాద యాత్రలో పాల్గొంటున్న గుండె గులాబీలను తన గుండెల్లో పెట్టుకుంటానన్నారు. తాను కూడా పాదయాత్రలో విద్యార్థులు యువకులతో ప్రతిరోజు కొంత దూరం కలసి నడుస్తానని, మూడు రోజులపాటు మధ్యాహ్నం రాత్రి వారితో కలిసి భోజనం చేస్తానని తెలిపారు. అనంతరం సాయంత్రం నాలుగున్నర గంటలకు పాలమాకులలో టీ, స్నాక్స్ తీసుకుని అయిదు గంటలకు తిరిగి పాద యాత్ర బయలుదేరింది. రాంపూర్ క్రాసింగ్, జెరిపోతుల తండా స్టేజి, బద్దిపడగ గ్రామాల మీదుగా జ్యోతి రామ్ తండా స్టేజి వద్ద ఉన్న ఎల్వీఆర్వేడుక మందిరానికి రాత్రి ఎనిమిది గంటలకు చేరుకుంది. అక్కడే భోజనం చేసి విద్యార్థులు, యువకులు రాత్రి బస చేశారు. శనివారం (26వ తేదీ) ఉదయం ఆరు గంటలకు ఎల్వీఆర్ వేడుక మందిరం నుంచి బయలు దేరి కోహెడ మండలం బస్వాపూర్, ఆరెపల్లి, నాగసముద్రాల స్టేజి, కోహెడ క్రాసింగ్ మీదుగా ఉదయం 10 గంటలకు పెద్ద సముద్రాల చేరుకుంటుంది. పెద్ద సముద్రాలలోని సుమంగళి వేడుక మందిరం వద్ద మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు పాదయాత్రకు విరామం ఇస్తారు. టీ,స్నాక్స్ తీసుకొని సాయంత్రం ఐదు గంటలకు పాదయాత్ర తిరిగి ప్రారంభం అవుతుంది. పెద్ద సముద్రాల నుంచి ఇందిరానగర్, అంబేద్కర్ నగర్, రేగొండ స్టేజీ, పందిళ్ళ, హుస్నాబాద్ పట్టణ ప్రధాన వీధి మీదుగా హుస్నాబాద్ మండలంలోని పోతారం గ్రామానికి రాత్రి 8 గంటలకు చేరుకుంటుంది. పోతారంలోని హెచ్ఏఎల్ వేడుక మందిరంలో రాత్రి భోజనం చేసి బస చేస్తారు. మరునాడు అంటే ఈనెల 27వ తేదీ ఉదయం పోతారం నుండి పాదయాత్ర బయలుదేరి భీమదేవరపల్లి మండలం ముల్కనూరు వరకు సాగుతుంది. ఉదయం 11 గంటలకు ముల్కనూరులోని శ్రీ గార్డెన్ వేడుక మందిరంలో మధ్యాహ్న భోజనం చేసిన తర్వాత పాదయాత్ర బయలుదేరి మధ్యాహ్నం మూడు గంటలకు రజతోత్సవ సభ ప్రాంగణానికి చేరుకుంటుంది. సభ ముగిసిన తర్వాత బస్సులు ఇతర వాహనాలలో తిరిగి స్వస్థలాలకు పయనం అవుతారు.

# మారుమూల మండలాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

## ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)**



ఆదిలాబాద్ జిల్లాలోని మారు మూల మండలాల అభివృద్ధి కోసం ప్రత్యేకంగా కృషి చెయ్యడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం భూ భారతి అవగాహన సదస్సు లో భాగంగా కలెక్టర్ జిల్లాలోని మారు మూల మండలాలైన గాధిగూడ, నార్నూర్ లో పర్యటించారు. గ్రామస్తులు కలెక్టర్ కుఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి , మౌళిక వసతుల కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నామని అదేవిధంగా కొత్త తీసుక వచ్చిన భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని, రైతులు ఈ చట్టం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. సదస్సు కార్యక్రమం లో భూ భారతి కొత్త ఆర్ ఓ ఆర్ చట్టం పై తహసిల్దార్ గ్రామస్తులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు.పలువురు రైతులు భూ భారతి చట్టం పై సందేహాలను కలెక్టర్ కు వివరించిన అనంతరం కలెక్టర్ వారి సందేహాలను నివృత్తి చేశారు.భూ భారతి లో కీలకాంశాలను గ్రామస్తులకు వివరించి చెప్పారు.ధరణి స్థానం లో కొత్త భూమి హక్కుల రికార్డు భూ భారతి హక్కుల రికార్డులలో తప్పుల సవరణకు అవకాశం, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేయడానికి ముందు భూముల సర్వే, మ్యాప్ తయారీ, పెండింగ్ సాదా బైనామా దరఖాస్తుల పరిష్కారం, వారసత్వంగా వచ్చిన భూములను మ్యూటేశన్ చేసే ముందు నిర్ణీత కాలం లో విచారణ, భూమి హక్కులు ఏ విదంగా సంక్రమించిన మ్యుటేషన్ చేసి రికార్డులలో నమోదు, పాసు పుస్తకాలలో భూమి పటం, భూ సమస్యల పరిష్కారానికి రెండు అంచెల అప్పీల్ వ్యవస్థ, భూ దార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలకు, అబాది, వ్యవసాయేతర భూములకు హక్కుల రికార్డు, రైతులకు ఉచిత న్యాయ సహాయం, గ్రామ్ రెవెన్యు రికార్డుల నిర్వహణ, మోసపూరితంగా హక్కుల రికార్డులు మార్చి ఎవరైనా ప్రభుత్వ భూదాన్, అసైన్డ్, ఎండోమెంట్, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే రద్దు చేసే అధికారాలు ఉంటాయని ఆన్నారు. భూ భారతి' నూతన ఆర్.ఓ.ఆర్ చట్టం భూ వివాదాల పరిష్కారానికి ఎంతగానో దోహదపడుతుందని ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం అనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూ సమస్యల పరిష్కారానికి ఎంతో వెసులుబాటు కల్పించే భూ భారతి చట్టం పై అవగాహనను కల్పించుకొని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. సదస్సులో తహసిల్దార్ విజయనందం ఎంపీడీవో, ఎంపిఓ, రైతులు పాల్గొన్నారు.

# అన్యక్రాంత భూములను వెలికితీస్తాం

## నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**సారంగాపూర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**



సారంగాపూర్ మండల కేంద్రంలో రైతు వేదికలో శుక్రవారం భూభారతి పై అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ హాజరై మాట్లాడారు కాంగ్రెస్ ప్రభుత్వం లో భూభారతి చట్టం ద్వారా నిజమైన పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. గతంలో పాలించిన ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పేదలకు రైతులకు అన్యాయం జరిగిందని తాత నుంచి వారసత్వంగా వచ్చిన భూముల కోసం రైతులు చెప్పులు అరిగేదాకా కార్యాలయాల చుట్టూ తిరిగిన కూడా పనులు కాలేదని తెలియజేశారు. భూ తగాదాలతో రైతులు గొడవపడ్డారని తెలిపారు. భూ కబ్జాలు అక్రమాలు వివాదాలు తొలగించి రైతులకు భద్రత కల్పించేందుకు భూభారతి చట్టం కీలకంగా పనిచేస్తుందని తెలిపారు. రైతులు ఎలాంటి అనుమానాలు లేకుండా భూమి వివరాలు అధికారులు చేపడుతున్న సర్వేలు సరిగ్గా నమోదు చేసుకోవాలని సూచించారు. సదా బైనామాలతో పాటు అనేక సమస్యలు ఈ చట్టం ద్వారా రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. అన్యక్రాంతం భూములను కూడా వెరికితీస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సారంగాపూర్ తాసిల్దార్ శ్రీదేవి, ఎంపీడీవో లక్ష్మి కాంతారావు, ఏవో వికార్ అహమ్మద్ సారంగాపూర్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా అధికారులు మండలాధికారులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్ర దాడి పిరికి పంథ చర్య

## ఘటనను ఖండించిన తెలంగాణ సామాజిక రచయితల సంఘం

**చిట్యాల ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

జమ్ము కాశ్మీర్‌లోని పహల్గామ్ ప్రాంతంలో నిరాయుధ యాత్రికులపై జరిగిన ఉగ్రవాద దాడిని తెలంగాణ సామాజిక రచయితల సంఘం తీవ్రంగా ఖండిస్తూ ఉందని సంఘం రాష్ట్ర అధ్య క్షులు కామిడి సతీష్ రెడ్డి,జిల్లా అధ్య క్షులు మాసు రమేష్, ప్రధాన కార్యదర్శి వెంగళ రణధీర్ లు అన్నారు. ఇటీవల పహల్గామ్‌లో జరిగిన ఈ ఉగ్రదాడి కేవలం అఘాయిత్యమైన హత్య కాదు, ఇది మన దేశ ఆత్మపై జరిగిన దాడి .మతాన్ని ఆధారంగా చేసుకొని అమాయకులపై ఉగ్రవాదులు చేసిన దాడి మానవ సమాజాన్ని తలదించేలా చేసిందని ఈ చర్యలు కాశ్మీర్ అభివృద్ధిని అడ్డుకోవాలనే కుట్రలో భాగం అని అన్నారు .తమ సంఘం ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆర్టికల్ 370 రద్దుతో పాటు కాశ్మీర్‌ను అభివృద్ధి మార్గంలోకి తీసుకువచ్చే యత్నాలు వేగంగా జరుగుతున్నాయని, పాక్ శత్రువులు ఉగ్రదాడులకు పాల్పడుతున్నారు .ఇలాంటి దాడులు దేశ ప్రజల మనోధైర్యాన్ని కుదింపజేయలేవు. భారతీయు లు శాంతి, ఐక్యత, భద్రతకు ప్రాధాన్యత ఇస్తారని భద్రతా దళాలు, సైనిక బలగాలు కాశ్మీర్‌లో గట్టి నిఘా పెట్టి, ఈ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించేందుకు కృషి చేస్తున్నాయని దేశ ప్రజలు వీర సైనికులకు అండగా నిలుస్తున్నారు. మరణించిన పర్యాటకుల ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ మౌనం పాటించి నట్లు వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ ఉన్నట్లు సతీష్ రెడ్డి, రమేష్, రణధీర్ లు అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం తలెత్తుకునేలా చేస్తున్న విదేశాంగ విధానం వల్లే, అంతర్జాతీయంగా కూడా ఈ ఉగ్రదాడికి వ్యతిరేకంగా మద్దతు లభిస్తోందని ఉగ్రవాదం అంతర్జాతీయ సమస్యగా భావించి, దేశమంతా దీన్ని నిరసించాలి అని వారు అన్నారు.

# హైబ్రిడ్ వరితో రైతు ఆగమాగం

**నూగూర్ వెంకటాపురం, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**



ప్రైవేట్ విత్తనోత్పత్తి కంపెనీల హైబ్రిడ్ మేలు, పిమేల్, రకాల వరి సాగు చేస్తున్న రైతుల పరిస్థితి గందరగోళంగా మారింది.రైతులకు హైబ్రిడ్ మేలు, పిమేల్, సాగు చేయుటకు గ్రామాలలో తిరిగి పంట బాగా పండుతుంది. దిగుబడి బాగా వస్తుందని రైతులు సాగు చేసే వరకు వెంట పడతారు. పెట్టు బడి అంతా కంపెనీ భరిస్తుందని చెప్పి రైతుతో ప్రైవేట్ విత్తనోత్పత్తి కంపెనీ లు వరి సాగు చేపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇప్పటి పుప్పొడి రాక, పాలినేషన్ జరగ వరి గొలుసు తాలుగా మారి పోతుంది. దీని వలన పంట దిగుబడి పై పడే అవకాశం ఉంది. వెంకటాపురం మండలంలో కొన్ని వందల ఎకరాలు సాగు చేస్తున్నాప్పటికి రైతుల పరిస్థితి ఆగమాగం అవుతుందని వాపోయారు.

వెంకటాపురం మండలం బర్ల గూడెం పంచాయతీ పరిధిలో ఉన్న అట్టం సారయ్య( 56)అనే రైతు హైబ్రిడ్ విత్తనోత్పత్తి (మేలు, పిమేల్ )వరి 10ఎకరాలు సాగు చేశారు. ప్రైవేట్ కంపెనీలు సాగు చేసే అంతా చెపు వెంట పడి మరి వ్యవసాయం చేస్తే పంట దిగుబడి ఎకరానికి 7క్వింటాలు, 10క్వింటాలు వస్తుందని, రైతుకి నష్టం జరగదని మాయ మాటలు చెప్పి వ్యవసాయం మొదలు చివరి వరకు కూలీల ఖర్చు అంతా కంపెనీ భరిస్తుందని చెప్పి వ్యవసాయం చేయించారని, తీరా పంట చేతికొచ్చాక రైతు కంపెనీ ఆర్గనైజర్ ఇంటి చుట్టూ తిరిగి, తిరిగి కాళ్ళు అరిగే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కన చేనులో పంటని కూలీలతో కోత కోయించి తీసుకెళ్లారని రైతు తెలిపారు. అట్టం సారయ్య అనే రైతు చేను పంట కోయాలి అని ఆర్గనైజర్ దగ్గరికి వెళ్తే ఇప్పుడు పైసలు లేవు అని, కోత ఇప్పుడు కుదరదు అని చెప్పడంతో రైతు ఏమీ చేయాలో అర్థం కానీ పరిస్థితిలో ఉన్నాడు. మేలు, పిమేల్ మండలంలో లక్ష ఎకరాల్లో సాగు చేయిస్తున్నారు.సాధారణ వరితో పోలిస్తే మేలు, పిమేల్ సాగులో శ్రమ, ఖర్చు అధికంగా ఉంటుంది.పాలినేషన్ జరగకపోతే వరి సాగులో పాలినేషన్ కీలకం మగ వరి నుండి వచ్చే పుప్పొడి ఆడ వరి పై పడేలా చేయడం ద్వారా గింజలు పాలు పోసుకుంటాయి.పాలినేషన్ సరైన సమయంలో జరగకపోతే నాణ్యత తగ్గి విత్తనాల్లో మొలక శాతం తగ్గుతుంది.

**విదేశీ కంపెనీల మాయాజాలం**

వాతావరణ పరిస్థితులతో ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా రైతులను హైబ్రిడ్ వరి విత్తనా కంపెనీలు నట్టేట ముంచుతున్నాయి. ఇదివరకు మేలు, పిమేల్ వరి సాగు చేసే రైతులతో విత్తన కంపెనీలు ఒప్పందం కుదుర్చుకొనీవి. సరైన దిగుబడి రాకపోతే.. పంట కు డబ్బులు తిరిగి ఇచేలా బాండు రాసుకునే వారు. కంపెనీ నిబంధనలు చెప్పి, రైతులతో సంతకాలు తీసుకోనే వారు. వాతావరణం సహకరించక పంట దిగుబడి తగ్గితే విత్తనాలు, పురుగు మందులు డబ్బులు మినహాయించి ఎంతో కొంత డబ్బులు ముట్ట జెప్పేవారు.ఇప్పుడు అ పరిస్థితి లేదు.ఎలాంటి ఒప్పందం లేకుండా కంపెనీ ఆర్గనైజర్లు రైతులతో హైబ్రిడ్ రకాలు సాగుచేయిస్తున్నారు. వాతావరణం లో మార్పులతో మెల్, పిమేల్ సాగు దెబ్బతిస్తుండగా విత్తనా కంపెనీలు చేతులెత్తేస్తే తమ పరిస్థితి ఏమిటని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇదివరకు కొన్నికంపెనీలు వరి సాగు చేసిన రైతులు ఆర్గనైజర్ల మోసానికి బలైన ఘటనలు ఉన్నాయి. హైబ్రిడ్వరి సాగు పై వ్యవసాయశాఖ వద్ద సరైన సమాచారం లేకపోవడం ఆందోళన కల్గించే అంశం. ఈ విషయం పై ప్రభుత్వం దృష్టి సారించాలని అన్న దాతలు వేడుకుంటున్నారు.

# మినీ జాబ్ మేళాలో నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

## మంచిర్యాల జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ

**మంచిర్యాల ప్రతినిధి ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

: జిల్లా ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మిమ్స్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మినీ జాబ్ మేళా ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగవకాశం కల్పించడం జరిగిందని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో 80 ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా 87 మంది హాజరయ్యారని, 25 మంది అభ్యర్థులు శ్రీవిజయ బయో ఫెర్టిలైజర్స్ ప్రైవేట్ లిమిటెన్ కంపెనీ పోస్టులకు ప్రాథమికంగా ఎంపిక కాగా 18 మంది అభ్యర్థు లు నియామకం అయ్యారని తెలిపారు. ఈ మినీ జాబ్ మేళా కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్, వైస్ ప్రిన్సిపల్ శ్రీధర్రావు, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రై.లి., శ్రీవిజయ బయో ఫెర్టిలైజ్స్ ప్రై.లి., మణప్పురం హెూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు రాజు, వీరస్వామి, బాలకృష్ణ, సిబ్బందిపాల్గొన్నారు.

# భూభారతితో షెడ్యూల్ చట్టాల ఉనికికి పెను ప్రమాదం

**నూగూర్ వెంకటాపురం, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :**




ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి
పేసా చట్టానికి లోబడి భూభారతి చట్టాన్ని అమలు చేయాలి
సమగ్ర భూ సర్వే నిర్వహించాలని డిమాండ్

స్వతంత్ర అనంతరం, స్వతంత్రానికి పూర్వం వచ్చిన ఏజెన్సీ చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, పాలకుల ఉదారవాద నిర్లక్ష్యపు విధానాల కారణంగా షెడ్యూల్ చట్టాల ఉనికికి పెను ప్రమాదం సంభవించింది అని ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. భూ భారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిన సందర్భంగా వెంకటాపురం మండలం లోని పాత్రాపురం రైతు వేదికలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జిల్లా కలెక్టర్ దివాకరా టి ఎస్ రైతుల తో శుక్రవారం అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు . ఈ సందర్భంగా కలెక్టర్ భూ భారతి చట్టాన్ని గురించి రైతులకు సమగ్రంగా వివరించారు.పార్లమెంట్ చట్టాలు అయిన ఎల్టిఆర్, పేసా చట్టాలను రాష్ట్ర ప్రభుత్వం చేసిన చట్టాలు అతిక్రమించ రాదని నర్సింహా మూర్తి కలెక్టర్ దివాకరా టి ఎస్ ని కోరినారు.గత ప్రభుత్వం తెచ్చిన 2020 పట్టాదారు పాసు పుస్తకాల చట్టం ఎల్టీ ఆర్ చట్టాన్ని ఉల్లఘించిందన్నారు. అదే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించడం అత్యంత బాధాకరం అన్నారు. భూ భారతి చట్టం ఆదివాసీలకు ఎలాంటి భరోసా కలిగించ నుందని నర్సింహా మూర్తి కలెక్టర్ ని ప్రశ్నించారు. నకిలీ సెటిల్మెంట్ పట్టాలను నియంత్రించడం లో నూతన చట్టం ఎలాంటి పాత్ర పోషిస్తుందని అన్నారు. షెడ్యూల్ ఏరియాలో వలస గిరిజనేతరుల అక్రమ పట్టాలను ముందుగా గుర్తించి రద్దు చేయాలనీ కోరినారు. 1/59, 1/70, చట్టాలు అమల్లోకి వచ్చాక వలస గిరిజనేతరులు వేలాది ఎకరాల భూములు కబ్జా చేసారని అన్నారు. అందుకే షెడ్యూల్ ఏరియాలో సమగ్ర భూ సర్వే నిర్వహించాలని అన్నారు. రాజ్యాంగ బద్దత కలిగిన 1/70 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన చట్టాలు ఉల్లంఘిస్తున్నాయని కలెక్టర్ కు తెలిపారు. ఆబాది, గ్రామ కంఠ భూములకు షెడ్యూల్ ఏరియాలో నూతన చట్టం ద్వారా గిరిజనేతరులకు పట్టాలు జారీ చేయరాదు అన్నారు. 2014 ముందు జరిగిన సాదా బైనామాలకు మాత్రమే ఈ చట్టం లో ప్రాధాన్యత ఉంటుందని కలెక్టర్ చెప్పడం తో ఎల్ టి ఆర్ చట్టం అమల్లో ఉన్న ఈ ప్రాంతం లో సాదా బైనామా ను ఎలా ఇంప్లిమెంట్ చేస్తారని కలెక్టర్ ని నిలదీశారు. పేసా చట్టం ప్రకారం లేదా ఎల్టీఆర్ కోర్టు ద్వారా షెడ్యూల్ ఏరియాలో భూ వివాదాలను పరిష్కరించాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినారు. ఇతర ఏ పద్ధతులు ద్వారా ఇక్కడ పరిష్కరించలేమని అన్నారు. అనంతరం కలెక్టర్ దివాకరా టి ఎస్ మాట్లాడుతూ ఎల్టీ ఆర్ చట్టానికి భూ భారతి చట్టం ద్వారా ఎటువంటి విఘాతం కలగబోదని హామీ ఇచ్చారు. భూ భారతి చట్టం లో ప్రతి సమస్యకు పరిస్కారం దొరుకుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు, చింత సమ్మయ్య, కుంజ మహేష్, పాయం రాంబాబు, అలెం కృష్ణారావు, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి



## మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు సుధాం లక్ష్మి

**ఆర్మూర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

: మహిళలు స్వయం ఉపాధి రంగాలలో రాణించాలని మహిళా కమిషన్ రాష్ట్ర సభ్యురాలు సుదాం లక్ష్మి అన్నారు. ఆర్మూర్ పట్టణం పెర్కిట్ లోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం (ప్రాంగణం)లో శుక్రవారం టైలరింగ్, కంప్యూటర్ కోర్సులలో శిక్షణ తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడుతూ టైలరింగ్ నేర్చుకున్న మహిళలకు చక్కటి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. వివిధ రకాల డ్రెస్సులు కుట్టడం నేర్చుకుంటే మంచి ఆదాయం వస్తుందన్నారు. నేటి ఆధునిక యుగంలో కంప్యూటర్ నేర్చుకున్న యువతులకు చక్కటి ఉపాధి అవకాశాలు ఉన్నాయని వివరించారు. శిక్షణకు సంబంధించిన కిట్ లను అందజేశారు. మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి రసూల్ బి మాట్లాడుతూ నేటి తరానికి అవసరమైన రీతిలో టైలరింగ్ లో శిక్షణ పొందాలన్నారు. కంప్యూటర్ శిక్షణ పొందిన యువతులకు ఆసుపత్రులు, కార్యాలయాలు తదితర వాటిలో మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. రెండు, మూడు నెలల పాటు శ్రద్ధతో శిక్షణలో పాల్గొని మెలకువలు నేర్చుకోవాలన్నారు. మహిళలు, శిశువుల భద్రత కోసం 1098, 181 కాల్ సెంటర్ ల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ప్రాంగణం అధికారిని ఇందిర, సిడిపిఓ భార్గవి, సిబ్బంది రాజశ్రీ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# మాసబ్‌ట్యాంక్‌లో హవాలా డబ్బు

## రూ. 8 లక్షలు పట్టివేత

**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :**



నగరంలో హవాలా డబ్బులను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని మాసబ్ ట్యాంక్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి రూ. 8 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారంమాసబ్ ట్యాంక్ ఏసీ గార్డ్స్‌లో నివసించే మహమ్మద్ అఖిల్(34) మేకల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడు దుబాయ్‌కు చెందిన అబ్బు అనే వ్యక్తి సూచనలతో హవాలా డబ్బును నగరంలో చలామణి చేస్తున్నాడు. శుక్రవారం మాసబ్ ట్యాంక్ ఏసీ గార్డ్స్ ప్రాంతంలో రూ. 8 లక్షలు తీసుకెళ్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. డబ్బులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. డబ్బులను ఆదాయ శాఖ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

# రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుతో ఉపాధి మార్గాలు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**

రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటు ద్వారా గ్రామీణ మహిళలకు, యువతకు ఉపాధి కల్పన, అలాగే సన్న, చిన్నకారు రైతులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి ఎంతో దోహదపడతాయని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన అంతర్జాతీయ సహకార సంవత్సరం 2025, రైతు ఉత్పత్తి సంఘాల అభివృద్ధి అనే అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించినట్లు తెలిపారు. సహకార సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం తగ్గింపు, ఆర్థిక స్థితి స్థాపకత కోసం సమ్మిళిత వృద్ధికి ఎంతో దోహదపడతాయని అన్నారు. జాతీయ స్థాయిలో సుమారు 10 వేల రైతు ఉత్పత్తి సంఘాల ఏర్పాటుకు భారత సహకార మంత్రిత్వశాఖ ప్రతిపాదించగా తెలంగాణలో 311 సంఘాలను ఎంపిక చేశారని వాటిలో మన భూపాలపల్లి జిల్లాలో 4 సంఘాలు ఉన్నట్లు ఆయన తెలిపారు.ఈ సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, జిల్లా సహకార అధికారి వాలియానాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వీరునాయక్, సింగిల్ విండో చైర్మన్లు, కార్యదర్శులు, సహకార అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుంభమేళ తరహాలో బిఆర్ఎస్ రజతోత్సవ సభ



**గోదావరిఖని (జనంసాక్షి) :** ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే 25 వసంతాల గులాబీ పండుగను విజయవంతం చేయాలని గులాబీ జెండాను గుండెకు హత్తుకుందామని ఊరు వాడా ఉప్పెనలా కదిలి ఓరుగల్లు మహా సభను విజయవంతం చేద్దామని రామగుండం మాజీ శాసనసభ్యులు పెద్దపల్లి జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సభను విజయవంతం చేయాలని కోరారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే టిఆర్ఎస్ పార్టీ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్క్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 24ఏళ్ల బిఆర్ఎస్ పార్టీ ప్రస్థానాన్ని రజతోత్సవ సభలో చర్చించండం జరుగుతుందని కనీవినీ ఎరుగని రీతిలో పండగ వాతావరణంలో కుంభమేళా తరహాలో కెసిఆర్ నాయకత్వంలో బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రామగుండం నియోజకవర్గం నుంచి ఐదు వేల మంది ఈ సభకు తరలి వెళ్లనున్నట్లు ఆయన తెలిపారు. పదేళ్ల ప్రగతి ప్రస్థానం వెనక్కి పోయిందని తెలంగాణ ప్రజలు దిగాలు పడుతున్నారని అని కెసిఆర్ మళ్లీ సీఎం కావాలని స తెలంగాణ ప్రజలంతా కోరుతున్నట్టు ఆయన తెలిపారు. రామగుండం నియోజకవర్గం నుంచి స్వచ్ఛందంగా బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు కార్మికులు అన్ని వర్గాల ప్రజలు బిఆర్ఎస్

పార్టీ రజతోత్సవ సభకు తరలివెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, గోపు అయులయ్య యాదవ్, బోడ్డు రవీందర్, కుమ్మరి శ్రీనివాస్, కలవచర్ల కృష్ణవేణి, బొడ్డుపల్లి శ్రీనివాస్, జనగామ కవితా సరోజిని, తోట వేణు, చెలకల పెల్లి శ్రీనివాస్, అచ్చ వేణు నూతి పాల్గొన్నారు.

# భూభారతితో రైతు సమస్యలు పరిష్కారం

- ధరణి స్థానంలో భూభారతి చట్టం అమలు
- అందరి సహకారముతో నియోజకవర్గ అభివృద్ధికి కృషి
- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి



**మిర్యాలగూడ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** సాగులో ఉన్న ప్రతి రైతుకు భూమిపై హక్కు కల్పించాలన్న ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం ప భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు . భూభారతి చట్టం( భూమి హక్కుల చట్టం -2025) పై రైతులకు అవగాహన కల్పించేందుకు ఉద్దేశించి నిర్వహిస్తున్న అవగాహన సదస్సులలో భాగంగా శుక్రవారం నల్గొండ జిల్లా, మిర్యాలగూడ మండల కేంద్రంలో భూ భారతిపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ధరణిలో ఉన్న భూ సమస్యలన్నింటిని గమనించి ధరణిని పక్కనపెట్టి ధరణి స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకురావాలని భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి రోజున చారిత్రాత్మక భూ భారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో తమ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని నిరూపించుకుంది అని అన్నారు.ధరణిలో అనేక లోటుపాట్లు ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం కొత్త చట్టం తీసుకురావాలన్న ఉద్దేశంతో పలువురు మేధావులు, రైతులు, రైతు సంఘాలు అందరితో చర్చించి ముందుగా కొన్ని మండలాలను పైలట్ మండలాలుగా తీసుకున్నదని, అందులో నల్గొండ జిల్లాలోని తిరుమలగిరి సాగర్, అడవిదేవులపల్లి కూడా ఉండేవని ,అయితే అనంతరం తిరుమలగిరి సాగర్ మండలంలో అన్ని రకాల భూ సమస్యలు ఉన్నందున ఆ మండలాన్ని పైలెట్ మండలం గా తీసుకున్నట్లు తెలిపారు. సాగులో ఉన్న రైతుకి, కబ్జాలో ఉన్న వారికి పట్టా ఇవ్వాలన్న ఉద్దేశంతోనే భూ భారతి చట్టాన్ని తీసుకురావడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీల మేరకు అన్నింటిని నెరవేరుస్తున్నదని, ముఖ్యంగా ఇల్లులేని నిరుపేదలకు ఇంటి పట్టాలనివ్వడం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇచ్చే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. శాసనమండలి సభ్యులు శంకర్ నాయక్ మాట్లాడుతూ ధరణి స్థానంలో తీసుకువచ్చిన భూ భారతి చట్టం రైతులకు అన్ని రకాల మేలు కలిగిస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ ధరణిలో లేని అనేక వెసులుబాట్లు భూ భారతిలో ఉన్నాయని, భూముల వివరాలన్నింటినీ భూ భారతి లో ఆన్లైన్లో ఉంచే వ్యవస్థ ఉందని తెలిపారు. వై వాటా వివాదాలలో భాగంగా చుట్టూ పక్కల ఉన్న భూములన్నింటిని సర్వే చేసే అవకాశం భూ భారతిలో ఉందని, అలాగే సంవత్సరంలో రికార్డులను సవరణ చేసే అవకాశం సైతం భూ భారతి కల్పిస్తుందని, ధరణిలో అప్పీల్ వ్యవస్థకు అవకాశం లేకుండెదని, అంతేకాక అనుభవ దారుకి ప్రాధాన్యత లేదని, భూభారతిలో కిందిస్థాయిలో న్యాయం జరగకపోతే పై స్థాయిలో అప్పీలు చేసుకోవచ్చని ,అంతేకాక భూ భారతి చట్టంలో అనుభవదారుకు ప్రాధాన్యత ఉంటుందని ఆమె వెల్లడించారు. రిజిస్ట్రేషన్ ,మ్యుటేషన్ తదితర వాటికి భూ భారతి చట్టంలో రైతు ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదని తెలిపారు. భూమి కొనుగోలు చేసిన 30 రోజులలో మ్యుటిషన్ కాకపోతే 31వ రోజు ఆటోమేటిక్ గా మ్యుటేషన్ అవుతుందన్నారు. రికార్డులను సరి చేసె అధికారంఆర్డీవో కు ఉందని తెలిపారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 31న రెవెన్యూ గ్రామ పరిధిలో భూముల వివరాలన్నింటినీ రైతులందరికీ కనిపించే విధంగా ప్రదర్శించడం జరుగుతుందని, వీటి ద్వారా ఏవైనా సవరణలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,మిర్యాలగూడ తహసిల్దారు హరి భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు. తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు తమ ప్రదర్శన ద్వారా భూ భారతి చట్టంపై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు, బి ఎల్ ఆర బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత...!



- బస్తాకు 2 రూపాయలు ఇస్తేనే లారీలు పంపుతామంటున్న లారీ ఓనర్లు..
- నిమ్మకు నీరెత్తినట్లు గా వ్యవహరిస్తున్న ఐకెపి అధికారులు!
- కర్షకుల బాధలు పట్టించుకునే నాధుడు లేక పాయే!!

**కనగల్లు. ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** ఆరుగాల ఎన్నో కష్టాలు పడి కాపాడుకొని పండించిన వరి పంటను కోత దశలో హరి వెస్టర్ మిషన్ల కొరత ఒక బాధ అయితే, కోసిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెట్టిన ధాన్యం రాసులు తేమ శాతం వచ్చిన తర్వాత అమ్ముకోవాలని అవస్థలు పడవలసిన పరిస్థితి అన్నదాతలకు తప్పడం లేదు. మునిగే నక్కపై తాటి పండు పడ్డట్టు , కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పరిచి బస్తాకు 2 రూపాయలు రైతు లు అదనంగా ఇస్తేనే లారీలకు కేంద్రాలకు పంపిస్తామంటున్న లారీ ఓనర్లు, సందులో సడే మియా లాగ మిల్లర్ల యాజమాన్యం తరుగు పేరు మరింత ఆలస్యం చేస్తూ సకాలంలో దిగుమతి చేయక ఉదాసీనత వైఖరి అవలంబిస్తున్న మిల్లర్లపై చర్యలు తీసుకోవటంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. హమాలీలు 17 శాతంలోపు మ్యాచరును సంబంధిత ఏ ఈ ఓ లు ధృవీకరణ చేసిన ధాన్యాన్ని తూకం వేసి న బస్తాలు నింపి రెండు, మూడు రోజులు ఒక్కో సెంటర్లో అవుతున్నప్పటికీ వాటిని లోడు చేయటంలో ఆలస్యం అవుతున్న ఐకెపి అధికారులు తూతూ మంత్రంగా కేంద్రాలను సందర్శిస్తూ కష్టాలలో ఉన్న కర్షకుల బాధలను తీర్చడంలో విఫలమైనట్లు ఐకెపిలలో జరుగుతున్న సమస్యలను చూస్తుంటే అర్థమవుతుంది. మండలంలో మూడు లేదా నాలుగు కేంద్రాలు పిఎసిఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు జరుగుతుంటే ఎక్కువ మొత్తంలో మహిళా సంఘాల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినప్పటికీని వీటికి అనుగుణంగా లారీలను అందుబాటులో ఉంచకపోవడం ఐకెపి నిర్వాహకులకు పెద్ద సవాల్ గా మారింది. ఓ పక్క పిఎసిఎస్ కేంద్రాలలో కొనుగోలు చేసినధాన్యం ఎగుమతులు చురుకుగా కొనసాగుతుంటే. ఐకెపి నిర్వాహకులు మాత్రం అధికారులపై ఒత్తిడి పెంచడం లేదని రైతులు అంటున్నారు. అన్నదాతల హరిగోసలు, వినడానికి ఇటు అధికార పార్టీ నాయకులు కానీ, అటు ప్రతిపక్ష పార్టీల నాయకులు కానీ కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడటం లేదు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

- సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే. రామస్వామి



**చేవెళ్ల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కే. రామస్వామి అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధిలోని అంతారం గ్రామంలో గ్రామ శాఖ కార్యదర్శి జయమ్మ అధ్యక్షతనలో గ్రామ శాఖ మహాసభ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నియోజకవర్గం ఇన్చార్జికే రామస్వామి హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ 11 సంవత్సరాలు గడుస్తున్న కోటి ఉద్యోగాలు కూడా కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం వచ్చిన తర్వాత నిరుద్యోగం నాలుగు శాతం పెరిగిందని, ఉద్యోగాలు లేక యువత చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను వెంటనే నెరవేర్చాలని గ్రామాలలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని, ఇప్పటికే గ్రామాలలో మౌలిక సదుపాయాలు లేక ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి మల్గారీ సత్తి రెడ్డి, సహాయ కార్యదర్శి ఎండి మక్బూల్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా ప్రెసిడెంట్ వడ్ల మంజుల, అంతారం గ్రామ శాఖ కార్యదర్శి జయమ్మ, సహాయ కార్యదర్శిగా లక్ష్మి, అమృత, నరసింహ, చంద్రయ్య, గంగమ్మ, పద్మమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ఇండ్ల పట్టాల పంపిణీ

- నిరుపేదల కోసం ఎమ్మెల్యే బిఎల్ఆర్ కృషి అభినందనీయం...
- కలెక్టర్ ఇలా త్రిపాటి..



**మిర్యాలగూడ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** పేద ప్రజల కోసం ప్రస్తుత ప్రభుత్వం నిర్విరామంగా కృషి చేస్తుందని అర్హులైన నిరుపేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ మండలం లక్ష్మీపురం గ్రామంలో నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ భూములను కేటాయించి వారికి భూమి పట్టాల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్, సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ లతో కలిసి లబ్ధి దారులకు పట్టాలు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాటి మాట్లాడుతూ ఇప్పటివరకు నా సర్వీస్ లో ఇలా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను గుర్తించి నిరుపేదలకు అందించిన ఎమ్మెల్యేనీ చూడలేదని ఇదే మొదటిసారి అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని అభినందించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ఇలాటి కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ భూమి పట్టాలు పొందిన ప్రతీ ఒక్క నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద లక్ష్మీపురం గ్రామంలోని అర్హులకు ఇల్లు లేని ప్రతిఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూర్ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, బీఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు.

## రిక్వెస్ట్ బస్టాండ్ ను తొలగించాలని ఎంపీకి వినతి



**జడ్చర్ల, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని కావేరమ్మపేటలో డాగ్ బంగ్లా (ఐబి) సమీపంలో 44 వ జాతీయ రహదారి పక్కన ఉన్న శ్రీ బంగారు మైసమ్మ తల్లి దేవాలయం ఎదురుగా నిరుపయోగంగా ఉన్న రిక్వెస్ట్ బస్టాండ్ ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని శుక్రవారం మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణకు దేవాలయ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ దేవాలయం ఎదురుగా రిక్వెస్ట్ బస్టాప్ నిరుపయోగంగా ఉందని, అక్కడే రోడ్డు అండర్ బ్రిడ్జి వేసే క్రమంలో రిక్వెస్ట్ బస్టాప్ వెనకాల మట్టి తీసి రోడ్డు వేయడంతో బస్ స్టాప్ వెనకాల మట్టి లేకపోవడం వల్ల ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అలాగే కావేరమ్మపేట ప్రజలకు ఈ బస్టాండ్ వల్ల ఎలాంటి ఉపయోగం లేదు, ఈ బస్టాండ్ దగ్గరకి ప్రజలు రావడానికి సదుపాయం లేదు, ఎటు ఉపయోగం లేని రిక్వెస్ట్ బస్టాండుని అక్కడి నుంచి పక్కకు కొద్ది దూరంలో ఏర్పాటు చేసేందుకు, తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోనెల నరేందర్, విజయ్ కుమార్, నాయకులు పిట్టెల నరేష్, బుక్క నవీన్ తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి

**దోమ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** మండల పరిధిలోని పాలెపల్లి గ్రామం నుండి దిర్సంపల్లి వెళ్ళు రోడ్డులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడం తొ ముగ్గురికి రక్త గాయాలు కాగా ఓ వ్యక్తి మరణించం జరిగింది.ఎస్ఐ ఆనంద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం సాయంత్రం 6 గంటల సమయంలో లింగన్పల్లి గ్రామానికి చెందిన నాగని దస్తయ్య(40) తన యొక్క బైక్ %ఝా34దీ%5225 పై నందర్వార్ నుండి తన స్వగ్రామం ఐన లింగనపల్లి వైపు వెళ్తుండగా అదే సమయం లో దిర్సంపల్లి గ్రామానికి చెందిన %ఝా34ఎ%7477 బైక్ పై చంద్రకంటి శ్రీనివాస్ (23), గొల్ల రమేష్ ఇద్దరు పాలేపల్లి గ్రామం నుండి దిర్సంపల్లి వెళ్ళు రోడ్డులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొనడం జరిగింది. ఈ ప్రమాదం లో నాగాని దస్తయ్య, చంద్రకంటి శ్రీను మరియు గొల్ల రమేష్ లకు తీవ్ర రక్త గాయాలు కావడంతో వారు ముగ్గురిని ఆసుపత్రి కి తరలించగా నాగని దస్తయ్య ఈషా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఏడున్నర గంటల ప్రాంతంలో చనిపోయినట్లు తెలిసిందని ,మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రి కి పోస్టుమార్టం గురించి పంపించడం జరిందని ,పిర్యాదు అనంతరం తగు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆనంద్ కుమార్ తెలిపారు.

## నిజమైన లబ్ధిదారులకే ఇందిరమ్మ ఇల్లు



**మాగనూర్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** ఇందిరమ్మ ఇళ్లు అర్హులకే ఇవ్వడం జరుగుతుందని మగనూర్ ఎంపీడీఓ రహమతుద్దీన్ తెలిపారు. మండలంలో ఇందిరమ్మ ఇండ్ల వెరిఫికేషన్ గత రెండు రోజుల నుండి మొదలు పెట్టడం జరిగిందనీ మండలంలో ముగ్గురు అధికారులు 16 గ్రామాలలో వెరిఫికేషన్ ప్రారంభించడం జరిగిందన్నారు. శుక్రవారం మండలంలోని తాళం కేరి గజరం దొడ్డి గ్రామాలలో ఎంపీడీవో రహమతుద్దీన్ పంచాయతీ కార్యదర్శి భాస్కర్ లు వెరిఫికేషన్ చేశారు.

## ఈదురుగాలులతో నేల వాలిన విద్యుత్ స్తంభాలు

- గంటల తరబడి నిలిచిన విద్యుత్ సరఫరా



**న్యాల్కల్, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** మోస్తారు వర్షానికి భారీగా వీచిన ఈదురు గాలులు తోడవడంతో మండలంలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. శుక్రవారం మధ్యాహ్నం మూడున్నర గంటల నుంచి గంట పాటుగా మోస్తారు వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, భారీగా వీచిన గాలులతో మండలంలోని మిర్జాపూర్ (ఎన్) గ్రామ శివారులో విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు నేల వాలాయి. మధ్యాహ్నం మూడున్నర గంటల నుండి రాత్రి 8 గంటల వరకు మండలంలో విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచి పోయింది. నేల వాలిన విద్యుత్ స్తంభాలకు మరమ్మత్తులు చేపట్టి, విద్యుత్ సరఫరాను తిరిగి పునరుద్ధరించేందుకు విద్యుత్ అధికారులు చర్యలు చేపట్టారు. తరచుగా కురుస్తున్న వర్షాలతో ఆరుతడి పంటలుగా సాగు చేసిన మండలంలోని రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పక్షం రోజుల వ్యవధిలో పలు మార్లు కురిసిన మోస్తారు భారీ వర్షాలతో ఆరుతడి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని రైతులు, కవులు రైతులు వాపోయారు.

# చేర్యాలలో వికలాంగులకు సామూహిక భవనం నిర్మించాలి

- ఎమ్మెల్యే పల్లాకు వికలాంగుల వినతి

**చేర్యాల, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు,దూలిమిట్ట మండలాలకు చెందిన వికలాంగులు వారికి సామూహిక భవనం కొరకు ప్రభుత్వ స్థలం కేటాయించి ఆ స్థలంలో భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ శుక్రవారం జనగామ జిల్లా ఎమ్మెల్యే ను,సిద్ధిపేట జిల్లా రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ ను మర్యాదపూర్వకంగా కలిసి వారికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వికలాంగులు మాట్లాడుతూ.. చేర్యాల నియోజకవర్గంలో వికలాంగులు పెన్షన్ పొందేవారు 1800 పైచిలుకు ఉంటారన్నారు. పెన్షన్ పొందని వారు 600 మంది పైచిలుకు వికలాంగులు ఉన్నారన్నారు. ఈ నాలుగు మండలానికి చెందిన వికలాంగులం కలిసి ప్రతినెల మా యొక్క సమస్యలపై అలాగే ఇతరత్రా విషయాలపై చేర్యాల పరిధిలో దొరికిన చోటల్ల ఖాళీ ప్రదేశాలలో చెట్లల్లో పుట్లలో ఎండనక వానక అవస్థలు ఎల్లబోస్తూ తీవ్ర ఇబ్బందులకు గురవుతూ సమావేశాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భవనం కేటాయించి వికలాంగులకు ఇవ్వమని అడిగామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ స్థలాన్ని వికలాంగులకు తప్పకుండా కేటాయిస్తానని అన్నాడు.ఆర్డీవో స్పందించి వికలాంగులకు కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చాడు.ఈ కార్యక్రమంలో తెలంగాణ



వికలాంగ వేదిక సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు పర్వతం మల్లయ్య,జిల్లా అధ్యక్షుడు ఆరగొండ మల్లేశం, ప్రధాన కార్యదర్శి తుమ్మలపల్లి అనిల్, విహెచ్ పిఎస్ ఉమ్మడి వరంగల్ సీనియర్ నాయకుడు మోటం గణేష్,ఎన్ పి ఆర్ డి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు జేరిపోతుల నరసింహులు,చేర్యాల మండల మహిళా అధ్యక్షురాలు మేకల అండాలు, చేర్యాల మండల అధ్యక్షుడు సింగారపు యాదగిరి, తెలంగాణ వికలాంగుల వేదిక సంఘం సభ్యులు ఏ మల్లేశం, సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్రవాదాన్ని కూకటి వేళ్లతో పెకిలించాలి

**దేవరకొండ, ఏప్రిల్ 25 (జనం సాక్షి) :** జమ్మూకాశ్మీర్ లోని పెహల్గామ్ లో జరిగిన ఉగ్రవాదుల దాడి మానవత్వానికి మాయని మచ్చ అని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఉగ్రవాదాన్ని కూకటి వేళ్ళతో పెకిలించాలని దేవరకొండ జమియత్ ఉలేమా నేత మహ్మద్ ముఫ్తి జావిద్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ లు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో స్థానిక మక్కా మస్జీద్ చౌరస్తా వద్ద పెహాల్గామ్ లో జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ ముస్లిం లు పెద్ద ఎత్తున మానవహారం చేపట్టారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తపరచి, మౌనం పాటించి, అనంతరం నల్ల బ్యాడ్జీలు ధరించి తీవ్ర నిరసన తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాశవిక దాడిని తీవ్రంగా ఖండించారు. అమాయక పౌరులను హతమార్చడం దారుణం అన్నారు. దేశం పై దాడి జరిగి ఓ వైపు తల్లడిల్లుతుంటే,మరో వైపు దీన్ని రాజకీయ ఉనికి కోసం కొందరు వాడుకోవడం ఆందోళన కలిగిస్తుందన్నారు. ఉగ్రవాదానికి మతం ఉండదని ఏవరు ఇలా చేసిన క్షమించరానిదని. ఇస్లాం శాంతికి చిహ్నం అని,ఖురాన్ ప్రవచనాల్లో శాంతి.. ప్రేమ దాన ధర్మం మాత్రమే నేర్పబడుతాయని పేర్కొన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన మన ఆత్మీయ కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా సంతాపం ప్రకటించారు. ఇలాంటి ఘాతుకానికి పాల్పడ్డ




వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ సమయంలో శాంతి, సామరస్యం కు ఎలాంటి విఘాతం కలగకుండా చూడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహ్మద్ ఫరూఖ్ మౌలానా, సయ్యద్ మాజీద్ మౌలానా, మహ్మద్ రహత్ అలీ, మహ్మద్ ఇలియాస్ పటేల్, మహ్మద్ ఖాజా మైనొద్దీన్, మాజీ కౌన్సిలర్లు తౌఫిక్ ఖాద్రి, యండి ఇల్యాస్, మహ్మద్ ఉమేర్, కలిమ్ అన్సారీ, మహ్మద్ షబ్బీర్, సయ్యద్ మొయిన్ పాషా, మహ్మద్ రషీద్, ఫహీమ్ బాబా, ఫయాజ్, అకీఫ్, సాజీద్, సత్తార్, అతీక్, ఇర్ఫాన్, తదితరులు పాల్గొన్నారు.

# విపణి

## రియల్టీలోకి రూ.2.29 లక్షల కోట్లు

### సీఐఐ-సీబీఆర్ఈ నివేదిక వెల్లడి

**జనంసాక్షి:**రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో పెట్టుబడుల పట్ల సంస్థాగత ఇన్వెస్టర్లు ఉత్సాహం చూపిస్తున్నారు. ఈ రంగం 2022-24 మధ్యకాలంలో (మూడేళ్లలో) 26.7 బిలియన్ డాలర్ల (రూ.2.29 లక్షల కోట్లు) ఈక్విటీ పెట్టుబడులను అందుకున్నట్టు సీఐఐ-సీబీఆర్ఈ సంయుక్త నివేదిక తెలిపింది. ఇందులో పావు శాతం అంటే 6.7 బిలియన్ డాలర్లను ముంబై నగరం ఆకర్షించడం గమనార్హం.ముంబైతోపాటు ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు ఈ మూడు నగరాల నుంచి మార్కెట్లోకి వచ్చిన పెట్టుబడులు 16.5 బిలియన్ డాలర్లుగా ఉన్నట్టు ఈ నివేదిక వెల్లడించింది. మొత్తం రియల్ ఎస్టేట్ రంగంలోకి 2022-24 మధ్య వచ్చిన పెట్టుబడుల్లో 62 శాతాన్ని ఈ మూడు నగరాలు దక్కించుకున్నాయి. పెట్టుబడి శ్రేణికి సంబంధించిన ప్రాజెక్టులు ప్రధానంగా ఈ నగరాల్లో కేంద్రీకృతమై ఉండడం, బలమైన మౌలిక సదుపాయాలు, నైపుణ్య మానవ వనరుల లభ్యత, రియల్ ఎస్టేట్ రంగం క్రమంగా సంఘటితంగా మారుతుండడం ఈ మూడు నగరాలకు అనుకూలిస్తున్నట్టు ఈ నివేదిక వివరించింది.



## లాభాలకు చెక్..

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు

శుక్రవారం ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ ముగిసే సమయానికి భారీ నష్టాలను చవి చూశాయి. సెన్సెక్స్ 588.90 పాయింట్లు లేదా 0.74 శాతం నష్టంతో 79,212.53 వద్ద, నిఫ్టీ 207.35 పాయింట్లు లేదా 0.86 శాతం నష్టంతో..24,039.35 వద్ద నిలిచాయి.లక్ష్మీ ఫైనాన్స్ అండ్ ఇండస్ట్రియల్ కార్పొరేషన్, కారారో ఇండియా, బటర్‌ఫ్లై గాంధీమతి అప్లయెన్స్, మనక్సియా స్టీల్స్, కంట్రీ కాండోస్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో నిలువగా.. కాంట్రాక్టర్స్, వెంచర్స్, భండారీ హొజియరీ ఎక్స్‌పోర్ట్స్, మైండ్‌టెక్ (ఇండియా), మాగ్నమ్ వెంచర్స్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో ఉన్నాయి.




## పని సాఫీగా.. హాయిగా...



### మెరుగైన పని వాతావరణం కల్పించే సంస్థల జాబితా విడుదల

టాప్ టెక్ కంపెనీల్లో పని చేయాలని చాలామంది భావిస్తుంటారు. అందుకు వర్క్‌ప్లేస్ ఒక కారణం అవుతుంది. కొన్ని కంపెనీలు పరిశ్రమలో ఆదరణ పొందినా సరైన పని వాతావరణాన్ని కల్పించలేవు. అదే ఇంకొన్ని సంస్థల పేర్లు పెద్దగా వినిపించకపోయినా మెరుగైన వర్క్‌ప్లేస్‌ను అందిస్తాయి. భారత్‌లో మంచి పని వాతావరణాన్ని అందిస్తున్న కంపెనీల జాబితాను 'బ్లైండ్' అనే సంస్థ రూపొందించింది. వాటి వివరాలు కింది విధంగా ఉన్నాయి.గ్లోబల్ టెక్ దిగ్గజాలు ఆపిల్, గూగుల్, మెటా టాప్ 10 బెస్ట్ రేటింగ్ కంపెనీల్లో చోటు దక్కించుకోగా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇండస్ట్రీ లీడర్ ఎన్విడియా రిటైల్ దిగ్గజం టార్గెట్ సంస్థ తర్వాత రెండో స్థానంలో నిలిచింది. మరోవైపు అమెజాన్ కంపెనీ ఇండియాలోనే అత్యంత పేలవమైన వర్క్‌ప్లేస్‌గా ఉందని నివేదిక తెలిపింది. పేటీఎం, ఇన్ మొబి, కాయిన్ బేస్, ఐబీఎం, స్ప్రింక్లర్ వంటి ఇతర ప్రధాన టెక్ కంపెనీలు కూడా పేలవమైన వర్క్‌ప్లేస్ జాబితాలో చివరన నిలిచాయి.బ్లైండ్ సంస్థ దేశంలోని 7,020 కంపెనీల ఉద్యోగుల నుంచి సమాచారం సేకరించి ఈ జాబితాను సిద్ధం చేసింది. ఆరు కేటగిరీల్లో ప్రతి కంపెనీకి 5 పాయింట్ల స్కేలును నిర్ణయించినట్లు కంపెనీ తెలిపింది. ముఖ్యంగా బ్లైండ్ సంస్థ ఉద్యోగుల వేతనం, సంతృప్తికర పని వాతావరణాన్ని పరిగణలోకి తీసుకున్నట్లు పేర్కొంది. కొన్ని మెరుగైన కంపెనీలు కూడా కొన్ని అంశాలను అధిగమించలేకపోయాయని తెలిపింది.కంపెనీ కల్చర్ పరంగా టార్గెట్, ఎన్వీడియా, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, అకామై టెక్నాలజీస్, సర్వీస్ నౌ, జోహో, అరిస్టా నెట్‌వర్క్స్, మోర్గాన్ స్టాన్లీ, వీఎంవేర్, జేపీ మోర్గాన్ ఛేజ్ అండ్ కో అత్యధిక స్కోర్లను సాధించాయి. ట్రస్ట్ ఇన్ మేనేజ్‌మెంట్ కేటగిరీలో టార్గెట్, అమెరికన్ ఎక్స్‌ప్రెస్, సర్వీస్ నౌ, అరిస్టా నెట్‌వర్క్స్, ఎన్వీడియా, ప్యూర్ స్టోరేజ్, యాపిల్, హార్నెస్, ఈపీఏఎం సిస్టమ్స్ వంటి సంస్థలు రాణించాయి. గత ఏడాది కాలంలో భారతీయ నిపుణులు ఎక్కువగా సెర్చ్ చేసిన కంపెనీల్లో మెటా, అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్, యాపిల్, ఎన్వీడియా, బైట్ డాన్స్, నెట్‌ఫ్లిక్స్, ఓపెన్‌ఏఐ, వాల్‌మార్ట్ ఉన్నాయి. వీటితో పాటు ఇండియా ఆఫర్, లేఆఫ్, రిఫరల్, ప్రమోషన్, హెచ్-1బీ వంటి ట్రెండింగ్ సెర్చ్ పదాలు ఉన్నాయి.




## బ్యాంకులకు సెలవులే సెలవులు..

### మే నెలలో బ్యాంక్ హాలిడేస్ జాబితా..

ఏప్రిల్ నెల ముగియనుంది. మే నెల వచ్చేస్తోంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వచ్చే నెల సెలవుల జాబితాను కూడా విడుదల చేసింది. మే నెలలో శని, ఆదివారాలతో కలిపి మొత్తం 12 బ్యాంకు సెలవులు ఉంటాయి.మే 1, 2025 - కార్మిక దినోత్సవం, మహారాష్ట్ర దినోత్సవం, మే 4, 2025 - ఆదివారం, మే 9, 2025 - రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి,మే 10, 2025 - రెండవ శనివారం,మే 11, 2025 - ఆదివారం,మే 12, 2025 - బుద్ధ పూర్ణిమ,మే 16, 2025 - సిక్కిం స్టేట్ డే,మే 18, 2025 - ఆదివారం,మే 24, 2025 - నాల్గవ శనివారం,మే 25, 2025 - ఆదివారం,మే 26, 2025 - కాజీ నజ్రుల్ ఇస్లాం పుట్టినరోజు,మే 29, 2025 - మహారాణా ప్రతాప్ జయంతి, బ్యాంకులకు వెళ్లి చేసుకోవాల్సిన ఏదైనా అత్యవసరమైన పని చేసుకోవాలనుకునే వారు బ్యాంక్ హాలిడేస్ గమనించి ముందుగానే పనులు పూర్తి చేసుకోవాలి. అయితే ఆన్‌లైన్ సేవలు అన్నీ సెలవు దినాల్లో కూడా అందుబాటులో ఉంటాయి.




### పహల్గాం ఘటన..

## ఎల్ఐసీ కీలక ప్రకటన

జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన తరువాత బాధితుల కుటుంబాలకు అండగా నిలబడటానికి..త్వరితగతిన డెత్ క్లెయిమ్ పరిష్కారాలను అందించడానికి 'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' ఓ స్పెషల్ విండోను అందుబాటులోకి తీసుకొచ్చింది.' 'పహల్గాంలో అమాయక పౌరుల మరణం పట్ల ఎల్ఐసి ఆఫ్ ఇండియా తీవ్ర విచారం వ్యక్తం చేస్తోంది. మరణించిన వారి డెత్ క్లెయిమ్‌ను వీలైనంత త్వరగా పరిష్కరించడానికి ప్రత్యేక రాయితీలను ప్రకటించింది. దుఃఖంలో ఉన్న బాధిత కుటుంబానికి ఎల్ఐసి ఆఫ్ ఇండియా అండగా నిలుస్తుంది" అని ఎల్ఐసి మేనేజింగ్ డైరెక్టర్ అండ్ సీఈఓ సిద్ధార్థ మొహంతి ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.డెత్ క్లెయిమ్ ప్రక్రియ పూర్తిగా ఆఫ్‌లైన్‌లో ఉందని క్లెయిమ్‌దారులు తప్పకుండా గమనించాలి. ఈ ప్రక్రియను ప్రారంభించడానికి, నామినీ అవసరమైన అన్ని పత్రాలను తీసుకొని పాలసీని జారీ చేసిన ఎల్ఐసీ శాఖను సంప్రదించాలి. పాలసీ ప్రీమియంలు రెగ్యులర్‌గా చెల్లించి ఉంటే లేదా గ్రేస్ పీరియడ్‌లోపు మరణం సంభవించినట్లయితే క్లెయిమ్ సెటిల్‌మెంట్‌కు అర్హత ఉంటుంది.

క్లెయిమ్ ప్రాసెస్


నామినీ అవసరమైన పత్రాలతో.. పాలసీ జారీ చేసిన ఎల్ఐసీ బ్రాంచ్‌ను సంప్రదించాలి.పాలసీ నంబర్, తేదీ, మరణించడానికి కారణం వంటి వివరాలతో సర్వీసింగ్ బ్రాంచ్‌కు లిఖితపూర్వకంగా తెలియజేయాలి. నామినీదారునికి, మరణించిన వ్యక్తికి గల సంబంధాన్ని తెలియజేయడానికి ఫారమ్ సబ్మిట్ చేయాలి. అధికారిక మరణ ధ్రువీకరణ పత్రంగా.. స్థానిక మరణ రిజిస్టర్ నుంచి ధ్రువీకరించిన పత్రాలను సమర్పించాలి. వయస్సు ధ్రువీకరణ కోసం ఆధార్ లేదా పాన్ కార్డు వంటివి ఇవ్వాలి

## ఐటీఆర్ ఫైలింగ్‌కు వేళాయే..

గడిచిన 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేయడానికి సమయం ఆసన్నమైంది. దీనికి సంబంధించి ఆదాయపు పన్ను శాఖ త్వరలో ఆన్‌లైన్ ఫైలింగ్ పోర్టల్‌ను ప్రారంభించనుంది.ఈ నేపథ్యంలో రిటర్న్ ఎప్పుడు దాఖలు చేయాలి, గడువు ఎప్పుడు, రిఫండ్‌ను ఎప్పుడు పొందే అవకాశం ఉందనే అంశాల గురించి తెలుసుకుంది.ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి వచ్చిన తర్వాత 2025-26 మదింపు సంవత్సరానికి మీ ఐటీఆర్‌ను సమర్పించవచ్చు. ఇంకా దీనికి సంబంధించిన ధ్రువీకరణ తేదీని అధికార వర్గాలు వెల్లడించలేదు. అయినప్పటికీ ఆదాయ పన్ను శాఖ సాధారణంగా ఏటా ఏప్రిల్ నాటికి ఐటీఆర్ ఫారాలను అందుబాటులో ఉంచుతుంది. ఫారాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత పన్ను చెల్లింపుదారులు ఆదాయపు పన్ను శాఖ అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ రిటర్నులను ఈ-ఫైలింగ్ చేయడం ప్రారంభించవచ్చు.గత ఏడాది షెడ్యూల్ ప్రకారం జరిమానా లేకుండా రిటర్న్ దాఖలు చేయడానికి చివరి తేదీ జులై 31, 2024గా నిర్ణయించారు. జరిమానాలతో ఆలస్యంగా రిటర్న్ దాఖలు చేయడానికి డిసెంబర్ 31 వరకు అనుమతించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి కూడా ఇదే పరిస్థితి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. ఇప్పటికైతే ఎలాంటి ప్రకటన రాలేదు.రిఫండ్ ప్రక్రియను ఆదాయపు పన్ను శాఖ మరింత సులభతరం చేసింది. చాలా మంది పన్ను చెల్లింపుదారులు తమ రిటర్న్ దాఖలు చేసిన వారం నుంచి 20 రోజుల్లో వారి రిఫండ్లను పొందేందుకు వీలు కల్పిస్తున్నారు. అయితే పన్ను చెల్లింపుదారులు దాఖలు చేసిన రిటర్నుల్లో ఎలాంటి దోషాలు ఉండకూడదు. ఫైలింగ్ సమయంలో ఆధార్ ఓటీపీతో ధ్రువీకరించాలి. బ్యాంక్ ఖాతాను ముందుగా నమోదు చేసి పాన్‌తో లింక్ చేసుకోవాలి. మీ రిటర్న్‌ను సజావుగా, వేగంగా దాఖలు చేయడానికి అవసరమైన అన్ని పత్రాలను ముందుగానే సేకరించుకోవడం చాలా ముఖ్యం.

### యుద్ధవాతావరణ వేళ..

## భారత్, పాక్ బలాబలాలు ఇలా..



డిక్కీ బలిసిన కోడి చికెన్ కొట్టు ఎదురుగా తొడగొట్టిందట.. గట్టిగా యాభై కిలోమీటర్ల దూరం వెళ్లేందుకు మిలిటరీ వాహనాలకు డీజిల్ పోయలేరు..ఒకసారి ఫైటర్ జెట్లను ట్రయల్ రన్ తీయాలంటే లక్షలు ఖర్చు.. దానికి చేతగాదు.. యుద్ధ ట్రయాంకర్లకు ఆయుధాలు.. వంటివి ఫిక్స్ చేయాలంటే నట్లు .. బోల్టులు కరువే.. అసలు సైనికులకు యూనిఫారాలు. బూట్లు కూడా కొత్తవి ఇవ్వాలంటే పాతవాటికి మాసికాలు వేసుకుని రోజులీడుస్తున్న దారుణం.భారత్ నుంచి గోధుమపిండి ఇస్తే తప్ప మూడుపూటలూ ముద్దకు ఠికాణాలేని కరువు బతుకులు.. అలాంటి పాకిస్తాన్ ఇప్పుడు భారత్ కు సవాల్ విసురుతోంది. అంతర్జాతీయంగా భారత్‌కు ఉన్న విలువ, గౌరవం.. మార్కెట్ వాల్యూ.. సైనిక.. ఆర్థిక సంపత్తితో పోలిస్తే పాకిస్తాన్ ఒక పిపీలికం.. కానీ ఏదో తెగింపు.. దేశంలో పోతున్న పరువును కాపాడుకునేందుకు ఏదో ఒక బిల్డప్ ఇస్తూ అక్కడి సైనిక పాలకులు కాస్త ఓవర్ యాక్షన్ చేస్తున్నారు.. ఈ తరుణంలో భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య సైనిక బలాలు.. బలగాల మధ్య ఏపాటి వ్యత్యాసం ఉందో చూద్దాం. గ్లోబల్ ఫైర్‌పవర్ ఇండెక్స్ 2025 తాజా నివేదిక ప్రకారం ఇరు దేశాల మిలిటరీ శక్తి ఇలా ఉంది

సమగ్ర మిలిటరీ ర్యాంకింగ్: భారతదేశం: ప్రపంచంలో 4వ ర్యాంక్, పవర్ ఇండెక్స్: 0.1184 పాకిస్తాన్: ప్రపంచంలో 12వ ర్యాంక్, పవర్ ఇండెక్స్: 0.2513 మానవ వనరులు: మొత్తం జనాభా: భారతదేశం - 1.4 బిలియన్ ఎ పాకిస్తాన్ - 252 మిలియన్ యాక్టివ్ సైన్యం : భారతదేశం - 14,55,550 ఎ పాకిస్తాన్ - 6,54,000, రిజర్వ్ సిబ్బంది: భారతదేశం - 11,55,000 ఎ పాకిస్తాన్ - 5,50,000

పారా మిలిటరీ దళాలు: భారతదేశం - 25,27,000 ఎ పాకిస్తాన్ - 5,00,000

**వాయుసేన బలాబలాలు..**

మొత్తం విమానాలు: భారతదేశం - 2,229 ఎ పాకిస్తాన్ - 1,399
యుద్ధ విమానాలు: భారతదేశం - 513 ఎ పాకిస్తాన్ - 328
ఎటాక్ హెలికాప్టర్లు : భారతదేశం - 80 ఎ పాకిస్తాన్ - 57

**పదాతిదళం బలాబలాలు :**

ట్యాంకులు: భారతదేశం - 4,201 పాకిస్తాన్ - 2,627
ఆర్మర్డ్ వెహికల్స్: భారతదేశం - 1,48,594 ఎ పాకిస్తాన్ - 17,516
మొబైల్ రాకెట్ వ్యవస్థలు: భారతదేశం - 264 ఎ పాకిస్తాన్ - 600

**నావికాబలం :**


మొత్తం నేవీ స్థావరాలు.. కేంద్రాలు : 293 ఎ పాకిస్తాన్ - 121
ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్లు: భారతదేశం - 2 ఎ పాకిస్తాన్ - 0
జలాంతర్గాములు : భారతదేశం - 18 ఎ పాకిస్తాన్ - 8
డిస్ట్రాయర్స్: భారతదేశం - 13 ఎ పాకిస్తాన్ - 0

**రక్షణ ఖర్చు:**భారతదేశం: 75 బిలియన్ పాకిస్తాన్: 7.64 బిలియన్

ఇప్పుడు చెప్పండమ్మా.. ఎవరిది బలం.. ఎవరిది బలుపు.. గతంలో ఎన్నోసార్లు భారత్ మీదకు తెగబడి వారంరోజుల్లోనే చేతులెత్తేసి. మోకాళ్ళమీద నిలబడి శరణు వేడిన సందర్భాలు ఉన్నాయ్. బతికితే చాలు దేవుడా అంటూ పలాయనం చిత్తగించిన పాకీ సేనలు ఇప్పుడు మళ్ళీ ఏం చూసుకుని బోర్డర్లో సైనిక సన్నాహాలు చేస్తున్నాయో. తెగింపా.. తెంపరితనమా.. దేశంలో పరువుకాపాడుకునే క్రమంలో ఈ ఓవర్ యాక్టింగ్ అనివార్యమా.. ఏదైనా సరే.. భారత్ సేన ఒకసారి అడుగు ముందుకు వేస్తే అది పాక్ అంతు చూసేవరకూ ఆగేది లేదని భారత్ ప్రభుత్వం మరోసారి గట్టిగ్గా స్పష్టం చేసింది.

# జాతీయం అంతర్జాతీయం


## తాష్కెంట్ ఒప్పందానికీ చెల్లుచీటీ!



భారత్, పాకిస్థాన్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. కశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాదుల దుశ్చర్యను నిరసిస్తూ సింధు నదీ జలాల ఒప్పందం అమలును భారత్ నిలిపివేయడం, అందుకు బదులుగా 1972 నాటి సిమ్లా అగ్రిమెంటు అమలును పాక్ సస్పెండ్ చేయడం తెలిసిందే.తాష్కెంట్ ఒప్పందం నుంచి కూడా వైదొలగాలని పాక్ తాజాగా యోచిస్తోంది. 1965లో ఇండియాతో తలెత్తిన యుద్ధానికి ముగింపు పలికేందుకు పాక్ 1966లో తాష్కెంట్ (ఉజ్బెకిస్థాన్) శాంతి ఒప్పందానికి తలూపింది. నాటి సోవియట్ యూనియన్ మధ్యవర్తిత్వంతో 1966 జనవరి 10న తాష్కెంట్ వేదికగా భారత్, పాక్ మధ్య ఈ చారిత్రక శాంతి ఒప్పందం కుదిరింది.నాటి భారత ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి, పాక్ అధ్యక్షుడు మహమ్మద్ ఆయూబ్ ఖాన్ ఈ డిక్లరేషన్ మీద సంతకాలు చేశారు. నాటి సోవియట్ రాజకీయవేత్త అలెక్సీ కోసిజిన్ ఈ కార్యక్రమానికి సోవియట్ ప్రతినిధిగా హాజరయ్యారు. భారత్, పాక్ ఇరు దేశాలూ తమ సైనిక బలగాలను ఉపసంహరించుకుని వాటిని యుద్ధానికి ముందు నాటి స్థానాలకు మళ్లించడం, ఒక దేశ అంతర్గత వ్యవహారాల్లో రెండో దేశం జోక్యం చేసుకోకుండా నివారించడంతోపాటు దౌత్య, ఆర్థిక సంబంధాలను పునరుద్ధరించడం వంటివి ఈ డిక్లరేషన్ ప్రధానాంశాలు.అయితే కశ్మీర్ వివాద పరిష్కారంలో తాష్కెంట్ ఒప్పందం విఫలమైంది. 1971లో భారత్, పాక్ నడుమ మరో యుద్ధం సంభవించడం, బంగ్లాదేశ్ అవతరణ పరిణామాలతో 1972లో సిమ్లా ఒప్పందం కుదిరింది. అలా కశ్మీర్లో నియంత్రణ రేఖ ఏర్పాటైంది. అప్పట్నుంచి భారత్, పాక్ ద్వైపాక్షిక సంబంధాల్లో సిమ్లా అగ్రిమెంటుకు ప్రాధాన్యం పెరగడంతో తాష్కెంట్ ఒప్పందం కొన్ని దశాబ్దాలుగా మరుగునపడింది. సిమ్లా అగ్రిమెంటుకే విలువ ఇవ్వకుండా పక్కకు తప్పుకున్న పాక్ తాజాగా ఆరు దశాబ్దాల నాటి తాష్కెంట్ ఒప్పందం నుంచి వైదొలగాలని యోచించడం పెద్ద విశేషమేమీ కాదు.కాకపోతే పాక్ వైఖరిని గమనించడానికి ఇదొక ఉదాహరణ. చారిత్రకంగా ప్రాధాన్యమున్న శాంతిపరమైన బాధ్యతలను నెరవేర్చకుండా తప్పుకోవడం, కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయంగా రచ్చ చేయాలని చూడటం వంటివి పాక్ వ్యూహాలుగా కనిపిస్తున్నాయి.

## మిలిటెంట్ సంస్థలను పెంచి పోషించింది నిజమే..

నిజమేనంటూ స్వయంగా ఆ దేశ రక్షణమంత్రే అంగీకరించారు.ఓ అంతర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన చేసిన వ్యాఖ్యలు దాయాది నీచ బుద్ధిని బయటపెట్టాయి. అయితే, అమెరికా కోసమే తాము ఉగ్రవాదులను పెంచి పోషించామంటూ ఆ మంత్రి వ్యాఖ్యానించడం గమనార్హం.పహల్గాం దాడి తర్వాత భారత్‌తో నెలకొన్న ఉద్రిక్తతలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ 'స్కై న్యూస్' మీడియాకు ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ సందర్భంగా "ఉగ్ర సంస్థలకు నిధుల సమీకరణ, ఉగ్రవాదులకు శిక్షణ, మద్దతు వంటివి పాక్ చాలాకాలంగా చేస్తోంది? దీనిపై మీ స్పందన ఏంటి?" అని జర్నలిస్టు ప్రశ్నించారు. దీనికి ఖవాజా బదులిస్తూ.. "అమెరికా, బ్రిటన్ సహా పశ్చిమదేశాల కోసమే మూడు దశాబ్దాల పాటు మేం ఈ చెత్త పనులన్నీ చేస్తున్నాం. అయితే అది పొరబాటు అని అర్థమైంది. దానివల్ల పాక్ చాలా ఇబ్బందులు పడింది. సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా జరిగిన యుద్ధంలో మేం చేరకపోయి ఉంటే.. పాక్‌కు తిరుగులేని ట్రాక్ రికార్డ్ ఉండేది" అని అన్నారు. ఇదే ఇంటర్వ్యూలో లష్కరే తోయిబా గురించి ప్రస్తావించారు. అది పాత పేరు అని, ఇప్పుడు తమ దేశంలో దాని ఉనికిలేదని అన్నారు.మరోవైపు, ఉద్రిక్తతల నేపథ్యంలో సరిహద్దుల్లో పాక్ తన బలగాలను పెంచుతున్నట్లు తెలుస్తోంది. అఫ్గానిస్థాన్ సరిహద్దులతో పాటు బలోచిస్థాన్‌లో ఉన్న మిలిటరీ సిబ్బందిని నియంత్రణ రేఖ వద్దకు పంపిస్తున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. అటు జవాన్ల సెలవులను కూడా పాక్ మిలిటరీ రద్దు చేసినట్లు సమాచారం. కొత్త సెలవులను ఆమోదించొద్దని కార్ప్స్ కమాండర్లను ఆదేశించినట్లు ఆ కథనాలు పేర్కొన్నాయి.పహల్గాంలోని బైసరన్ లోయలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు.




## పెళ్లి ఆగిపోయింది!

జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడి పాకిస్తాన్, భారత్ దేశాల మధ్య ఉద్రిక్తతకి దారి తీసింది. ఈ సంఘటన నేపథ్యంలో భారత ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకుంది.ముఖ్యంగా ఐదు అంశాల కార్యాచరణ ప్రణాళికను ప్రకటించింది.ఇందులో అట్టారి-వాఘా సరిహద్దును తక్షణమే మూసివేయడం. ఈ ఆంక్షల నేపథ్యంలో రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌సింగ్ కలల వివాహం ఇప్పుడు నిరవధికంగా వాయిదా పడింది. సరిహద్దులు మూసివేయడంతో నిశ్చితార్థం దాకా వచ్చిన పెళ్లి నిలిచిపోయిందని ఆయన వాపోయాడు.రాజస్థాన్‌కు చెందిన సైతాన్‌సింగ్‌కు అట్టారీ సరిహద్దు దాటి పాకిస్థాన్‌లో ఉన్న యువతితో వివాహం నిశ్చయమైంది. పెళ్లికి ఇరు కుటుంబాలు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. వరుడి బంధువు చాలామంది ఇప్పటికే పాకిస్థాన్‌కు చేరుకున్నారు. ఇంతలోనే ఉగ్రవాదులు పహల్గాంలో మారణహోమం సృష్టించారు. 26 మంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. దీంతో భారత్ పాకిస్తాన్‌పై ఆంక్షలు విధించింది. సరిహద్దులను మూసి వేయడంతో వధువు ఇంటికి వెళ్లే అవకాశాలు మూసుకు పోయాయి. దీంతో సైతాన్‌సింగ్ ఏం చేయాలోఅర్థం కావడం లేదంటూకి ఇచ్చిన ఇంటర్వ్యూలో వాపోయారు."ఉగ్రవాదులు చేసింది తప్పు... సరిహద్దు మూసివేతో(పాకిస్తాన్‌కు) వెళ్లడానికి అనుమతించడం లేదు... ఇప్పుడు ఏమి జరుగుతుందో చూద్దాం." అన్నారు. అటు సైతాన్ సింగ్ సోదరుడు సురేందర్ సింగ్ కూడా మీడియాతో మాట్లాడుతూ, "పర్యాటకులపై జరిగిన దాడి చాలా తప్పు. దురదృష్టకర దాడి భారతదేశంలోని అనేక మంది అమాయక పౌరుల జీవితాలతో తమ కుటుంబాన్ని ప్రభావితం చేసిందన్నారు.కాగా ఈ ఉగ్రదాడి తరువాత ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించిన ఇతర చర్యలలో సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, పాకిస్తాన్ జాతీయులకు సార్క్ వీసా మినహాయింపు పథకాన్ని రద్దు చేయడం, పాకిస్తాన్ సైనిక సలహాదారులను బహిష్కరించడం , ఇస్లామాబాద్‌లో దౌత్య సిబ్బందిని తగ్గించడం ఉన్నాయి. జమ్మూ కాశ్మీర్ అంతటా భద్రతను కట్టుదిట్టం చేశారు. జమ్మూ-రాజౌరి-పూంచ్ జాతీయ రహదారిపై సైనిక నిఘా పెరిగింది, చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా కొనసాగుతోంది.

### మామే.. తండ్రై.. కన్నీటితో

## కోడలిని సాగనంపి..

కన్నవారిని, ఉన్న ఊరిని వదిలి, కోటి ఆశలతో అత్తింటికి చేరే కోడళ్లను కన్న కూతురిలా చూసుకునే కుటుంబాలు చాలా ఉన్నాయి. కానీ కొడుకు మరణం తరువాత కోడల్ని అక్కున చేర్చుకుని ఆదరించడమే కాకుండా, ఆమెకు మరో జీవితాన్ని ప్రసాదించిన కుటుంబాలు చాలా అరుదుగా ఉంటాయి.అలాంటి ఒక హృద్యమైన కథనం నెట్టింట వైరల్‌గా మారింది. అనేక ప్రశంసలు దక్కించుకుంది .గుజరాత్‌లోని అంబాజీ నివాసి ప్రవీణ్ సింగ్ రాణా. ముదిమి వయసులో ఆదుకుంటాడనుకున్న పెద్ద కుమారుడు సిద్ధరాజ్ సింగ్ అర్థాంతరంగా కన్నుమూశాడు. దీంతో తనతో పాటు కోడలు, నెలల వయస్సున్న చిన్న బిడ్డ అనాథలైపోయారు. కానీ ఇక్కడే ప్రవీణ్ సింగ్ తన పెద్దరికాన్ని చాటుకున్నాడు. కోడలికి తండ్రి స్థానంలో నిలబడ్డాడు. చక్కగా పెళ్లి చేసి అత్తారింటికి సాగనంపాడు. కోడలి,



మనవరాల్ని కన్నీటితో సాగనంపడం విశేషంగా నిలిచింది.2024లో దీపావళి పండుగ సందర్భంగా ఆకస్మిక గుండెపోటు రావడంతో కన్నుమూ శాడు. ఈ సంఘటనతో సిద్ధరాజ్ భార్య కృష్ణ, చిన్నారి దీక్షితతో సహా కుటుంబం మొత్తం దిగ్భ్రాంతికి లోనైంది. ఇక జీవితాంతం భర్తలేకుండా గడపాల్సి ఉంటుందని, తండ్రి లేకుండా తన కుమార్తెను ఎలా పెంచాలంటూ కృష్ణ అంతులేని శోకంలో మునిగిపోయింది. చుట్టుపక్కల సమాజం కూడా అలానే అనుకుంది.కానీ ప్రవీణ్ మనసు వేరేలా ఆలోచించింది. తన కుమార్తెలా చూసుకున్నాడు. సమాజం అభిప్రాయాలను, భయాలను పట్టించుకోకుండా, తన కొడుకు ప్రాణ స్నేహితుడు సంజయ్‌తో తన కోడలి కృష్ణకు వైభవంగా పెళ్లి జరిపించాడు. కోడలితో పాటు, మనవరాలు దీక్షిత తరలి పోతోంటే, తన తల్లితో వెళ్లిపోయినప్పుడు తాత భావోద్వేగంగా కన్నీళ్లు పెట్టుకున్నాడు. దీంతో నెటిజన్లు ప్రవీణ్,కుటుంబంపై ప్రశంసలు కురిపించారు. ఇలాంటి ప్రేమ, ఆప్యాయతలు కదా నేటి సమాజానికి కావాల్సింది అంటూ వ్యాఖ్యానించారు.కృష్ణను రెండో పెళ్లి చేసుకున్న సంజయ్ ప్రవీణ్‌కు ధన్యవాదాలు తెలిపారు. సిద్ధరాజ్ తన చిన్ననాటి స్నేహితుడనీ, కృష్ణను కొంతకాలంగా తనకు తెలుసునని చెప్పారు. కృష్ణ, దీక్షితను కంటికి రెప్పలా చూసుకుంటానని సిద్ధరాజ్ కుటుంబానికి సంజయ్ హామీ ఇచ్చాడు. తన స్నేహితుడి కుమార్తె , కోడలికి కొత్త జీవితాన్ని ఇవ్వాలనుకున్నాను. దీని గురించి ప్రవీణ్ సింగ్‌తో మాట్లాడాను. ఆయన మా పెళ్లికి అంగీకరించారు అని చెప్పుకొచ్చాడు. అటు కృష్ణ కూడా అత్త మామలకు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపింది.

# ధరణి వల్ల రైతులు ఆత్మహత్యల పాలయ్యారు

## భూ భారతి చట్టం అవగాహన సదస్సులో ఎమ్మెల్యే గండ్ర



**రేగొండ,ఏప్రిల్ 25( జనం సాక్షి):**

సంవత్సరాలుగా భూమి సాగుచేసుకుంటున్నా పట్టాలు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, భూ భారతి చట్టంతో అలాంటి రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయడం జరుగుతుందని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం రేగొండ, గోరి కొత్తపల్లి మండలాల్లోని రైతు వేడుకల్లో నిర్వహించిన భూ భారతి అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ సంవత్సరాలు గా భూమి సాగు చేసుకుంటున్నా పట్టాలు రాక రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.ధరణిలో అప్పీలు చేసుకునే అవకాశం లేకపోవడం వల్ల ప్రజలు సివిల్ కోర్టులకు వెళ్లాల్సి వచ్చేదని, దానివల్ల ఎన్నో వ్యవప్రయాసలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి ప్రజలకు సులువుగా భూ హక్కులు కల్పించే చట్టాన్ని తెస్తామని ప్రకటించామని, ఇచ్చిన మాట మేరకు ఈ 14వ తేదీన డా బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా భూ భారతి చట్టం అందుబాటులోకి తెచ్చామని అన్నారు. చట్టంపై ప్రజలకు అవగాహన కల్పనకు అన్ని మండలాల్లో భూ భారతి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ...దరణిలో మ్యుటేషన్ లో అభ్యంతరాలకు అప్పీలు చేయడానికి అవకాశం ఇవ్వలేదని, కానీ భూ భారతిలో.అప్పీలు చేయడానికి అవకాశం కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమాల్లో రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డిఓ రవి,
మండల ప్రత్యేక అధికారి సునీల్, తహసీల్దార్లు శ్వేతా, వీరభద్రం, ఎంపిడీఓలు వెంకటేశ్వర్లు, రామ్ ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ విజ్జనరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలి.



**జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.**
**మాదక ద్రవ్యాల పై జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశం.**

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

మాదకద్రవ్యాల నియంత్రణకు క్షేత్ర స్థాయిలో సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి నార్కో సమన్వయ సమావేశాన్ని ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు. జిల్లాలో నమోదవుతున్న ఎన్డిపిఎస్ కేసులు,గంజాయి సాగు నివారణ చర్యలు, మాధక ద్రవ్యాల వాడకం నియంత్రణ చర్యలు,మాదక ద్రవ్యాల నివారణ కోసం శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాల గురించి చేయాల్సిన విస్తృత ప్రచారం వంటి పలు అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ముఖ్య ప్రణాళిక అధికారి ప్రస్తుతం క్రాప్ కటింగ్ పరిశోధనలు జరుపుతున్నారని, వీరితో సమయం చేసుకుంటూ ఎక్కడైనా గంజాయి సాగు జరుగుతుందో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలలు ముగుస్తున్నం దున పరిసరాల్లో ఉన్న పాన్ షాప్ వంటి వాటిపై నిఘా పెట్టాలన్నారు.జిల్లాలో ఎక్కడా కూడా ఓపెన్ డ్రింకింగ్ జరగకుండా చూడాలన్నారు. ప్రతి మండలంలో తహసిల్దార్, ఎంపిడిఓ, పోలీస్, మండల వ్యవసాయ అధికారి,వైద్య అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి డ్రగ్స్ నియంత్రణ ప్రణాళిక రూపొందించాలన్నారు.జిల్లాలో ఉన్న సినిమా థియేటర్ల పరిసరాలను రాత్రి సమయంలో ఆకస్మికంగా తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో ఉన్న బార్లు,వైన్ షాప్ ప్రభుత్వ నిర్దేశిత సమయపాలన పాటించేలా చూడాలన్నారు. బార్ నిర్వాహకులతో వాట్స్ అప్ గ్రూప్ తయారు చేయాలని ప్రతి రోజూ ఎప్పుడు మూసి వేస్తున్నారో సమాచారం అందించాలన్నారు.డ్రగ్స్ నియంత్రణపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని, అవగాహన కార్యక్రమాల్లో డ్రగ్స్,గంజాయి వల్ల కలిగే నష్టాలు వివరించే వీడియోలను,పోస్టర్లను ప్రదర్శించాలన్నారు. డ్రగ్స్ పరీక్షల నిర్వహణకు అవసరమైన యూరిన్ కిట్లను పోలీసు,ఎక్సైజ్ శాఖ అధికారుల వద్ద అవసరమైన మేర అందుబాటులో ఉంచాలని కలెక్టర్ వైద్యారోగశాఖ అధికారికి సూచించారు.కళాశాలలో సడన్ గా వింతగా ప్రవర్తించే విద్యార్థులను గుర్తించాలని, ఎవరైనా డ్రగ్స్ గంజాయి తీసుకుంటున్నట్లు తెలిస్తే వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందజేయా లన్నారు.జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు,ఇటుక బట్టీల వద్ద అసిస్టెంట్ లేబర్ అధికారి ఆధ్వర్యంలో డ్రగ్స్ నియంత్రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.గ్రామ స్థాయి నుంచి డ్రగ్స్,గంజాయి అలవాటు ఉన్నట్లు ఏదైనా అనుమానం కలిగితే వెంటనే తమకు సమాచారం అందించాలని, మా దగ్గర అవసరమైన మేర డ్రగ్స్ నిర్ధారణ కిట్లు,నార్కోటిక్స్ గుర్తించే డాగ్స్ అందుబాటులో ఉన్నాయని వెంటనే పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలన వాల్ పోస్టర్స్, హ్యాండ్ బుక్ లను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో సిరిసిల్ల రెవెన్యూ డివిజన్ అధికారీ రాధా బాయి,అసిస్టెంట్ లేబర్ అధికారి నాజర్ అహ్మద్, డ్రాగ్ ఇన్స్పెక్టర్ భవాని,వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేష్, ఫుడ్ సేఫ్టీ అధికారి అనూష,విద్యా,వ్యవసాయ శాఖ అధికారులు ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యల సత్వర పరిష్కారానికే భూభారతి చట్టం..

**రెండంచెల అప్పీలు వ్యవస్థతో రైతులకు మేలు..**
**ప్రతి గ్రామంలో నాలుగు రకాల రికార్డుల నిర్వహణ అందరికీ కనబడేలా భూముల వివరాలు..**
**భూభారతి అవగాహన సదస్సులలో కలెక్టర్ పమేలా సత్పతి..**



**జమ్మికుంట, ఏప్రిల్ 25 (జనం సాక్షి):**

నిర్ణీత గడువులోగా రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకే రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చినట్లు కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం, ఇల్లందకుంట రైతు వేదికల్లో ఏర్పాటుచేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుల్లో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి చట్టంలో నిబంధనలు సరిగా లేకపోవడంతో తమ భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు రైతులు కోర్టుల చుట్టూ తిరిగే వారన్నారు.కేవలం కలెక్టర్ కే బాధ్యతలు అప్పగించడంతో పని భారం పెరిగి దరఖాస్తులు పరిష్కరించలే కపోయామని అన్నారు.ధరణి చట్టంలో ఉన్న 33 మాడ్యూల్స్ లో తమ సమస్య ఏం మాడ్యూల్ లోకి వస్తుందో తెలియక ఎలా ఫిర్యాదు చేయాలో తెలియక రైతులు ఇబ్బంది పడేవారని అన్నారు.భూ భారతి చట్టంలో తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కు అధికారాలు ఇవ్వడంతో రైతుల సమస్యలు సులువుగా పరిష్కారం అవుతాయని వివరించారు.కొత్త చట్టంలో మనిషికి ఆధార్ మాదిరి భూమికి భూదార్ సంఖ్య కేటాయించినట్లు తెలిపారు. దీంతో భూ ఆక్రమణలకు అడ్డుకట్ట పడుతుందన్నారు.న్యాయ నిపుణులు,రెవెన్యూ ఉన్నతాధికారులు, రైతు సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి భూభారతి చట్టం రూపొంది ంచారన్నారు.ధరణి చట్టంలో కబ్జాదారు కాలమ్, అనుభవదారు కాలమ్ పక్కన పెట్టడంతో సమస్యలు తలెత్తాయని.. భూభారతి చట్టంలో మాత్రం క్షేత్రస్థాయిలో సర్వే విచారణ జరిపిన తర్వాతే భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయనున్నట్లు వివరించారు.
ప్రతి గ్రామంలో నాలుగు రకాల రికార్డులను నిర్వహిస్తారని ఏటా జరిగే భూమార్పుల రిజిస్టర్, చెరువులు, కుంటలు వంటి భూముల రిజిస్టర్, గ్రామ పహానీ, ప్రభుత్వ భూముల రిజిస్టర్ వంటి రికార్డులు నిర్వహిస్తారన్నారు.రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సమయంలో తప్పులు జరిగితే అప్పీలు చేసుకునే హక్కు రైతులకు కల్పించారని వివరించారు.రైతులెవరు ఆందోళన చెందవద్దని.అందరి భూ సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ సూచించారు. గతంలో దరఖాస్తులను పరిష్కరించే అధికారం కలెక్టర్ కు మాత్రమే ఉండేదని ఇటీవల ప్రభుత్వం డెలిగేషన్ ఆఫ్ పవర్స్ తీసేసి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించే అధికారం తహసిల్దార్, ఆర్డిఓ లకు అప్పగించిందన్నారు. దీంతో జిల్లాలో ఉన్న భూ సమస్యలు 11 వేల నుంచి రెండు వేలకు తగ్గాయని పేర్కొన్నారు. హుజురాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు మాట్లాడుతూ భూభారతి చట్టంలో ఉన్న వివిధ సెక్షన్లను వివరించారు. ధరణి చట్టంలో తమ భూముల వివరాలను ఎవరికి కనిపించకుండా బ్లాక్ చేసే అధికారం రైతుకు ఉండేదని భూభారతి చట్టంలో బ్లాక్ చేసే అధికారం ఎత్తివేశారన్నారు. దీంతో రైతుల భూముల వివరాలు అందరికీ తెలుస్తాయని వివరించారు. మోకాపై వివాదాలు ఎత్తకుండా చట్టంలో పకడ్బందీ చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ సదస్సులలో జమ్మికుంట తహసిల్దార్ రమేష్ బాబు, ఇల్లందకుంట తహసీల్దార్ రాణి, జమ్మికుంట వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్లు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ హెచ్ఎఫ్ డిసి రుణాలను పునరుద్ధరించాలి

**హైదరాబాద్ (జనంసాక్షి)**

సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ, వికలాంగుల సాధికారకత విభాగం ఆధ్వర్యంలో వికలాంగులలో ఆర్థిక పునరావాసం కోసం ఆర్థిక సహాయం అందించి వికలాంగులు వారి వ్యాపారాలను అభివృద్ధి చేసుకోవడానికి అందించే రుణాలను నిలిపివేయడం జరిగింది. వెంటనే ఎన్ హెచ్ఎఫ్ డిసి ద్వారా రుణాలను పునరుద్ధరణ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా నిధులు రావడం వలన నిరుద్యోగ వికలాంగులకు మేలుజరిగే అవకాశం ఉంది. కానీ తెలంగాణ రాష్ట్రంలో ఒక్కరికి కూడా ఎన్ హెచ్ఎఫ్ డిసి ద్వారా రుణాలు రావడం లేదు. గతంలో ఎన్ హెచ్ఎఫ్ డిసి ద్వారా రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోవడం వలన కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం లేదు. గతంలో ఎన్ హెచ్ఎఫ్ డిసి ద్వారా రుణాలు తీసుకుని తిరిగి కట్టకుండా ఉన్నవారి నుండి రికవరీ
చేయాలని ఎన్ పిఆర్ డి డిమాండ్ చేస్తుంది.ప్రాజెక్ట్ వ్యయంలో ఎన్ హెచ్ఎఫ్ డిసి వాట 90 శాతం ఉంటే మిగతా 10శాతం లబ్ధిదారులు భరించాల్సి ఉంటుంది. దేశంలో చదువుకునే వారికి 10లక్షల వరకు, విదేశాల్లో చదువుకునే వారికి 20లక్షల వరకు విద్యారుణాలు అందించే అవకాశం ఉంది.తెలంగాణ రాష్ట్రంలో గతంలో ఎన్ హెచ్ఎఫ్ డిసి ద్వారా రుణాలు తీసుకుని కట్టకుండా ఎగవేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎన్ పిఆర్ డి డిమాండ్ చేస్తుంది.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఎన్ హెచ్ఎఫ్ డిసి రుణాలు పునరుద్ధరణ చేసే విదంగా చర్యలు తీసుకోవాలని ఎన్పిఆర్డి డిమాండ్ చేస్తుంది.

# వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలి

**రుద్రంగి ఏప్రిల్ 25 (జనం సాక్షి)**



వరి ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం రుద్రంగి మండల కేంద్రంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆకస్మిక తనిఖీ చేశారు.రైతులతో కొనుగోలు ప్రక్రియ పై వివరాలు అడిగి తెలుసుకున్నారు.వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంట కొనుగోలు లో వేగం పెంచాలని, కొనుగోలు కేంద్రాలకు వచ్చే వరి ధాన్యాన్ని సత్వరమే కొనుగోలు చేయాలని అన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులూ తలెత్తకుండా చూడాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ప్రతీ కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలింపు నిమిత్తం లారీలను కేటాయించామని తెలిపారు.ధాన్యం తరలించడానికి వాహనాల కొరత లేదని, రైతులు ఆందోళన చెందవద్దని స్పష్టం చేశారు.గతంలో రెండు లారీ ఏజెన్సీలు ఉండేవని కానీ ప్రజా ప్రభుత్వంలో వాటిని 5 ఏజెన్సీలకు అప్పగించి లారీల ఇబ్బంది లేకుండా చూస్తున్నట్లు పేర్కొన్నారు.రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తూకం వేయాలని నిర్వాహకులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతుల సౌకర్యార్థం కనీస వసతులు కల్పించాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే చెల్లింపులు పూర్తి చేయాలని అన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అన్ని సెంటర్లలో టార్పాలిన్ కవర్లు, అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన వసతులు కల్పించాలని, ప్యాడీ క్లీనర్, టార్పాలిన్ కవర్లు, వెయింగ్ యంత్రాలు తేమ యంత్రాలు మొదలగు సామాగ్రి అందుబాటులో పెట్టుకొవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి తోపాటు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కేబుల్ ఆపరేటర్లకు పోల్ టాక్స్ రద్దు చేయాలి



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 (జనంసాక్షి)**

సెసు పరిధిలోని కేబుల్ ఆపరేటర్లకు విధిస్తున్న పోల్ టాక్స్ రద్దు చేయాలని శుక్రవారం సాయంత్రం వేములవాడ నియోజకవర్గం కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కేబుల్ ఆపరేటర్లు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గం లోని (సెస్ పరిధిలో ) కేబుల్ ఆపరేటర్లుగా గత 30 సంవత్సరాల నుండి నిరంతరంగా గ్రామీణ ప్రాంతాలకు కేబుల్ ద్వారా న్యూస్ చానల్స్, ఎంటర్టైన్మెంట్ చానల్స్ అందజేస్తున్న ము.గ్రామీణ ప్రాంతాలలో జరిగే ప్రతి విషయాన్ని ప్రతి నిత్యం అధికారులు ప్రతినిధులు చేపడుతున్న పలు అభివృద్ధి పనులను, ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు చేరే విధంగా అందుబాటు లోకి తీసుకు వస్తున్న ఏకైక సంస్థ కేబుల్ ఆపరేటర్స్ సంస్థ. గ్రామీణ ప్రాంతాలలో జీవనం సాగిస్తూ చిరు వ్యాపారుల కింద కొనసాగే ఈ వ్యాపారంలో నిత్యం కొత్తదనంతో ప్రజలకు అందే విధంగా మేము కేబుల్ వ్యవస్థను సెస్ సహాకార వ్యవస్థ మమ్మల్ని పూర్తిగా నిర్వీర్యం చేయడానికి మాపై పోల్ టాక్స్ విధించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. అలాగే కార్పోరేట్ వ్యవస్థ జియో,ఎయిర్ టెల్ వంటి వ్యవస్థలు మమ్ములను ఆర్థికంగా దెబ్బతీస్తున్నాయి. ప్రతిరోజు మా యొక్క కేబుల్ కస్టమర్ల ఇంటికి తిరిగి ప్రతినెల చెల్లించే కేబుల్ బిల్లును వసూలు చేసుకుంటూ కొద్దిపాటి లాభాలతో మా కుటుంబాలను పోషించుకుంటున్నాం.ఇలాంటి సమయంలో మాపై భారం మోపితే మా బ్రతుకులు ఎలా బ్రతకాలో అర్థం కావడం లేదు. గత ప్రభుత్వాలు మా విన్నపాలు విని అట్టి పోల్ టాక్స్ ను రద్దు చేశారు.మళ్లీ పది సంవత్సరాల తర్వాత ఇప్పుడు సెస్ మాపై విధించే పోల్ టాక్స్ పూర్తిగా భారమై మా బతుకులను చిన్నాభిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారు.మా కేబుల్ ఆపరేటర్ల సంక్షేమం కొరకు పోల్ టాక్స్ ను రద్దు చేయించగలరనీ ప్రభుత్వ విప్ ను కోరమన్నారు.

# రక్షణతో కూడిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలి

**పని గంటలు పూర్తి స్థాయిలో వినియోగించాలి**
**సంస్థ డైరెక్టర్ (పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు**

**యైటింక్లయిన్ కాలనీ (జనంసాక్షి) :**



రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తూ, పని గంటలు పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని సంస్థ డైరెక్టర్ (పీఅండ్‌పీ) కె.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. శుక్రవారం ఆర్జీ-2 ఏరియా జీఎం బండి వెంకటయ్యతో కలిసి ఓసీపీ-3 ప్రాజెక్టును పరిశీలించారు. ముందుగా ఓసిపి-3 కృషి భవన్ నందు ప్రాజెక్ట్ అధికారి కార్యాలయం నందు అధికారులతో కలిసి సమావేశము నిర్వహించి గనికి కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలు, ఓవర్ బర్డెన్ లక్ష్యాలు అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలకు అనుగుణంగా ఓవర్ బర్డెన్ తొలగింపు పని స్థలాలు యంత్రాల వినియోగం పెంచుకోవాలని తదితర విషయాలను అధికారులకు సూచించారు. ఆనంతరం అమ్మవారి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి, ఉద్యోగులకు అందిస్తున్న క్యాంటిన్ సదుపాయాలను పరిశీలించి, స్వయంగా అధికారులతో, ఉద్యోగులతో కలిసి టిఫిన్ చేశారు. అలాగే ఓసిపి-3 వ్యూ పాయింట్ ద్వారా పని స్థలాలను పరిశీలించి, క్వారిలోనికి దిగి డ్రాగ్ లైన్, కోల్‌బెంచ్, ఆర్వీఆర్ గుత్తేదారు నిర్వహిస్తున్న ఓవర్ బర్డెన్ తొలగింపు పని స్థలాలను పరిశీలించారు. ఆనంతరం సిహెచ్పీ నుండి బొగ్గు రవాణా విషయాలను తెలుసుకున్నారు. వర్షాకాలం వచ్చే లోగా ఏరియాకు కేటాయించిన ఉత్పత్తి లక్ష్యాలు సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, యంత్రాల పూర్తి పని గంటలు వినియోగిస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు. అలాగే వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఇంటి నుండి బయటకు వెళ్లినప్పుడు తగు జాగ్రతలు తీసుకోవాలని, మంచి నీరు, మజ్జిగ తీసుకోవాలని వారు తెలిపారు. ఆయన ఏఐటియుసి బ్రాంచ్ సెక్రెటరీ జిగురు రవీందర్, ఎస్ఓటుజీఎం మాలోత్ రాముడు, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్టఅధికారి ఉదయ్ హరిజన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, సిఎంఓఏఐ ప్రతినిధి నర్సింహులు, డిజిఎం (పర్సనల్) ఎస్.అనిల్ కుమార్, డీజీఎం (ఐఇడీ) మురళీకృష్ణ, ఓసిపి%-%3 మేనేజర్ భారత్ కుమార్, డీజీఎం విజయ్ కుమార్, సిహెచ్పీ ఇంచార్జ్ సదానందం, సీనియర్ ఎస్టేట్స్ అధికారి జె.సునీత, డివైపిఎం వేణుగోపాల్, ఇతర అధికారులు, ఆర్వీఆర్ గుత్తేదారు ప్రతినిధులు, నాయకులు ఎల్.ప్రకాష్, రాజరత్నం ఉన్నారు.

# సరిహద్దుల ఆపరేషన్ వెంటనే ఆపాలి : రూపేష్

**చర్ల (జనంసాక్షి) :**

తెలంగాణ చత్తీస్గఢ్ సరిహద్దులో జరుగుతున్న ఆపరేషన్ ను వెంటనే ఆపాలని మావోయిస్టు పార్టీ నార్త్ వెస్ట్ సబ్ జోనల్ బ్యూరో రూపేష్ శుక్రవారం లేక విడుదల చేశారు.శాంతి చర్చలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శాంతి చర్చల ద్వారా సమస్య పరిష్కారం కావాలని అందరూ కోరుకుంటున్నారని, శాంతి చర్చలకు మా పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు. శాంతి చర్చలకు సంబంధించి మా పార్టీ కేంద్ర కమిటీ లేఖలు కూడా జారీ చేసిందన్నారు. విశ్వాస రాహిత్యాన్ని తొలగించేందుకు మా వైపు నుంచి నిరంతర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ప్రభుత్వ ఉద్దేశం వేరేలా కనిపిస్తోందన్నారు .శాంతి చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ అణచివేత, హింసాకాండ ద్వారా సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన పేర్కొన్నారు. దీని ఫలితంగా, బీజాపూర్-తెలంగాణ సరిహద్దులో భారీ సైనిక ఆపరేషన్ ప్రారంభమైంది. ఈ ప్రచారాన్ని వెంటనే ఆపాలి, బలగాలను ఉపసంహరించుకోవాలని కోరారు.చర్చల ద్వారా సమస్యను పరిష్కరించే మార్గాన్ని అనుసరించి అనుకూల వాతావరణాన్ని కల్పించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాం. ఈ మార్గం సానుకూల ఫలితాలను ఇస్తుంది. తుపాకీతో సమస్యను పరిష్కరించడానికి, ప్రభుత్వం అమలు చేస్తున్న కాగర్ సైనిక్ ప్రచారాన్ని ఒక నెల పాటు వాయిదా వేయండి. మా విజ్ఞప్తికి ప్రభుత్వం సానుకూల స్పందన కోసం మేము ఆశిస్తున్నామనీ రూపేష్ ఆ లేఖలో పేర్కొన్నారు.

# నేలపై కూర్చుండి.. విస్తరిలో భోంచేసి..

**ఆదిలాబాద్ ప్రతినిది. 25, (జనంసాక్షి)**



: భూ భారతి అవగాహన కార్యక్రమంపై శుక్రవారం జిల్లాలోని నార్నూర్ మండలంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఓ పేదింటి కుటుంబంలో అతిథిగా మారి అందరిని ఆశ్చర్య పరిచారు. వారితో కలిసి పోయి కాసేపు ముచ్చటించారు. అంతే కాదు జెల్లపల్లి సుకుమార్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి వారి మధ్య కూర్చుండి అరటి ఆకులో ఇటీవల ప్రభుత్వం పేదలకు అందించిన సన్న బియ్యం రుచిని ఏం చక్కా ఆరగించారు.భోజనం అనంతరం కలెక్టర్ ఆ కుటుంబ సభ్యులకు తన కృతజ్ఞతలు తెలిపారు.

# రాజన్న ఆలయంలో హై అలర్ట్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 25 (జనంసాక్షి)**




జమ్ము కాశ్మీర్ లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్ర దాడుల క్రమంలో దేశవ్యాప్తంగా మరిన్ని అల్లర్లు జరిగే అవకాశం ఉందని కేంద్ర ఇంటలిజెన్స్ విభాగము రాష్ట్రాలకు సూచించడంతో రాష్ట్ర ప్రభుత్వం అలర్ట్ అయింది.తెలంగాణ లోనీ అన్ని పుణ్యక్షేత్రాల్లో హైఅలెర్ట్ చేసిన పోలీసులు. తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అయిన వేములవాడ రాజన్న ఆలయానికి నిత్యం దేశ నలుమూలల నుండి వేలాదిమంది భక్తులు వస్తుంటారు.దీంతో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో శుక్రవారం రాజన్న ఆలయంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు.మెటల్ డిటెక్టర్ తో ప్రతి భక్తుడిని,వారు తెచుకున్న బ్యాగులను తనిఖీలు చేశారు. ఎస్పీఎఫ్ సిబ్బంది సీసీ కెమెరాలతో ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు.అనుమానిత వ్యక్తులు కనబడితే సమాచారం ఇవ్వాలని పోలీసులు సూచనలు చేశారు.

## మిల్లీమీటర్ భూమిని లాక్కోలేరు : గావస్కర్



మ్ముకశ్మీర్లోని పహల్గాంలో ఉగ్రవాదులు దారుణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే ఈ ఘటనపై ప్రపంచవ్యాప్తంగా సంఘీభావం వ్యక్తమైంది. ప్రధాని నరేంద్ర మోదీ గట్టి చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు. పలువురు భారత మాజీ, ప్రస్తుత క్రికెటర్లు తమ సంతాపం తెలియజేశారు. క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ కాస్త ఘాటు వ్యాఖ్యలు చేశారు. బెంగళూరు వేదికగా జరిగిన ఆర్సీబీ, ఆర్ఆర్ మ్యాచ్ అనంతరం సునీల్ గావస్కర్ ఉగ్రదాడిని ఖండిస్తూ స్పందించారు. ఉగ్రవాదులు, వారి మద్దతుదారులు 78 ఏళ్లలో సాధించింది ఏమీ లేదని, భవిష్యత్తులోనూ ఎలాంటి మార్పు ఉండదని పాక్కు పరోక్షంగా చురకలంటించారు. "ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబసభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నా. ఇది భారతీయులందరిపైనా ప్రభావం చూపిస్తుంది. ఈ సందర్భంగా ఉగ్రవాదులను, వారికి మద్దతుగా నిలిచే వారిని ఒక ప్రశ్న అడుగుదామనుకుంటున్నా. ఇదంతా ఏం సాధించడానికి చేస్తున్నారు? గత 78 ఏళ్లలో ఒక్క మిల్లీమీటర్ భూమినైనా కదల్చగలిగిరా? వచ్చే 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఎలాంటి మార్పులు ఉండవు. మరి ఎందుకు ప్రశాంతంగా జీవించకుండా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. మనం మరింత దృఢంగా ముందుకు సాగాలనేదే నా విజ్ఞాపన" అని గావస్కర్ వెల్లడించారు.



# రాణిస్తున్న సన్‌రైజర్స్

**చెన్నైని దెబ్బకొట్టిన హర్షల్ పటేల్.. సన్‌రైజర్స్‌ను ఊరిస్తున్న లక్ష్యం!**

సన్‌రైజర్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. చెన్నై 20 ఓవర్లలో 154 పరుగులకు ఆలౌట్ అయింది (డివాల్డ్ బ్రెవిస్ 42, ఆయుష్ మాత్రే 30). ఎస్ఆర్‌హెచ్ బౌలర్లలో హర్షల్ పటేల్ 4 వికెట్లతో అద్భుతంగా రాణించాడు. పాట్ కమిన్స్, జయదేవ్ ఉనద్కట్ తలో 2 వికెట్లు, మహ్మద్ షమీ, కమిందు మెండిస్ తలో 1 వికెట్ తీశారు. చెన్నై బ్యాటింగ్‌లో బ్రెవిస్, మాత్రే మినహా రవీంద్ర జడేజా (15), శివం దుబే (10), ధోని (8) నిరాశపరిచారు.
ఛేజింగ్‌లో ఎస్ఆర్‌హెచ్ 8 ఓవర్లలో 54/2 స్కోరుతో ఉంది. ఇషాన్ కిషన్ (27లి) మరియు హెన్రిచ్ క్లాసెన్ (7లి) క్రీజ్‌లో ఉన్నారు. ట్రావిస్ హెడ్ (19), అభిషేక్ శర్మ (0) ఖలీల్ అహ్మద్ బౌలింగ్‌లో ఔటయ్యారు. ఎస్ఆర్‌హెచ్‌కు 72 బంతుల్లో 101 పరుగులు అవసరం, ప్రస్తుత రన్ రేట్ 6.75, అవసరమైన రన్ రేట్ 8.41. నిపుణుల అంచనా ప్రకారం ఎస్ఆర్‌హెచ్‌కు 54.69%, సిఎస్‌కెకు 45.31% విజయావకాశం ఉంది.

జట్ల ప్రదర్శన

సిఎస్‌కె బ్యాటింగ్: సిఎస్‌కె బ్యాటింగ్ ఈ సీజన్‌లో అస్థిరంగా ఉంది. ఆయుష్ మాత్రే దూకుడుగా ఆరంభించినప్పటికీ కమిన్స్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. బ్రెవిస్ మధ్య ఓవర్లలో ఇన్నింగ్స్‌ను నడిపించాడు, కానీ హర్షల్ పటేల్ వరుస వికెట్లతో సిఎస్‌కె 154కే పరిమితమైంది. జడేజా, దుబే ఫామ్‌లో లేకపోవడం, రచిన్ రవీంద్ర బదులు సామ్ కరన్ ఆడినా ప్రభావం చూపలేకపోవడం సిఎస్‌కెకు ఇబ్బంది కలిగించింది. ధోని పెద్ద షాట్లు ఆడలేకపోయాడు.
ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ ఈ మ్యాచ్‌లో ఆకట్టుకుంది. హర్షల్ పటేల్ డెత్ ఓవర్లలో 4 వికెట్లతో సిఎస్‌కెను కట్టడి చేశాడు. కమిన్స్, ఉనద్కట్ మధ్య ఓవర్లలో నియంత్రణ పాటించారు. షమీ కీలక వికెట్ తీసుకున్నాడు. చెపాక్ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, రాహుల్ చాహర్ బదులు జీషాన్ అన్సారీని ఆడించడం ఫలించింది. ఎస్ఆర్‌హెచ్ జాగ్రత్తగా ఆరంభించింది. అభిషేక్ డకౌట్, హెడ్ ఖలీల్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. కిషన్ స్థిరంగా ఆడుతున్నాడు, కానీ రన్ రేట్ పెంచాల్సిన ఒత్తిడి ఉంది. క్లాసెన్, గత మ్యాచ్‌లో (ముంబైపై 71) ... ఉన్నాడు. నితీష్ రెడ్డి, అనికేత్ వర్మ తదుపరి కీలకం. ఖలీల్ అహ్మద్ రెండు వికెట్లతో ఒత్తిడి సృష్టించాడు. ... అహ్మద్ మధ్య ఓవర్లలో నియంత్రణ పాటించవచ్చు. జడేజా, అశ్విన్ చెపాక్‌లో ప్రభావవంతంగా ఉంటారు, కా... దూకుడుగా ఆడితే కట్టడి కష్టం.

# రో–కో సూపర్ ఫామ్



- టీమ్ ఇండియా విజయాలలో రోహిత్-కోహ్లీ జోడి కీలకం
- హిట్‌మ్యాన్ యొక్క దూకుడు, కోహ్లీ: చేజ్ మాస్టర్ స్థిరత్వం

భారత క్రికెట్ జట్టు ఇటీవల అద్భుత ప్రదర్శనలతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఈ విజయాల వెనుక రోహిత్ శర్మ మరియు విరాట్ కోహ్లీల జోడి, రో–కో అనే పేరుతో ప్రసిద్ధి, బ్యాటింగ్ లైనప్‌కు బలమైన స్తంభంగా నిలుస్తోంది. వీరి సమన్వయం, ఆటతీరు, నాయకత్వం టీమ్ ఇండియాను అంతర్జాతీయ వేదికలపై ఆధిపత్య శక్తిగా నిలబెట్టాయి. ఈ వ్యాసం రో–కో జోడి యొక్క సూపర్ ఫామ్, వారి సహకారం, భారత క్రికెట్‌పై ప్రభావాన్ని విశ్లేషిస్తుంది.
రోహిత్ శర్మ, హిట్‌మ్యాన్‌గా పిలవబడే ఈ ఓపెనర్, తన సహజసిద్ధమైన బ్యాటింగ్‌తో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులను సంపాదించాడు. అతని టైమింగ్, లాఫ్టెడ్ కవర్ డ్రైవ్‌లు, సిక్సర్‌లు బౌలర్లకు కష్టసాధ్యం. ఇటీవలి సిరీస్‌లలో రోహిత్ తన ఫామ్‌ను తిరిగి పొందాడు, ముఖ్యంగా వన్డే, టీ20 ఫార్మాట్‌లలో. అతని దూకుడైన ఆరంభం జట్టుకు వేగవంతమైన స్కోరింగ్ రేట్‌ను అందిస్తుంది, మిడిల్ ఆర్డర్‌కు స్వేచ్ఛగా ఆడే అవకాశాన్ని కల్పిస్తుంది.
విరాట్ కోహ్లీ, క్రికెట్ దిగ్గజం, తన స్థిరమైన ప్రదర్శనలతో జట్టుకు వెన్నెముకగా నిలుస్తున్నాడు. అతని టెక్నిక్, ఫిట్‌నెస్, మానసిక దృఢత్వం అతన్ని అసాధారణ బ్యాట్స్‌మన్‌గా చేశాయి. రన్–చేజ్‌లలో కోహ్లీ ప్రదర్శనలు జట్టుకు అనేక విజయాలను అందించాయి. అతని సమయోచిత ఇన్నింగ్స్‌లు, ఒత్తిడిలో స్వస్థత, ఆటను ముగించే సామర్థ్యం అతన్ని చేజ్ మాస్టర్‌గా నిలబెట్టాయి. న్యూజిలాండ్‌తో టీ20 మ్యాచ్‌లో కోహ్లీ అర్ధసెంచరీ సాధించి, కఠిన లక్ష్యాన్ని ఛేధించడంలో సహాయపడ్డాడు. అతని బ్యాటింగ్ ఆకర్షణీయంగా ఉండటమే కాక, బౌలర్లపై నిరంతర ఒత్తిడిని కొనసాగిస్తుంది. కోహ్లీ స్థిరత్వం రోహిత్ దూకుడుతో కలిసినప్పుడు, టీమ్ ఇండియా బ్యాటింగ్ అజేయంగా మారుతుంది.
రోహిత్, కోహ్లీ బ్యాటింగ్ శైలులు భిన్నమైనప్పటికీ, వారి సమన్వయం జట్టుకు బలాన్ని ఇస్తుంది. రోహిత్ దూకుడైన ఆరంభం వేగవంతమైన స్కోరింగ్‌ను అందిస్తుంది, కోహ్లీ స్థిరత్వం ఇన్నింగ్స్‌ను నిర్మిస్తుంది. ఈ కలయిక వన్డే, టీ20లలో భారత్‌కు భారీ స్కోర్‌లను, విజయాలను అందించింది. ఇంగ్లాండ్‌తో వన్డే మ్యాచ్‌లో వీరి భాగస్వామ్యం 300 పరుగులకు పైగా స్కోర్‌కు దారితీసింది, జట్టు మనోధైర్యాన్ని పెంచింది.

**నాయకత్వం, స్ఫూర్తి**

రోహిత్, కోహ్లీ కేవలం బ్యాట్స్‌మెన్‌లుగా మాత్రమే కాక, నాయకులుగా కూడా జట్టుకు సేవలందిస్తున్నారు. రోహిత్, వన్డే, టీ20 కెప్టెన్‌గా, శాంతమైన నాయకత్వంతో జట్టును నడిపిస్తున్నాడు. అతని వ్యూహాత్మక నిర్ణయాలు విజయాలను అందించాయి. కోహ్లీ, గతంలో టెస్ట్, వన్డే కెప్టెన్‌గా, ఉద్వేగభరిత నాయకత్వంతో జట్టును స్ఫూర్తిపరిచాడు. అతని ఫిట్‌నెస్ సంస్కృతి యువ ఆటగాళ్లకు ఆదర్శం. రోహిత్, కోహ్లీ ఇద్దరూ ఉత్తమ ఫామ్‌లో ఉన్నారు. రాబోయే ఐసీసీ టోర్నమెంట్‌లలో వారి ప్రదర్శనలు కీలకంగా ఉంటాయి. 2023 వన్డే వరల్డ్ కప్‌లో వీరి బ్యాటింగ్ ట్రోఫీని అందించే అవకాశం ఉందని అభిమానులు ఆశిస్తున్నారు. వీరి అనుభవం, యువ ఆటగాళ్లతో కలిసి, టీమ్ ఇండియాను అజేయ శక్తిగా మార్చగలదు.

## నా కుటుంబాన్నీ వదలట్లేదు: నీరజ్ చోప్రా



పాకిస్థాన్ జావెలిన్ త్రో అథ్లెట్ అర్షద్ నదీమ్‌ను భారత్‌కు ఆహ్వానించినందుకు భారత జావెలిన్ హీరో నీరజ్ చోప్రాపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్‌పై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతున్న తరుణంలో ఈ ఆహ్వానం అనవసరమని చాలామంది అభిప్రాయపడ్డారు. మే నెలలో బెంగళూరులో జరిగే ఎన్‌సీ క్లాసిక్ జావెలిన్ ఈవెంట్ సందర్భంగా నీరజ్‌పై విమర్శలు, అసభ్యకర వ్యాఖ్యలు, ముఖ్యంగా అతని కుటుంబాన్ని లక్ష్యంగా చేసిన టీకలపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్మీ నేపథ్యం ఉన్న నీరజ్, తన దేశభక్తిని ప్రశ్నించడం బాధాకరమని అన్నారు.
నీరజ్ చోప్రా తన స్పందనలో ఇలా పేర్కొన్నారు: "నేను సాధారణంగా తక్కువ మాట్లాడతాను, కానీ తప్పుని భావించినప్పుడు నోరు మూసుకోను. నా దేశం, కుటుంబం పట్ల నాకు అపారమైన గౌరవం ఉంది. ఎన్‌సీ క్లాసిక్ ఈవెంట్‌కు అర్షద్ నదీమ్‌ను ఆహ్వానించడంపై అనేక అసభ్యకర వ్యాఖ్యలు వచ్చాయి, నా కుటుంబాన్ని కూడా విమర్శించారు. నేను కేవలం ఒక అథ్లెట్‌గా, ఉత్తమ అథ్లెట్లను భారత్‌కు తీసుకొచ్చే ఉద్దేశంతోనే అర్షద్‌ను ఆహ్వానించాను. ఈ ఈవెంట్ లక్ష్యం ప్రపంచ స్థాయి క్రీడా కార్యక్రమాలను భారత్‌లో నిర్వహించగలమని నిరూపించడం. ఈ నిర్ణయం పహల్గాం ఉగ్రదాడికి ముందే తీసుకున్నాం. ఆ తర్వాత 48 గంటల్లో పరిస్థితులు మారాయి. అర్షద్ ఈవెంట్‌కు హాజరయ్యే అవకాశమే లేదు."
"నా దేశ ప్రయోజనాలే నాకు మొదటి ప్రాధాన్యం.
పహల్గాం ఘటనలో మన దేశ ప్రజలను కోల్పోయాం, వారి కుటుంబాలకు నేను అండగా ఉంటాను. ఈ ఘటనపై నాకు బాధ, కోపం రెండూ ఉన్నాయి. దేశం కోసం సంవత్సరాలుగా కష్టపడ్డాను, అయినా నా దేశభక్తిని ప్రశ్నించడం బాధ కలిగించింది. నన్ను, నా కుటుంబాన్ని లక్ష్యంగా చేసిన విమర్శలకు సమాధానంగా ఈ వివరణ ఇస్తున్నాను. అనవసర అపోహలు సృష్టించొద్దు. కొన్ని మీడియా సంస్థలు తప్పుడు కథనాలు ప్రచారం చేశాయి. గతంలో నా తల్లి అమాయకంగా చెప్పిన మాటలను ప్రశంసించిన ప్రజలు, ఇప్పుడు నన్ను టార్గెట్ చేయడం బాధాకరం. ఎక్కడికి వెళ్లినా భారత్ గర్వించేలా చేయడమే నా లక్ష్యం. సరైన కారణాలతో విమర్శిస్తే గౌరవంగా ఉంటుంది. జై హింద్!"
నీరజ్ తన సుదీర్ఘ పోస్ట్‌లో తన ఆవేదన, దేశభక్తిని వ్యక్తం చేశారు.

## భారత్-పాక్ ఒకే గ్రూప్‌లో తలపడవా?




2025 ఏప్రిల్ 22న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాం బైసరన్ వ్యాలీలో జరిగిన ఉగ్రదాడి, భారత్–పాకిస్థాన్ సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ దాడిలో 26 మంది పర్యాటకులు ప్రాణాలు కోల్పోగా, అనేక మంది గాయపడ్డారు. ఈ ఘటన రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచింది, దీని ప్రభావం క్రీడా రంగంపై, ముఖ్యంగా క్రికెట్‌పై కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి భవిష్యత్ ఐసీసీ టోర్నమెంట్‌లలో భారత్, పాకిస్థాన్‌లను ఒకే గ్రూప్‌లో ఉంచవద్దని ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ ని కోరినట్లు కొన్ని మీడియా నివేదికలు సూచించాయి. అయితే, ఈ విషయంపై బిసిసిఐ అధికారికంగా ధృవీకరించలేదని, ఇది ఊహాగానమేనని క్రిక్‌బజ్ నివేదించింది.
గత దశాబ్దంగా ఐసీసీ ఈవెంట్‌లలో భారత్, పాకిస్థాన్ ఒకే గ్రూప్‌లో ఉంటున్నాయి, ఇది ఆర్థికంగా లాభదాయకమైన మ్యాచ్‌లను నిర్ధారిస్తుంది. అయితే, పహల్గాం దాడి తర్వాత భారత్ దౌత్య సంబంధాలను తెంచుకోవడం, పాకిస్థానీ పౌరులను 48 గంటల్లో దేశం వీడాలని ఆదేశించడం వంటి చర్యలు ఈ నిర్ణయాన్ని ప్రభావితం చేయవచ్చు. బిసిసిఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, భారత ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తామని, ద్వైపాక్షిక సిరీస్‌లను ఆడమని, కానీ ఐసీసీ ఈవెంట్‌లలో ఆడతామని తెలిపారు. సెప్టెంబర్ 2025లో భారత్ ఆతిథ్యం వహించనున్న ఆసియా కప్‌పై కూడా ఈ ఉద్రిక్తతల ప్రభావం ఉండవచ్చు. ఈ టోర్నమెంట్ న్యూట్రల్ వేదికలో జరగనుంది, కానీ గ్రూప్ డ్రాలో భారత్–పాక్‌ను వేరు చేయడం కష్టమని, మీడియా రైట్స్ ఒప్పందం రెండు మ్యాచ్‌లను ఆశిస్తుందని నివేదికలు సూచిస్తున్నాయి. రాబోయే మహిళల వన్డే వరల్డ్ కప్ 2025 రౌండ్–రాబిన్ ఫార్మాట్‌లో ఉంటుంది, కాబట్టి గ్రూప్ విభజన సమస్య ఉండదు, కానీ పాకిస్థాన్ మ్యాచ్‌లు న్యూట్రల్ వేదికలో జరుగుతాయి. పహల్గాం ఘటన క్రికెట్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గితే, గ్రూప్ విభజనపై నిర్ణయం మారవచ్చు. ప్రస్తుతానికి, బిసిసిఐ జాతీయ భావోద్వేగాలను గౌరవిస్తూ, ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరిస్తుంది.

## ఉగ్రమూకల దాడిని నిరసిస్తూ తీగల గుట్టపల్లిలో భారీ క్యాండిల్ ర్యాలీ

**కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :**
జమ్మూ కాశ్మీర్లోని పహల్గాం ఉగ్రదాడిపై ఒకటో డివిజన్ తీగల గుట్టపల్లిలో కోదండ రామాలయ కమిటీ, ఉపాధ్యాయ సేవా సమితి, నిఫా, హిందూ సంఘాలు, మాజీ కార్పొరేటర్ కోలగని శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా తీగల గుట్టపల్లిలో మృతులకు సంతాపాన్ని తెలియజేసి, నివాళులర్పిస్తూ భారీ క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్ మాట్లాడుతూ.... జమ్మూ కాశ్మీర్లో ప్రజలు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకుంటున్న తరుణంలో పహల్గాం ఘటన తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందన్నారు. మతం అడిగి మరీ మారణకాండ సృష్టించడం, అత్యంత హేయనీయమన్నారు. ఉగ్రముకల దాడి ఇదొక క్రూరమైన, అమానవీయమని, పర్యాటకులను అమాయక పౌరులను, ప్రజలను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడడం పిరికిపంద చర్య అని తెలిపారు. ఉగ్రవాదుల చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు చెప్పారు. దాడి ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి దొంగ దెబ్బలతో భారతీయుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయ లేరని పేర్కొన్నారు. ఉగ్రవాదులు చేసిన దాడులకు మూల్యం చెల్లించుకోక తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు.




అమాయకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రవాదుల పట్ల భారత ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు.
కోదండ రామాలయ ఆలయ కమిటీ చైర్మన్ పాకాల రామ్ రెడ్డి , నిఫా రాష్ట్ర అధ్యక్షులు కే యాదవ రాజు, శ్రీ కోదండ రామాలయం ఉపాధ్యాయ సేవాసమితి సభ్యులు కాణిగంటి రాజమౌళి, అంజయ్య, హేమ నాగరాజు, ఒప్పుల కరుణాకర్, సదానందం, తునికే అశోక రాజు, జెల్ల నరేందర్ ,భరత కుమారస్వామి, పోతు ప్రభాకర్, శ్రీనివాస్ ,రఘునందన్ ,రాజురెడ్డి, దుగ్యాల భూమరావు, మేచినేని అశోక్ రావు, రాజ్కుమార్ , హిందూ సంఘాల నేతలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దు

**ఎస్ఐ బొల్లం వినయ్ కుమార్**

**స్టేషన్ ఘన్పూర్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** యువత మత్తు పదార్థాలకు బానిసై తమ విలువైన జీవితాలను ఆగం చేసుకోవద్దని స్టేషన్ ఘన్పూర్ ఎస్ఐ బొల్లం వినయ్ కుమార్ అన్నారు. మండలంలో ని తాటికొండ గ్రామంలో శుక్రవారం రాత్రి వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీమ్ శర్మ,సీఐ వేణు ఆదేశాలమేరకు గంజాయి డ్రగ్స్, గంజాయి, గుట్కా, తంబాకు తదితర మత్తు పదార్థల వలన కలిగే నష్టాలపై, మూఢ నమ్మకాలపై పోలీస్ కళాజాత బృందంచే పోలీస్ కళాకారులు కళారూపాల తో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వినయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామంలో గంజాయి అమ్మిన, సేవించిన చట్టపరంగా చర్యలు తీసుకొని, అట్టి వ్యక్తులపై కేసు నమోదు చేసి జైలుకు పంపించడం జరుగుతుందనిఅన్నారు.గంజాయిమత్తు పదార్థాల విషయంలో పిల్లలపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.
గ్రామంలో ఎవరైనా గంజాయి సరఫరా చేస్తున్నట్టు తెలిసిన, ఎవరి మీద అయినా అనుమానం అనిపిస్తే ఘనపూర్ పోలీస్ వారి కీ తెలియ జేయాలని తెలపడంజరిగింది.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది,పోలీస్ కళాకారులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులు దొంగిలిస్తున్న వ్యక్తి అరెస్ట్

- నిందితుడి వద్ద నుండి 150 గ్రాముల బంగారు ఆభరణాలు, 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం
- కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :**
కరీంనగర్ బస్టాండ్‌లో ప్రయాణికుల లగేజీ బ్యాగుల నుండి చోరీలు చేస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుండి 150 గ్రాముల బంగారు ఆభరణాలు , 10 లక్షల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. శుక్రవారం రోజు ఉదయం కమాన్ చౌరస్తా వద్ద కరీంనగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ బిల్లా కోటేశ్వర్ తమ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా, అనుమానాస్పదంగా ముఖానికి మాస్క్ ధరించి తిరుగుతున్న చిగురుమామిడి మండలం నవాబ్ పేట గ్రామానికి చెందిన కంది సంపత్ రెడ్డి (47), అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతను బస్టాండ్‌లో రద్దీగా ఉన్న బస్సుల్లో ప్రయాణిస్తూ, లగేజ్ స్టాండ్‌పై ఉన్న ప్రయాణికుల బ్యాగుల నుండి బంగారు నగలు, నగదును దొంగిలిస్తున్నట్లు అంగీకరించాడు. నిందితుడు గతంలో కూడా కరీంనగర్ , అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్లలో అరెస్ట్ అయి జైలుకు వెళ్ళి వచ్చాడని పోలీసులు తెలిపారు. సంపత్ రెడ్డి ఇటీవల ఫిబ్రవరి 24న కరీంనగర్ బస్టాండ్‌లో ఒక మహిళా బ్యాగ్ నుండి 47 గ్రాముల బంగారం, ఏప్రిల్ 8న గోదావరిఖని నుండి సికింద్రాబాద్ వెళ్లే బస్సులో ఒక వృద్ధుడి బ్యాగ్ నుండి 13 లక్షల రూపాయలు, ఫిబ్రవరి 14న హైదరాబాద్ వెళ్లే బస్సులో ఒక మహిళా బ్యాగ్ నుండి 16.5 తులాల బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు ఒప్పుకున్నాడు. దొంగిలించిన సొత్తును దాచి ఉంచడానికి ప్రయత్నిస్తుండగా అతన్ని పట్టుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసులు నిందితుడి నుండి స్వాధీనం చేసుకున్న నగదు, ఆభరణాలను సీజ్ చేసి, అతన్ని కోర్టులో హాజరు పరచనున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# గులాబీమయమైన ఎల్కతుర్తి మండలం

- తొలిసభ కావడంతో సభవేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు



**ఎల్కతుర్తి (భీమదేవరపల్లి) 25 ఏప్రిల్ ( జనం సాక్షి) :**
గులాబీ మయమైన హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి శివారులో బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ భాగంగా ఎల్కతుర్తి లో జరగబోయే సభకు సర్వం సిద్ధమైంది.బీఆర్ఎస్ పార్టీ 24 వసంతాలు పూర్తి చేసుకుని 25 వసంతాంలోకి అడుగు పెడుతున్న వేళ ఎల్కతుర్తిలో ఈ నెల 27వ తేదీన బీఆర్ఎస్ రజతోత్సవ సభ వేదికగా నిర్వహించేందుకు గులాబీ శ్రేణులు సిద్ధమయాయి. ఈసారి 10 లక్షల మందితో జరుగనుంది.ఘనంగా నిర్వహి ంచేందుకు అన్ని ఏర్పాట్లను చేసింది. తెలంగాణ వెలుపల ఎల్కతుర్తి లో జరుగుతున్న తోలి సభ కావడంతో సభ వేదికను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.ఎల్కతుర్తి మండలంలో సభస్థలికి వెళ్లే దారులన్ని గులాబీ మయమయ్యాయి. ఎల్కతుర్తి నంచి సభావేది కరకు అల ఎటు చూసినా గులాబీ రంగులో తోరనలు, ప్లెక్సిలు, బ్యానర్లు, ఏర్పాటు చేసిన భారీ బెలూన్లు,స్టిక్కర్లు అందరినీ అకట్టుకుంటున్నాయి. సీఎం కేసీఆర్ బోర్డింగ్ లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సభవేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా కేసీఆర్ సభ వేదికపై ఏమి మాట్లాడతారు మాటలు వినాలని ప్రజలు వివిధ రాజకీయ నాయకులు ఆసక్తికరంగా ఎదురుచూస్తున్నారని వివిధ పార్టీ వర్గాలు అనుకుంటున్నారు.
వివిధ పార్టీ పలువురు.సీనియర్ నేతలు గులాబీ కండువా కప్పుకోనున్నారు.ప్రతి ష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభకు పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు అవుతారని హైదరాబాద్, కరీంనగర్, హన్మకొండ, సిద్ధిపేట, ఖమ్మం, ఆదిలాబాద్, రాష్ట్రంలో 33 జిల్లాల మండలాలలోని అన్ని గ్రామాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చే అవకాశం ఉండడంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలో 33 జిల్లాల నుంచి కూడా బీఆర్ఎస్ పార్టీ నేతలు, శ్రేణులు సభకు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## భూభారతి చట్టంతో పెండింగ్ భూ సమస్యలకు పరిష్కారం

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావులు
- కొత్త చట్టంలో అప్పీలు వ్యవస్థ, 30 రోజుల్లో మ్యూటేషన్ పరిష్కారం



ములుగు ప్రతినిధి, ఏప్రిల్ 25 (జనంసాక్షి)
ధరణి చట్టం వల్ల సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలకు భూభారతి చట్టం ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని భద్రా చలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు తెలిపారు. శుక్రవారం వెంకటా పురం మండలంలోని పాత్రాపురం గ్రామంలో రైతు వేదిక వద్ద నిర్వహించిన భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన కార్యక్రమంలో ఆయన, జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్‌తో కలిసి పాల్గొన్నారు.
తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి చట్టం రైతులకు శాపంగా మారిందని, రైతులు, అధికారుల మధ్య వివాదాలను సృష్టించి, రైతులను ఆత్మహత్యల వైపు నెట్టిందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు, మేధావులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. ఈ చట్టం ద్వారా భూ సమస్యలు సత్వరమే పరిష్కారమవుతాయని, అప్పీలు వ్యవస్థ ద్వారా రైతులు వివిధ స్థాయిల్లో అధికారులకు విజ్ఞప్తి చేసుకోవచ్చని, కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆయన వివరించారు. వారసత్వ భూముల మ్యూటేషన్‌కు 30 రోజుల్లో పరిష్కారం లభిస్తుందని తెలిపారు.
జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ మాట్లాడుతూ, భూభారతి చట్టం రైతులకు, ప్రజలకు అనేక ప్రయోజనాలను అందిస్తుందని, ధరణి రికార్డులను భూభారతిలో నమోదు చేస్తున్నామని తెలిపారు. భూ రికార్డుల్లో తప్పులుంటే, చట్టం అమలులోకి వచ్చిన ఏడాదిలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అధికారులు గ్రామాలకు వచ్చి అర్జీలు స్వీకరించి, నిబంధనల ప్రకారం సవరణలు చేస్తారని, అభ్యంతరాలుంటే ఆర్డీఓ, కలెక్టర్, ల్యాండ్ ట్రిబ్యునల్‌కు అప్పీలు చేసుకోవచ్చని వివరించారు.
ఈ చట్టం రైతులకు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, నిర్దిష్ట కాలంలో సమస్యలను పరిష్కరించి, భూ హక్కులను ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. భవిష్యత్తులో వివాదాలు రాకుండా, పట్టా పాస్ బుక్‌లలో సమగ్ర వివరాలు, భూమి సర్వే మ్యాప్‌తో హక్కులు కల్పిస్తారని, ఆధార్ తరహాలో భూధార్ నంబర్ కేటాయిస్తారని వివరించారు. ఇంటి స్థలాలు, ఆబాది, వ్యవసాయేతర భూములకు కూడా హక్కుల రికార్డు ఉంటుందని, మోసపూరిత హక్కుల సృష్టిని రద్దు చేసే అధికారం అధికారులకు ఉందని తెలిపారు. ధరణిలో కొన్ని సమస్యలకు పరిష్కారం అసాధ్యమై, కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, కానీ భూభారతి ద్వారా తహసీల్దార్, ఆర్డీఓలకు దరఖాస్తుల ద్వారా సమస్యలు పరిష్కరించుకునే వెసులుబాటు కల్పించినట్లు కలెక్టర్ వివరించారు. సాదాబైనామా పెండింగ్ దరఖాస్తులను ఆర్డీఓలు పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని, రైతులు గ్రామ సభలలో అర్జీలు సమర్పించి లేదా ధరణి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రైతుల సందేహాలను కూడా నివృత్తి చేశారు.
అనంతరం, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకర్ టీఎస్ కలిసి కళ్యాణ లక్ష్మి, షాది ముబారాక్ చెక్కులను 15 మంది లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అప్పలనాయుడు, తహసీల్దార్ లక్ష్మీ రాజయ్య, వ్యవసాయ శాఖ అధికారి నవీన్, స్థానిక అధికారులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం
26 ఏప్రిల్ 2025

# ఉగ్రదాడికి నిరసనగా ముస్లింల ర్యాలీ



**కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు దాడి చేసి 26 మందిని కాల్చి చంపడాన్ని నిరసిస్తూ రాష్ట్రంలో పలుచోట్ల ముస్లింలు ర్యాలీ నిర్వహించారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతూ ఉగ్రదాడిని ఖండించారు. పాకిస్తాన్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారికి ఆత్మశాంతి కలగాలని మసీదుల్లో ప్రార్థనలు చేశారు.**

పాలకుర్తి, ఏప్రిల్ 25(జనంసాక్షి) : మండలంలోని జుమ్మా నమాజ్ సమయంలో జామ మసీద్ ఆవరనలో ముస్లింలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం పెద్దలు ఎండి. వహీద్, అబ్బాస్ అలీ మాట్లాడుతూ ఉగ్రవాదులను పాకిస్తాన్ పెంచి పోషిస్తుందని అన్నారు. ఇటువంటి ఘటనలు పుణరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిం చాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. ఈ కార్యక్రమమంలో ఎండి, సర్వర్ ఖాన్, ఎండి ఇమామ్, ఎండి సలీం, ఎండి బాబాఖాన్, ఎండి మహబూబా, ఎండి, రాజమహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.


**బూర్గంపహాడ్ ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక మస్జిదే దావత్ ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో పెహల్గాం ఉగ్రదాడి హేయమైన చర్య అని, ఈ దాడికి నిరసనగా ర్యాలీ చేపట్టారు. శుక్రవారం జుమ్మా నమాజ్ అనంతరం మసీదు నుండి సారపాక సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్ సలీం మాట్లాడుతూ కశ్మీర్‌లో ఉగ్రవాదుల అమానుష దాడి పిరికిపంద చర్య, ఇది మానవత్వంపై జరిగిన దాడిగా భారత ముస్లిం సమాజం భావిస్తుందన్నారు. ఈ దుర్ఘటనలో మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నామని... ర్యాలీ ద్వారా భిన్నత్వంలో ఏకత్వం అనే పవిత్రమైన భావనతో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందన్నారు. ఈ టెర్రరిస్ట్‌ల దాడులు మా ఉక్కు సంకల్పాన్ని చదరగొట్టలేరన్నారు. ఈ దారుణ ఘటనలో మరణించిన కుటుంబాలను మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

**బెల్లంపల్లి, ఏప్రిల్ 25, (జనంసాక్షి) :** కాశ్మీర్ లోని పహాల్గంలో పర్యాటకులపై దాడి చేసిన ఉగ్రవాదులను వెంటనే అంతమొందించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బెల్లంపల్లి పట్టణ ముస్లిం ప్రజలు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని మసీదుల వద్ద మధ్యాహ్నం నమాజు ముగిసిన అనంతరం ముస్లింలు మసీదుల నుంచి బజార్ ఏరియా వరకు ర్యాలీ నిర్వహించి ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశవ్యాప్తంగా ఈఘటనను ముక్త కంఠంతో ఖండించాలని పిలుపునిచ్చారు. ఉగ్రదాడిలో మరణించిన పర్యాటకులకు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఇస్లాం సందేశం శాంతి, సౌభ్రతృత్వం మాత్రమే అని, హింస అనే పదానికి ఇస్లాంలో చోటులేదని, ఇలాంటి ఉగ్ర చర్యలు జరుగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో అన్ని మసీదుల నుంచి ముస్లింలు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

**కథలాపూర్,ఏప్రిల్ 25,(జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని జామి మసీదు లో మొన్న జరిగిన జమ్ము కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన టూరిస్ట్‌ల ఆత్మ శాంతించాలని శుక్రవారం రోజు జమే మస్జీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కాశ్మీర్ సందర్శనకు వచ్చిన 30 మంది పర్యాటకులను ఉగ్రవాదులు దారుణంగా కాల్చి చంపడం అమనవీయా చర్య అని అన్నారు. మరణించిన వారి కుటుంబాలను ఆదుకొని గాయపడిన వారికీ మెరుగైన వైద్యం అందించాలని ఇలాంటి చర్యలు మళ్లీ పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇది ఒక కుటుంబానికి సంబంధించిన సమస్య కాదని యావత్ భారతదేశానికి సంబంధించిన ప్రతిష్ట అని ఇలాంటి సమయంలోనే అందరూ సంఘటితమై ఇలాంటి చర్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం నిఘా వ్యవస్థను ఇంకా పటిష్టం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమం లో మాజీ మండల కో అప్షన్ సభ్యులు ఎండీ.రఫీ చంద్ హాజీ,మొయిన్, ఇషాక్ షఫీ, షరీఫ్, షకీల్,ఫర్హాన్,హుస్సేన్, మౌలానా,అర్షద్, సాజీద్, మలీక్, అబ్రర్ ఆమన్‌అయాన్ షయాన్ ఆశ్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

**చేవెళ్ల, ఏప్రిల్ 25 (జనంసాక్షి):** జమ్మూకాశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతం బైసరన్ లోయలో పర్యటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా శుక్రవారం ఆలూరు గ్రామంలో ముస్లింలు ర్యాలీ నిర్వహించి పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. జరిగిన టెర్రరిస్ట డాడీ ముక్త కంఠంతో ఖండిస్తూ అలూర్ మైనార్టీలు జమ్ము కాశ్మీర్ లోని పహల్గాం వద్ద మంగళవారం నాడు జరిగిన టెర్రరిస్ట్ ముష్కరులు జరిపిన కాల్పుల ఆటవిక డాడీ సందర్భంగా అలూర్ ముస్లిం మైనారిటీస్ కమిటీ ముఖ్త కంఠంతో ఖండిస్తూన్నామని అన్నారు. నల్లబ్యాడ్జ్ లు ధరించి శుక్రవారం నాడు నమాజ్ చదివిన తర్వాత ర్యాలీ తీయడం జరిగింది. జై భారత్ జై జై భారత్ అంటూ..పాకిస్థాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదుల దాడిలో 28 మంది టూరిస్టులు మృతి చెందడం బాధాకరమని, కాశ్మీర్ దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చనిపోయిన వారి ఆత్మకు దేవుడు శాంతిని చేకూర్చాలని మౌనం పాటించి ప్రార్థనలు చేశారు. యావత్ దేశ ప్రజలు సోక సముద్రంలో మునిగి పోయారన్నారు. ఏ కులం ఏ మతం అని అడిగి చంపడం హీనమైన చర్య, జంతులవలే ప్రవర్తించడం ఇది ఇస్లాంకి వ్యతరేకం అని అన్నారు. భారత దేశ ప్రజలు అందరూ ఐక్యతతో ఉండి ఉగ్రవాదుల అంతు చూడాలన్నారు. ర్యాలీ లో అలూర్ ముస్లింలు అందరు పాల్గొన్నారు.


చేవెళ్లలో..


పాలకుర్తిలో..


బెల్లంపల్లిలో..


బూర్గంపాడులో..

## నోవాటెల్‌లో భారత్ సమ్మిట్ ప్రారంభం

- సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి పొంగులేటి




హైదరాబాద్, ఏప్రిల్25 (జనంసాక్షి) : హెచ్‌ఐసీసీలోని నోవాటెల్ వేదికగా తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో 'భారత్ సమ్మిట్' జరుగుతోంది. పెట్టుబడులు, న్యాయం, అహింస, ప్రపంచ శాంతి లక్ష్యంగా దీన్ని నిర్వహిస్తున్నారు. వివిధ దేశాల నుంచి ప్రతినిధులు తరలివచ్చారు. భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులకు ఘనస్వాగతం లభించింది. తెలంగాణ సంస్కృతి ప్రతిబింబించేలా కళాకారులు, పలువురు కాంగ్రెస్ నేతలు స్వాగతం పలికారు. బోనాల డప్పులు, సాంస్కృతిక కార్యక్రమాలతో సదస్సుకు వారిని ఆహ్వానించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు విదేశీ ప్రతినిధులు మంత్రముగ్ధులయ్యారు. భారత్ సమ్మిట్ – 2025 లో డెలిగేట్స్ సదస్సులో సమాచార పౌర సంబంధాలు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిపాల్గొన్నారు. ఎంపీ లు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఫీన్ ల్యాండ్, థాయ్ లాండ్, బ్రిటన్ తదితర దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ కేంద్ర మంత్రి దిగ్విజయ్ సింగ్ ఈ.సదస్సుకు సమన్వయ అధికారిగా వ్యవహరించారు.

## హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఎంఐఎం అభ్యర్థి

- మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండికి డిక్లరేషన్ సర్టిఫికెట్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 25(జనంసాక్షి): హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాతంగా ముగిసిందని రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్ లో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలో శుక్రవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు ఉదయం 10 గంటల లోపు ముగిసింది. ఎన్నికల పరిశీలకుల పర్యవేక్షణలో ఓట్ల లెక్కింపు పారదర్శకంగా, ఎన్నికల నియమావళికి అనుగుణంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ ఎన్నికల్లో 88 ఓట్లు పోల్ కాగా అందులో 63 ఓట్లు ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫ్ఫెండీ, 25 ఓట్లు బిజెపి అభ్యర్థి డా ఎన్ గౌతం రావుకు పోలయ్యాయని తెలిపారు .గెలుపొందిన అభ్యర్థికి రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి డిక్లరేషన్ సర్టిఫికెట్ ను అందజేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పోలింగ్, కౌంటింగ్ నిర్వహణలో ఏవిధమైన సమస్యలు తలెత్తకుండా ప్రశాంతంగా ముగిశాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ఎన్నికల విభాగపు అధికారులు, సిబ్బంది, ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి, పోలీస్ యంత్రాంగం, మీడియా ప్రతినిధులకు రిటర్నింగ్ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

## ఎఫ్‌డిడిఐని సందర్శించిన టి-సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డి





**హైదరాబాద్, ఏప్రిల్ 25 (జనంసాక్షి) :** హైదరాబాద్ రాయదుర్గంలోని ఫుట్ వేర్ డిజైన్ అండ్ డెవలప్ మెంట్ ఇనిస్టిట్యూట్ (ఎఫ్.డి.డి.ఐ) ను శుక్రవారం టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి సందర్శించారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నిర్వహిస్తోన్న ఎఫ్.డి.డి.ఐలో శిక్షణ కోర్సులకు సంబంధించి ఇనిస్టిట్యూట్ ఎగ్జుక్యూటీవ్ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి డాక్టర్ నర్సింహ్మాగారి తేజ్ లోహిత్ రెడ్డితో చర్చించారు. ఇనిస్టిట్యూట్ లో నిర్వహిస్తున్న కోర్సులు, శిక్షణ తీరు, యంత్రాల పనితీరు, తరగతి గదుల నిర్వహణను ఈడీతో కలిసి పరిశీలించారు. ఎఫ్.డి.డి.ఐ నిరుద్యోగ యువతకు ఎలా ఉపయోగపడుతోంది, శిక్షణ పొందిన తరువాత ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి, శిక్షణ పొందిన వారికి ఎఫ్.డి.డి.ఐ ఏమైనా ప్రోత్సాహాన్ని అందిస్తుందా అనే విషయాలను చర్చించారు. ఇనిస్టిట్యూట్ లోని శిక్షణ విభాగాలను కలియ తిరిగి యువతకు ఇచ్చే శిక్షణ తీరును పరిశీలించి ట్రైనర్లను శిక్షణ విషయాలపై ప్రశ్నించారు. ఇనిస్టిట్యూట్ లో ఫ్యాషన్ డిజైనింగ్, ఎంబీఏ ఇన్ రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైజ్ కోర్సులతో మాస్టర్ డిగ్రీ బోధనలుండగా, ఫుట్ వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్, లెదర్, లైఫ్ స్టైల్ అండ్ ప్రాడక్ట్ డిజైన్, బీబీఏ ఇన్ రిటైల్ అండ్ ఫ్యాషన్ మెర్చండైజ్ కోర్సులలో బ్యాచ్ లర్ డిగ్రీలో శిక్షణ ఉంటుందని, ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి సుమారు 350 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని టి–సాట్ సీఈవో వేణుగోపాల్ రెడ్డికి వివరించారు. ఉపాధి శిక్షణ అంశాల్లో భాగంగా టి–సాట్ అండ్ ఎఫ్.డి.డి.ఐ ఎంఓయూ ద్వార ఇక్కడ నిర్వహించే వృత్తి నైపుణ్య శిక్షణ కారక్రమాలను ప్రసారాలు చేయాలని టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి, ఎఫ్.డి.డి.ఐ ఈడీ తేజ్ లోహిత్ రెడ్డి ప్రాథమిక అవగాహనకు వచ్చారు.

### సివిల్స్ ర్యాంకర్ ను అభినందించిన సీఈవో

యూపీఎస్సీ ఇటీవల ప్రకటించిన సివిల్స్ ర్యాంకులతో ఆల్ ఇండియా 350వ ర్యాంకు సాధించిన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డిని టి–సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. ర్యాంకు సాధించిన సందర్భంగా తన అనభవాలను టి–సాట్ ద్వార పంచుకునేందుకు టి–సాట్ స్టూడియోకు వచ్చిన ఉదయ్ కృష్ణారెడ్డిని ఈ సందర్భంగా సన్మానించి అభినందించారు.

## ఉగ్రదాడిపై అసోం ముస్లిం ఎమ్మెల్యే ప్రేలాపనలు

- దేశద్రోహం కింద అరెస్ట్ చేసిన పోలీసులు



**గౌహతి, ఏప్రిల్25 (జనంసాక్షి) :** అసోం ముస్లిం ఎమ్మెల్యే ఒకరు కాశ్మీర్ ఉగ్రదాడిపై పిచ్చికూతలు కూశాడు. దానికి అతడిని వెంటనే అరెస్ట్ చేసి అదుపులోకి తీసుకున్నాడు. ఉగ్రవాదులకు మద్దతగా చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో మంగళవారంజరిగిన ఉగ్రదాడి గురించి అందరికీ తెలిసిందే. సైనిక దుస్తుల్లో వచ్చిన ముష్కరులు పర్యటకులపై కాల్పులు జరపగా.. మొత్తంగా 28 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది వరకు గాయపడ్డారు. ఈ ఉగ్రదాడిని భారత్‌తో పాటు ప్రపంచ దేశాలు ఖండిస్తున్నాయి. కానీ.. ఈ దాడిపై అస్సాంలో విపక్ష పార్టీ ఏఐయూడీఎఫ్ ఎమ్మెల్యే అమినుల్ ఇస్లామ్ పాకిస్థాన్‌కు మద్దతు పలికాడు. ప్రస్తుత పెహల్గామ్ ఉగ్రదాడి, అంతకుముందు 2019లో జరిగిన పుల్వామా ఉగ్రదాడి ఘటనలను ప్రభుత్వ కుట్రలో భాగమేనని దుర్మార్గపు వ్యాఖ్యలు చేశాడు.దీంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. ఎమ్మెల్యే అమినుల్ ఇస్లామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై దేశదోహ్రం కేసు నమోదు చేసినట్లు–సీఎం హిమంత బిశ్వ శర్మ వెల్లడించారు. బీఎన్ఎస్ సెక్షన్లు కింద కేసు నమోదైంది. మరోవైపు.. అమినుల్ వ్యాఖ్యలపై ఏఐయూడీఎఫ్ పార్టీ స్పందించింది. ఇతను చేసిన వ్యాఖ్యలతో తమకు ఎలాంటి సంబంధం లేదని.. ఈ వ్యాఖ్య తన వ్యక్తిగతమని చెప్పుకొచ్చింది. పాకిస్థాన్‌కు వత్తాసు పలుకుతూ మాట్లాడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అస్సాం హిమంత బిశ్వ శర్మ హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370